అనుదినం... జనస్వరం
# నవతెలంగాణ
శుక్రవారం 4-10-2019
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 5 | సంచిక : 278 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50




# మాట్లాడకుంటే హక్కులొస్తాయా?

## కేంద్రంపై కేసీఆర్, జగన్ మెతకవైఖరి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

- హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై 6న వెల్లడిస్తాం
- ఏపీ ఇసుక విధానంతో రాష్ట్రంలో నిర్మాణ రంగం సంక్షోభం
- మద్యం పాలసీపై మహిళా సంఘాలతో చర్చించాలి

**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

బీజేపీ సర్కారుపై తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ మెతక వైఖరి ఎందుకు వహిస్తున్నారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రశ్నించారు. కేంద్రంపై మాట్లాడకపోతే తమకు హక్కులు వస్తాయని అనుకోవడం అవివేకమన్నారు. సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సమావేశాలు ఢిల్లీలో జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం రాఘవులు మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది భారీ వర్షాలు పడినప్పటికీ వ్యవసాయం పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి గాని, నిరుద్యోగులకు ఉపశమనం కల్పించేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన ...9లో



**బీజేపీ నేత వ్యాఖ్యలు అభ్యంతరకరం**
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఖండన వివరాలు 3లో

# తెగని 'ఆర్టీసీ' చర్చలు

## 5న సమ్మె యథాతథం

- నిర్దిష్ట కాలపరిమితి చెప్పండి : జేఏసీ
- చెప్పలేం : సోమేష్‌కుమార్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడండి: మంత్రి పువ్వాడ సమీక్ష

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రతిష్టంభన ఏర్పడింది. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీతో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. ప్రభుత్వ కమిటీ నుంచి ఎలాంటి నిర్దిష్ట హామీ రాకపోవడంతో చర్చలు విఫలమైనట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. 5వ తేదీ నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె యథాతథంగా ప్రారంభమవుతుందని చెప్పారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీలో ఆర్థికశాఖ, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శులు రామకృష్ణారెడ్డి, సునీల్‌శర్మ ఉన్నారు. బుధవారం ...9లో


చర్చలు అనంతరం బయటకు వస్తున్న కార్మిక సంఘాల నేతలు

# ఖజానాకు కిక్కు

## ఐదు వేల జనాభాకు మద్యం శ్లాబ్


### భారీగా దరఖాస్తు రుసుము ధరల పెంపు

- నవంబర్ 1 నుంచి నూతన మద్యం విధానం
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- నీరాకు నిరాశే

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మద్యంతోనే ఆదాయాన్ని పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి నూతన ఆబ్కారీ విధానం ద్వారా రాష్ట్రంలో మద్యాన్ని పారించేందుకు ఏర్పాట్లు చేయబోతుంది. గ్రామాల్లో కూడా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిపేందుకు వీలు కల్పించింది.. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించేందుకు సర్కారు మద్యం షాపుల శ్లాబుల ధరలను పెంచడంతో పాటు దరఖాస్తు రుసుమును కూడా భారీగా పెంచింది. ప్రధానంగా అయిదు వేల జనాభాకు కూడా శ్లాబు ధరను నిర్ణయించింది. ఎన్నడూ లేని విధంగా అయిదు వేల జనాభాకు రూ.50 లక్షల శ్లాబు ఖరారు చేసింది. రాష్ట్రంలో బెల్టు షాపులను ప్రోత్సహించడానికే సర్కారు ఈ నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతమద్యం విధానం ద్వారా సుమారు రూ.30 వేలకోట్లు ఆర్జించిన సర్కారు.. ఈ నూతన ఆబ్కారీ విధానం ద్వారా రూ. 40 వేల కోట్లు ఆర్జించేందుకే మద్యం షాపుల శ్లాబు ధరలు, దరఖాస్తు రుసుమును పెంచిందనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ...9లో


(ఫైల్)



పాఠశాల విద్యలో కేరళ టాప్, ఉ.ప్ర. లాస్ట్! -నీతి ఆయోగ్




## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### సమ్మెను నివారించాలి

- వామపక్ష పార్టీల డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఈనెల 5వ తేదీ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మె చేయాలని పిలుపునిచ్చాయని వామపక్ష పార్టీలు తెలిపాయి. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమ్మె నివారణకు అవసరమైన ...9లో

# ఒత్తిడి భరించలేక తహసీల్దార్ ఆత్మహత్య

## ఎన్నికల కోసం 2018లో నిజామాబాద్‌కు తాత్కాలిక బదిలీ

- మళ్లీ హైదరాబాద్‌కు పంపకపోవడంతో నిరాశ

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి, కంఠేశ్వర్**

ఎన్నికల బదిలీలో భాగంగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూరల్ తహసీల్దార్‌గా వచ్చిన గిరిరావు పని ఒత్తిడి భరించలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బ్యాంక్‌కాలనీలో గురువారం ఉదయం వెలుగుజూసింది. ఘటనాస్థలాన్ని కలెక్టర్, జేసీ పరిశీలించారు. గిరిరావును మళ్లీ యథాస్థానానికి బదిలీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందంటూ రెవెనూ ఉద్యోగులు జిల్లా కేంద్ర ఆస్పత్రిని నుంచి



కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మృతుని బంధువులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం... నల్గొండ జిల్లా రామగిరికి చెందిన జ్వాల గిరిరావు హైదరాబాద్‌లోని తార్నాక తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే స్థిరపడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2018 అక్టోబర్ 22న అసెంబ్లీ ఎన్నికల బదిలీలో భాగంగా నిజామాబాద్ రూరల్ తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. నగరంలోని స్థానిక బ్యాంక్‌కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని గిరిరావు ఒక్కరే ఉంటున్నారు. సెలవు ...9లో

## హుజూర్‌నగర్ బరిలో 28 మంది

### ముగ్గురు స్వతంత్ర అభ్యర్థుల ఉపసంహరణ

**నవతెలంగాణ-హుజూర్‌నగర్ టౌన్**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. మొత్తం 31 మంది అభ్యర్థులకుగాను ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దాంతో 28మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారిలో సూర్యాపేట జిల్లా అంజలిపురానికి చెందిన కె.ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా పెరిందేవిగూడెంకు చెందిన రేఖల సైదులు, వరంగల్ జిల్లా గుడితండాకు చెందిన జి.శంకర్ ఉన్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ పద్మావతిరెడ్డి, టీఆర్ఎస్ నుంచి శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ నుంచి కోట రామారావు, టీడీపీ నుంచి చావా కిరణ్మయి పోటీలో నిలిచారు.

## టీఎస్ఐపాస్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి సోపానం

### భారత ఆర్థిక సమాఖ్య సదస్సులో మంత్రి కేటీఆర్

**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి సోపానమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా రెండు రోజులపాటు జరగనున్న ప్రపంచ ఆర్థిక సమాఖ్య సదస్సు గురువారం ప్రారంభమైంది. ఆ సమ్మిట్‌లో మంత్రి కేటీఆర్ 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' సెషన్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి కొత్త విధానాలు నిర్ణయించే అధికారం ఉన్నప్పటికీ, అసలైన కార్యాచరణ రాష్ట్రాల్లో ఉంటుందన్నారు. అభివృద్ధి పూర్వకమైన నాయకత్వంతో రాష్ట్రాలు ఆర్థికంగా ఎదుగుతాయని అభిప్రాయపడ్డారు. ఐదేండ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ చట్టం అనేక విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. తాము రూపొందించిన టీఎస్ఐపాస్‌తో ఇప్పటికే 11 వేలకు పైగా ...9లో

# ఉపాధి చూపే కోర్సులతోనే భవిత

### పరిశోధన పత్రాలకు డేటాబ్యాంక్ ప్రారంభించాలి

- ప్రభుత్వాలతో సంప్రదించి విద్యాభివృద్ధికి కృషి
- స్నాతకోత్సవాలు క్రమం తప్పకుండా జరగాలి : వీసీల సమావేశంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉపాధి అవకాశాలు చూపే కోర్సులుంటేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని విశ్వవిద్యాలయాల చాన్సలర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఉన్నత విద్యావకాశాలు పెరుగుతున్నాయి కానీ ఉపాధి అవకాశాలు మెరుగు పడడం లేదని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ...9లో

# తీగలాగితే..

### వైద్య బీమా స్కీంలో కుంభకోణం

- ప్రయివేటు ఆస్పత్రులతో అధికారుల కుమ్మక్కు?
- ఈజెహెచ్ఎస్ మందుల కొనుగోళ్లలో ఈఎస్ఐ డైరెక్టర్ చేతివాటం
- ఏసీబీ దర్యాప్తులో కొత్త కోణం

**నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి**

ఈఎస్ఐ ఐఎంఎస్ మందుల కుంభకోణంపై దర్యాప్తు సాగిస్తున్న ఏసీబీ అధికారులకు డాక్టర్ దేవికారాణికి సంబంధించి మరో కుంభకోణం బయటకు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే ఐఎంఎస్ డైరెక్టర్ హోదాలో కోట్ల రూపాయల మందుల కొనుగోల్‌మాల్‌కు పాల్పడ్డ దేవికారాణి


(ఫైల్)

అండ్ కో చేసిన అక్రమాలు బయటకొస్తున్నాయి. గతంలో ఎంప్లాయిస్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (ఈజెహెచ్ఎస్) డైరెక్టర్‌గా ఉన్న సమయంలో భారీ మొత్తంలో మందుల కొనుగోళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు వెలుగు చూసింది. 2017-18 లో డాక్టర్ దేవికారాణి ఈ విభాగానికి డైరెక్టర్‌గా పని చేసినప్పుడు ఈ అక్రమాలు చోటు చేసుకున్నాయని దర్యాప్తులో వెలుగు ...9లో

**ఈఎస్ఐ డైరెక్టర్‌గా అహ్మద్ నదీమ్** వివరాలు 9లో

# దాగుడుమూతలు

## రాష్ట్రం గట్టిగా అడగదు... కేంద్రం హామీ ఇవ్వదు

### కీలకం కానున్న బయ్యారం, కాళేశ్వరం, యురేనియం

- ప్రధానితో భేటీలోనైనా చర్చకు వచ్చేనా..?

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రానికి సంబంధించిన మూడు కీలక అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడుమూతలాడుతున్నాయి. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ప్రారంభించటం, కాళేశ్వరానికి జాతీయ హోదా వ్యవహారం గత ఐదేండ్లుగా నలుగుతుండగా తాజాగా యురేనియం వివాదం కూడా ఈ జాబితాలో చేరింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి అతి ముఖ్యమైన ఈ మూడు అంశాల గురించి ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో ఒత్తిడి లేక పోవటంతోనే కేంద్రం కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నదనే విమర్శలు కూడా ఉన్నాయి. బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పే అంశాన్ని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్నప్పటికీ దీనిపై ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. ఉక్కు కర్మాగారానికి అవసరమైన 200 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం అందుబాటులో లేక పోవటంతో ఇది ప్రారంభించటం సాధ్యం కాదని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ...9లో



**నేడు మోడీతో కేసీఆర్ భేటీ** వివరాలు 9లో

# బకెట్‌లో పడి బాలుడు మృతి

**నవతెలంగాణ - ఉట్కూర్**

నీళ్ల బకెట్‌లో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని పెద్దపొర్లలో గురువారం జరిగింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. వడ్డె రాములు- లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు(1) ఉన్నారు. వీరు



జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో వెళ్లారు. అయితే దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా స్వగ్రామం వచ్చారు. గురువారం లక్ష్మమ్మ ఇంట్లో పడుకున్న సమయంలో పక్కలో నుంచి లేచిన బాలుడు(1) ఆడుకుంటూ వెళ్లి నీళ్ల బకెట్‌లో పడిపోయి మృతిచెందాడు. కొంతసేపటి తరువాత లేచిన తల్లి బాలుని కోసం వెతకగా, బకెట్లో విగత జీవిగా కనిపించాడు. కొడుకుని మృతదేహాన్ని పట్టుకుని తల్లి గుండెలవిసేలా రోదించింది.

## జాతిపితకు ఘోర అవమానం

- చిత్రపటంపై 'దేశద్రోహి' అని రాసిన దుండగులు
- అవశేషాలు అపహరణ




**భోపాల్ :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజునే ఆయనకు ఘోర అవమానం జరిగింది. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా లక్ష్మణ్‌భాగ్‌లో ఉన్న ఆయన అవశేషాలను అపహరించిన దుండగులు.. అక్కడే ఉన్న గాంధీ చిత్రపటంపై 'దేశద్రోహి' అని రాశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. జిల్లాలోని బాపూభవన్‌లో ఉన్న గాంధీ అవశేషాలను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. అంతేగాక అక్కడే ఉన్న గాంధీ చిత్రపటంపై రాసి ఉన్న సూక్తిపై నల్లరంగు పూసి... 'దేశద్రోహి' అని రాయడం కలకలం రేపింది. గాంధీ జయంతి రోజున అక్కడకు వెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు.. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇదే విషయమై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుర్మీత్ సింగ్ మాట్లాడుతూ.. 'ఇది సిగ్గుచేటు. గాంధీని చంపిన గాడ్సే అనుచరులే ఈ చర్యకు పాల్పడి ఉంటారు. ఈ పిచ్చితనం ఇకనైనా ఆపాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు.

## 'ఉన్నత విద్య కమిషన్ బిల్లు'ను వ్యతిరేకించిన బీసీఐ

- వచ్చే నెలలో దేశవ్యాప్త నిరసనలు

**న్యూఢిల్లీ :** కేంద్రం ప్రతిపాదిస్తున్న ఉన్నత విద్య కమిషన్ (హెచ్ఎసీ) బిల్లును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వ్యతిరేకించింది. న్యాయ విద్యను బయటి వ్యక్తులతో బోధించడాన్ని అంగీకరించబోమని పేర్కొంది. ఈ మేరకు ప్రధానితో పాటు కేంద్రమంత్రులకు లేఖ రాసింది. ఈ మేరకు బీసీఐ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా స్పందిస్తూ.. న్యాయశాస్త్ర విద్యను సంబంధిత నిపుణులతో కాకుండా సోషల్ వర్కర్లు, బయటి వ్యక్తులతో బోధించడాన్ని తాము ఒప్పుకోబోమని చెప్పారు. కేంద్ర వైఖరికి నిరసనగా వచ్చే నెలలో రాష్ట్ర రాజధానుల్లో న్యాయవాదులతో కలిసి నిరసనలకు దిగుతామని అన్నారు. కేంద్రం తన వైఖరిని మార్చుకోకుంటే వచ్చే శీతాకాల సమావేశాల్లో పార్లమెంటును ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమై అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లతో కలిసి ఈ నెల 12న ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తామని మిశ్రా తెలిపారు.

## పౌరసత్వ బిల్లును ఉపసంహరించుకోవాలి

- మణిపూర్‌లో నిరసన ర్యాలీ




**గౌహతి :** కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై మణిపూర్ ప్రజలు భగ్గుమన్నారు. పౌరసత్వ(సవరణ) బిల్లును తిరిగి తీసుకువచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఇంఫాల్‌లో గురువారం వేలాది మంది ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. పౌరసత్వ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ బిల్లు అవసరం లేదని పేర్కొన్నారు. ఏమైనా హింసాత్మక ఘటనలు జరుగుతాయన్న అనుమానంతో భద్రతా బలగాలు వెంటనే అక్కడకు చేరుకున్నాయి. మణిపూర్ పీపుల్ అగైనెస్టు సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్(ఎంఎఎస్‌పీఏసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో దాదాపు 5 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. నార్త్ ఈస్ట్ ఫోరం ఆఫ్ ఇండీజినియస్ పీపుల్(ఎన్ఈఎఫ్ఐపీ) కార్యదర్శి కురైజాం మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారని తెలిపారు.

## గంగా నదిలో నిమజ్జనం చేస్తే 50వేల ఫైన్

**న్యూఢిల్లీ :** పండుగ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో గంగా నది, దాని ఉపనదుల్లో ప్రతిమలను నిమజ్జనం చేయకుండా కేంద్రం చర్యలు తీసుకుంటున్న ది. గంగా నది, దాని ఉపనదు ల్లో ప్రతిమలను నిమజ్జనం చేస్తే రూ. 50వేల జరిమానా విధించేందుకు నిర్ణయించినట్టు ఓ పత్రిక కథనం పేర్కొంది. పరిశుద్ధ గంగా మిషన్‌లో భాగంగా 15 మార్గదర్శకా లను గంగా బేసిన్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్రం జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని, ప్రతిమల నిమజ్జనం కోసం ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

## 'ఉగ్రదాడి' సంకేతాలతో ఢిల్లీలో అలర్ట్

**న్యూఢిల్లీ :** దేశరాజధానిలోకి జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు చొరబడ్డారని, దసరా పండుగ రోజున ఉగ్రదాడికి పాల్పడే అవకాశమున్నదన్న నిఘా వర్గాల హెచ్చరికతో ఢిల్లీ పోలీసు అధికారులు అప్రమత్త మయ్యారు. ఢిల్లీ మొత్తం భద్రత బలగాలను మోహరింప జేశారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్లు, మెట్రో స్టేషన్లు, మాల్స్‌లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 15 జిల్లాలకు చెందిన డీసీపీలకు ఈ మేరకు ఆదేశాలు వెళ్లాయి. మధ్య ఢిల్లీ డీసీపీ ఎంఎస్ రాంధ్వా మాట్లాడుతూ.. మాకు అలర్ట్ ఆదేశాలు వచ్చాయని, ఉగ్రకార్యకలాపాలను నిరోధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం అనేక ప్రాంతాలను తనిఖీలు చేస్తున్నారు. గెస్ట్‌హౌజ్‌లు, హెూటళ్లు, పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నవారి గుర్తింపునూ పరిశీలిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌పై కేంద్రం తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా ఉగ్రవాదులు ఈ పండుగ రోజున దాడికి పాల్పడే ప్రమాదమున్నదని నిఘా వర్గాలు హెచ్చరించాయి.

## మహానంద నదిలో పడవ బోల్తా

- ఏడుగురు దుర్మరణం.. 50 మందికి పైగా గల్లంతు

**మాల్దా :** పశ్చిమబెంగాల్ నుంచి బీహార్‌కు వెళ్తున్న ఓ పడవ మహానంద నదిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మరణించారు. మరో 50 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. కాగా, ఇప్పటి వరకు 12 మందిని రక్షించారు. మరణించినవారిని ఇంకా గుర్తించాల్సి ఉన్నది. ప్రస్తుతం అక్కడ గాలింపు, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. 70 మందితో వెళ్తున్న పడవ గురువారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో మునిగిపోవడంతో ప్రమాదం చోటుచేసుకున్నది. నదిలో నీటి ప్రవాహం సాధరణంగా ఉన్నదనీ, పడవలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో ప్రమాదం చోటు చేసుకున్నదని ప్రత్యక్షసాక్షి ఒకరు తెలిపారు.

## చిదంబరం కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం ఈ నెల 17 వరకు జ్యుడిషియల్ కస్టడీలోనే ఉండనున్నారు. ఈకేసులో ఆయన కస్టడీని పొడగిస్తు గురువారం ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తొలుత విధించిన 14 రోజుల రిమాండ్ పూర్తికావడంతో..సీబీఐ ఆయనను కోర్టులో గురువారం హాజరుపరిచింది.

# జర్నలిస్టుల నిరసన

## కాశ్మీర్‌లో సమాచార వ్యవస్థ నిర్బంధంపై ఆందోళన

- రెండు నెలలైనా పునరుద్ధరించని కేంద్రం
- మీడియా సెంటర్‌ను మానిటరింగ్ చేస్తున్నారని ఆరోపణ




**శ్రీనగర్ :** కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి రెండు నెలలు గడుస్తున్నా సమాచార వ్యవస్థను ఇంకా పునరుద్ధరించకపోవడాన్ని నిరసిస్తూ అక్కడి పాత్రికేయులు నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాశ్మీర్ ప్రెస్ క్లబ్ ఎదుట వాళ్లు ధర్నా చేశారు. 'కాశ్మీర్‌లో జర్నలిజాన్ని చంపేయకండి', 'కాశ్మీర్‌లో సమాచారవ్యవస్థను పునరుద్ధరించండి' అనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. మునుపెన్నడూ లేని విధంగా కాశ్మీర్‌లో సమాచార వ్యవస్థపై అప్రకటిత నిషేధం విధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ నుంచి లాల్‌చౌక్ దాకా ర్యాలీ తీశారు.

ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు స్పందిస్తూ.. ప్రపంచమంతా సాంకేతికతను అందిపుచ్చుకుంటుంటే తాము మాత్రం రెండు నెలలుగా ఫోన్లు, ఇంటర్నెట్ పనిచేయని స్థితిలో ఉన్నామని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న హెడ్ ఆఫీసులకు వార్తలు పంపించడానికి తాము తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని తెలిపారు. కాశ్మీర్‌లో ఎలాంటి ఆందోళనలు జరిగినా సమాచార వ్యవస్థను కట్ చేస్తున్నారన్నారు. వార్తల సేకరణకు వెళ్లడానికి సైతం అనుమతులు తీసుకుని పంపిస్తున్నారనీ, కొన్నిసార్లు ఆ అవకాశమూ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత కొన్నిరోజుల పాటు మీడియాపైనా ఆంక్షలు విధించిన మోడీ సర్కారు.. తర్వాత శ్రీనగర్‌లోని ఓ హెూటల్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటుచేసింది. అక్కడా సరిపడినన్ని కంప్యూటర్లు లేవనీ, తాము పంపే ప్రతి ఫైల్‌ను అధికారులు మానిటరింగ్ చేస్తున్నారని పాత్రికేయులు ఆరోపిస్తున్నారు. అంతేగాక మీడియా సెంటర్‌లో సీసీ కెమెరాలు అమర్చారనీ, కాశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులను వివరిస్తూ వార్తలు రాసే అవకాశం లేకుండా చేస్తున్నారని కాశ్మీర్ డైలీలో పనిచేస్తున్న ఉమర్ ముక్తర్ తెలిపారు. మీడియా సెంటర్‌లో తమకు గోప్యత లేదని ఆయన చెప్పారు. వార్తలు పంపించకపోవడంతో చాలా సంస్థలు ఉద్యోగులను తొలగిస్తున్నాయనీ, తద్వారా చాలామంది ఉద్యోగాలు కోల్పోతున్నారని ఉమర్ ఆవేదన వ్యక్తం చేశారు.

**దశలవారీగా విడుదల చేస్తాం : గవర్నర్ అడ్వైజర్**

కాశ్మీర్‌లో నిర్బంధించిన రాజకీయ నాయకులను, ఇతర రంగాలకు చెందిన వారిని దశలవారీగా విడుదల చేస్తామని రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు సలహాదారుడిగా వ్యవహరిస్తున్న ఫరూఖ్ ఖాన్ అన్నారు. శ్రీనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. నిర్బంధంలో ఉంచిన నాయకులను ఒక్కొక్కరిగా విడుదల చేస్తామని చెప్పారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత సుమారు 400 మంది రాజకీయ నాయకులు, వేర్పాటువాద నాయకులను కేంద్రం నిర్బంధించిన విషయం విదితమే. వీరిలో మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ వంటి వారూ ఉన్నారు.

## వ్యాపారాలు బంద్

- రెండు నెలల్లో రూ. 5 వేల కోట్లకు పైగా నష్టం : వర్తకులు



ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో సామాన్య ప్రజానీకమే గాక కాశ్మీర్‌లోని సమస్త రంగాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కమ్యూనికేషన్‌ను రద్దు చేయడం, నిరవధిక కర్ఫ్యూను విధిస్తుండటంతో కాశ్మీర్‌లో వర్తక వాణిజ్యాలు బంద్ అయ్యాయి. దీంతో రెండు నెలలుగా సుమారు రూ. 5 వేల కోట్లకు పైగా నష్టాలు వాటిల్లినట్టు కాశ్మీర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (కేసీసీఐ) తెలిపింది. నష్టాలే గాక వర్తకులను సైతం గృహ నిర్బంధంలో ఉంచడం, వారిని అరెస్టులు చేస్తుండటంతో వారంతా తిరిగి వ్యాపారం చేయడానికి భయపడుతున్నారని అక్కడి వ్యాపారులు చెబుతున్నారు. కాశ్మీర్‌కు ప్రధాన ఆకర్షణ పర్యాటక రంగం. కేంద్రం ఇక్కడ నిరవధిక కర్ఫ్యూ విధించడంతో కాశ్మీరీక్ పర్యాటకులను అనుమతించడం లేదు. దీంతో ఈ రంగంలో ఇప్పటికే సుమారు రూ. 1,500 కోట్ల మేర నష్టాలు వచ్చినట్టు కేసీసీఐ అధ్యక్షుడు షేక్ ఆశికి తెలిపారు. 1,300 హెూటళ్లు, 900 హౌస్‌బోట్లు, 650 సాధారణ బోట్లు రెండు నెలల నుంచి ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. అంతేగాక శ్రీనగర్‌లో ఉన్న సుమారు 70 వేల దుకాణ సముదాయాలను మూసివేయడంతో వారంతా ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని సంబంధిత వ్యాపారులు చెబుతున్నారు. ఇక రాష్ట్ర జీడీపీకి ప్రాణాధారమైన కాశ్మీర్ ఆపిల్ సైతం మునుపెన్నడూ లేని విధంగా నష్టాలను చవిచూస్తున్నది. ఓవైపు కేంద్రం నిర్బంధం మరోవైపు ఉగ్రవాద సంస్థల బెదిరింపుల నేపథ్యంలో ఆ రంగం తీవ్రంగా ప్రభావితమ వుతున్నది. జమ్మూకాశ్మీర్ ఆర్థిక వ్యవస్థలో 2 శాతం ఉన్న హస్తకళల (హ్యాండీక్రాఫ్ట్) రంగం సైతం సవాళ్లను ఎదుర్కొంటున్నది. శ్రీనగర్‌లో ట్రావెల్ ఏజెన్సీ నడిపే షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లడానికి అంతకుముందే సుమారు 2 వేల మంది బుక్ చేసుకున్నారనీ, కానీ కేంద్రం సమాచార వ్యవస్థలను రద్దు చేయడంతో వారి టికెట్లు ఇంకా కన్ఫర్మ్ కాలేదని చెప్పారు. దీంతో ఒక్కో ట్రావెల్ ఏజెన్సీకి రూ. 2 లక్షల దాకా నష్టం వచ్చినట్టు ఆయన వివరించారు. గడిచిన రెండు నెలల్లో రవాణా రంగంలో రూ. 500 కోట్ల మేర నష్టాలు వచ్చాయని ఫిరోజ్ తెలిపారు.

# జేఎన్‌యూలో ఏబీవీపీ వీరంగం

- కేంద్ర మంత్రిని ప్రశ్నించిన విద్యార్థులపై దౌర్జన్యం
- ఆర్టికల్ 370పై సెమినార్ సందర్భంగా...



**న్యూఢిల్లీ :** జాదవ్‌పూర్ యూనివర్సిటీ ఘటన మరవకముందే..తాజాగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) క్యాంపస్‌లో ఏబీవీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. ఆర్టికల్ 370..కాశ్మీర్‌లో శాంతి,అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ హాజరయ్యారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 370, 35ఏను ఎప్పుడో అమలు చేయాల్సిందని మంత్రి చెప్పారు. దీనికి నిరసనగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా)కు చెందిన కొ ందరు మంత్రిని ప్రశ్నించే ప్రయత్నం చేశారు. ముందు కాశ్మీర్‌లో ఉన్న పరిస్థితులపై మంత్రి వివరించాలని ఐసా విద్యార్థులు డిమాండ్ చేశారు. మేం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీ జోక్యమెంటనీ.. ఏబీవీపీకి చెందిన విద్యార్థులు.. ముందుగా వచ్చిన కొందరు హిందూత్వమూకలు రెచ్చిపోయారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఏబీవీపీ విద్యార్థులు ..మంత్రిని ప్రశ్నిస్తున్న వారిపై అమాంతంగా దాడికి తెగబడ్డారు. దీంతో క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హెూదా కల్పించిన ఆర్టికల్ 370 ను ప్రభుత్వం ఆగస్టులో రద్దు చేసిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రులు కావాలనే ఒక వ్యూహం ప్రకారం వర్సిటీల్లో రగడ సృష్టిస్తున్నారని వామపక్ష విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## 'బాబ్రీ మసీదును కూల్చిన చోట భారీ నిర్మాణం'

**న్యూఢిల్లీ:**అక్కడ ఒకప్పుడు ఆలయం ఉండేదనేందుకు అనుమానాలకు వీల్లేని ఆధారాలు బాబ్రీ మసీదును కూల్చి వేసిన చోట ఉన్నాయని రామ్‌లల్లా తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. భారీ నిర్మాణం,శిథిలాలు అక్కడ ఆలయం ఉన్నదనేందుకు ఆధారాలని సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ కోర్టు దృష్టికి తెచ్చారు. ముస్లిం సంస్థల తరపు న్యాయవాదులు చెప్పినట్టుగా వివాదాస్పద స్థలం కింద నిర్మాణం ఈద్గా గోడ లేదా ఇస్లామిక్ మతానికి సంబంధించినది కాదంటూ వైద్యనాథన్ తన వాదన వినిపించారు. కాగా, పురావస్తుశాఖ సర్వే ప్రకారం అక్కడ ఆలయాన్ని కూలగొట్టినట్టు ఆధారాలేమీ లభించలేదని ముస్లిం పక్షాల తరపు సీనియర్ న్యాయవాది రాజీవ్‌ధావన్ తెలిపారు. దీనిపై స్పందించిన వైద్య నాథన్..తవ్వకాల్లో బయటపడింది వృత్తాకార పుణ్యస్థలాలు, స్తంభాల పునాదులు, ఆలయపు గదుల్ని కలిపే గోడలంటూ ప్రతివాదన వినిపించారు. అయోధ్యలోని బాబ్రీమసీదు, రామాలయం వివాదంపై సుప్రీంకోర్టులో వాదనలు కీలకదశకు చేరుకున్నాయి. ఈ అంశంపై చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం రోజువారీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

## నవ్‌లఖా పిటిషన్ విచారణ నుంచి తప్పుకున్న ఐదో జడ్జి ఎస్.రవీంద్ర భట్



**న్యూఢిల్లీ :** బీమా కొరెగావ్ కేసులో పౌరహక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖా దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి సుప్రీంకోర్టు మరో న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్ తనంతట తానే తప్పుకున్నారు. కాగా, ఈ కేసు విచారణ నుంచి తనంతట తాను తప్పుకున్న న్యాయమూర్తుల్లో భట్ అయిదవవారు. బీమా కొరెగావ్ కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడాన్ని నిరాకరిస్తూ బొంబాయి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ గౌతమ్ నవ్‌లఖా సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

జాబితా ప్రకారం, గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ వినీత్ సరన్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టాల్సి వుండగా, భట్ విచారణ నుంచి తప్పుకోవడంతో అక్టోబర్ 4కు వాయిదావేశారు. కాగా, తాను సభ్యునిగా లేని ధర్మాసనానికి ఈ కేసును బదలాయించాలని చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ సెప్టెంబర్ 30న పేర్కొన్నారు. మరుసటి రోజైన అక్టోబర్ 1న ధర్మాసనంలోని ముగ్గురు సభ్యులైన జస్టిస్ ఎన్వి.రమణ, జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి, జస్టిస్ బిఆర్.గవైలు ఈ కేసు విచారణ నుండి వైదొలిగారు.

ఐపీసీలోని చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ) కింద నవ్‌లఖాతో పాటు వరవరరావు, అరుణ్ ఫెర్రీరా, న్యాయవాది సుధా భరద్వాజ్, వెర్నన్ గాన్‌స్లేవ్స్‌లను ఈ కేసులో నిందితులుగా పేర్కొన్నారు.

## ఫైర్ సేఫ్టీ లేని నిర్మాణాలను సీల్ చేయండి

- ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించిన హై కోర్టు

**న్యూఢిల్లీ:** రాష్ట్రంలో అగ్నిమాపక నిబంధనలకు అనుగుణంగాలేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, అవసరమైతే సీల్ కూడా చేయాలని ఢిల్లీ హైకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బిల్డింగ్‌లలో అగ్నిమాపక పరికరాలు లేకున్నా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినా అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించింది. ఆజాద్‌పూర్‌లో ఫైర్ సేఫ్టీ లేకుండా రెండు వాణిజ్య సముదాయాలను నిర్మించారనీ, ఆ రెండింటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అన్ని భవంతులనూ సీల్ చేయాలని కోరుతూ కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన డి.ఎన్ పటేల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. కాగా, ఆ రెండు వాణిజ్య సముదాయాలకు కొన్ని నెలల కిందటే అనుమతులిచ్చామని ఉత్తర ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ వివరణ ఇవ్వడంతో ఆ కేసును కోర్టు కొట్టివేసింది.

## బీహార్ వరద బాధితుల నిరసనలు

- పరిస్థితిని చక్కదిద్దడంలో ప్రభుత్వం విఫలం?



**పాట్నా:** భారీ వరదల అనంతరం పరిస్థితిని చక్కదిద్దడంలో నితీశ్‌కుమార్ సర్కారు చొరవ చూపడంలేదంటూ బీహార్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని పాట్నా సహా పలుప్రాంతాలు వరదల వల్ల నీటమునిగి, పూర్తిగా బురదమయమయ్యాయి. వరదల వల్ల చేరిన బురదను, వరద నీటిని తొలగించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాధికారుల స్పందనా అంతంతమాత్రంగానే ఉన్నది. దీంతో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పాట్నా సహా చుట్టు పక్కల ప్రాంతాల వేలాది మంది ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ పలుచోట్ల ఆందోళనలకు దిగారు. నందక్‌చ్రా సమీపంలోని 30వ నెంబర్ జాతీయ రహదారిపై ఆందోళనలు చేపట్టి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అలాగే 'పాట్నా మున్సిపల్ కార్యాలయం' ముందు పలువురు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు ఆందోళనకు దిగారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే బాధితులను పరామర్శించడానికి వెళ్లగా.. 'వరదలు ముగిసిన అనంతరం మేము గుర్తుకొచ్చామా? అంటూ ఆయనను నిలదీశారు. అలాగే వర్షం ఆగిపోయినప్పటికీ, వరదనీరు ఇంకా నిలవడంపట్ల తమ ప్రాంత ఎంపీ, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ముం పు ప్రాంతాలను సందర్శనకు వెళ్లినపుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు బాధితుల నుంచి వ్యతిరేకత రావడంతో సహనం కోల్పోయి మాట్లాడిన సంగతి తెలిసిందే. దీనిపై బాధితులు మాట్లాడుతూ.. 'అగంకువాన్‌తోపాటు పలు ప్రాంతాల్లో వందలాది ఇండ్లు నీటమునగడంతో వరదనీరు, బురద వచ్చిచేరింది. వీధులన్ని బురదతో కంపుకొడుతున్నాయి. ఇంకా వరదనీటిని తొలగించడానికి ప్రభుత్వం చొరవ చూపడంలేదని' బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఈ మురుగునీరు ఇంకా ఇలానే నిలిచిపోయింది. నూతన డ్రయినేజీల నిర్మాణం పేరిట ప్రభుత్వం తమ నుంచి డబ్బుల వసూలు చేసి దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు.

# ఉల్లి మంటలు

**మోడీ సర్కారు తీసుకున్న చర్యలు దేశంలోని మహిళలు... ఉల్లి రైతులనే కాదు... ఆసియా దేశాలకూ కన్నీరు తెప్పిస్తున్నాయి. వర్షాలతో ఉల్లిపంట నాశనమైంది. రైతులు నష్టపోయారు. ఉల్లి నిల్వలను దాచి పెట్టి దళారులు కృత్రిమ కొరతను సృష్టించారు. మార్కెట్‌లో కిలో ధర రూ.60కి చేరుకున్నది. ఈ దశలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. అయితే ఈ నిషేధంతోనూ ధరలు అదుపులోకి రావటంలేదు. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలోనే కాకుండా.. ఆసియాదేశాల్లోనూ ఉల్లి ధర కొండెక్కింది.**

## మోడీ సర్కార్ తీరుతో మండుతున్న ధరలు

- బీజేపీ ప్రభుత్వంపై మండిపడుతున్న మహిళలు
- ఆసియా దేశాల్లోనూ కష్టాలు..

**న్యూఢిల్లీ :** ప్రకృతి విరుచుకుపడటంతో.. ఉల్లిపంట అన్నదాత చేతికి అందలేదు. ఈలోపు దళారులు మార్కెట్లలో ప్రవేశించి.. కృత్రిమ కొరత సృష్టించారు. దీంతో దేశంలోని సామాన్య ప్రజలూ, రైతులూ పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇది నాణేనికి ఓవైపు... మరోవైపు దేశంలో ఉల్లి ధరలు పెరిగిపోవడంతో... భయపడాల్సినదేమీ లేదనేలా మోడీ సర్కార్ సంకేతాలిచ్చింది. విదేశాలకు ఎగుమతులపై నిషేధం విధించింది. ఆ తర్వాత మీ కష్టాలు..నష్టాలు మావి కానట్టుగా వ్యవహరిస్తున్న తీరుపై ఇటు మహిళలు.. రైతులతో పాటు ఆసియా దేశాల్లోనూ ఉల్లి భగ్గుమంటున్నది.



**రైతుకు కష్టకాలం..**

భూమినే నమ్ముకున్న రైతు.. పడ్డ కష్టానికి ప్రతిఫలం వస్తుందనుకుంటాడు. కానీ, అతివృష్టి రూపంలోనో.. లేక అనావృష్టో... అన్నదాతను నిట్టనిలువునా ముంచుతున్నది. ఇపుడు ఉల్లి రైతు విషయంలోనూ అదే జరిగింది. ఉల్లిని విదేశాలకు ఎగుమతి చేస్తే ఎంతో కొంత ఆదాయం రైతుకు సమకూరేది. కానీ మోడీ సర్కారు తాజా నిర్ణయంతో అన్నదాతకు ఆ అవకాశమే లేకుండా పోయింది. ఇటు మార్కెట్‌లో దళారులు, అటు ఎగుమతుల్లేక ఉల్లి రైతు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నికావు.

**దిగుమతి చేసుకునే దేశాల్లో ఉల్లి మంట**

ఉల్లిపై భారత్ బ్యాన్ పెట్టడంతో బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, పాక్ వంటి దేశాల్లో ఉల్లి కష్టాలు షురూ అయ్యాయి. అక్కడా ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఉల్లి ధర కిలో రూ.120. ఇక శ్రీలంకలో మాత్రం అది రూ.300 మార్కును చేరింది. ఆసియా దేశాల్లో ఉల్లి ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో.. స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్రస్తుతం ఈ దేశాలు ఉల్లికోసం ఇతర దేశాలవైపు చూస్తున్నాయి.

ప్రపంచంలోనే ఆసియాకు భారత్ అతిపెద్ద ఎగుమతిదారు. అయితే ఉల్లి ఎగుమతిపై భారత్ బ్యాన్ నిర్ణయంతో ఖాట్మండు నుంచి కొలంబో వరకు ధరలు దడ పుట్టిస్తున్నాయి. బంగ్లాదేశ్ వంటి దేశాలు ఇతర ఉల్లి ఎగుమతి దేశాలు మయన్మార్, ఈజీప్టు, టర్కీ, చైనా వైపు చూస్తున్నాయని వ్యాపారులు, ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. అయితే భారత్‌తో పోల్చుకుంటే ఈ దేశాల నుంచి రవాణాకు పట్టే సమయం ఎక్కువ. దీంతో ఆయా దేశాలకు ఇది ప్రతిబంధకంగా మారింది.

**బంగ్లాదేశ్‌లో అలా..**

ఆకాశాన్నంటుతున్న ఉల్లి ధరలు దిగుమతిదార్లకు తలనొప్పిగా మారాయని బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మహ్మద్ ఇద్రీస్ అనే వ్యాపారి వాపోయారు. ఇక్కడ ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ. 120 పలుకుతుండటం గమనార్హం. ఆసియాతో పాటు యూరప్‌లోనూ ఉల్లి ధరలు పెరుగుతున్నాయనీ, భారత్ విధించిన బ్యాన్‌ను ఇతర ఎగుమతి దేశాలు ఆసరాచేసుకొని ధరలు పెంచుతున్నాయని ఇద్రీస్ తెలిపారు. కాగా, ఉల్లి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ నియంత్రణలోని 'ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ బంగ్లాదేశ్(టీసీబీ)' ద్వారా సబ్సీడీ కింద ఉల్లిని విక్రయిస్తున్నారు. దేశంలో వీలైనంత త్వరగా ఉల్లి కొరతను తగ్గించి ధరలను అందుబాటులోకి తేవడమే తమ ప్రధాన కర్తవ్యమని టీసీబీ అధికార ప్రతినిధి హుమాయున్ కబీర్ తెలిపారు. ఇక భారత్ నుంచి ఉల్లి అధికంగా కొనుగోలు చేసే దేశాల్లో మలేషియా రెండోది. అయితే భారత్‌లో ఉల్లి ఎగుమతిపై బ్యాన్ తాత్కాలికమని ఆ దేశం భావిస్తున్నది. ఈ విషయంలో భయపడాల్సినవసరం లేదని ఆ దేశ వ్యవసాయ శాఖ డిప్యూటీ మినిస్టర్ సిమ్ త్జే త్జిన్ తెలిపారు. దీంతో ఆ దేశం వేచి చూసే ధోరణిని అవలంభిస్తున్నది.

**భారత్‌లోనే ఈ కన్నీరెందుకు..**

ఉల్లి ధర అమాంతంగా పెరిగినపుడు కేంద్రం చొరవ తీసుకుని..రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలి. గోడౌన్లలో ఉన్న ఉల్లిని తరలించి..ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించాలి. అపుడు కృత్రిమ కొరత సృష్టించిన దళారులు వెనక్కి తగ్గే అవకాశాలున్నాయి. కానీ మోడీ సర్కార్ మాత్రం లైట్‌గా తీసుకుంటున్నదనే చర్చ నడుస్తున్నది.

**మహిళల ఆగ్రహం**

కిలో ఉల్లిపాయలే రూ.60 ఉంటే.. మిగతా కూరలు ఏం కొంటామని మహిళలు బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరలు భగ్గుమంటున్నా.. కేంద్ర సర్కార్ నోరు మెదపకపోవటాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు కళ్లెంవేయాలని డిమాండ్‌చేస్తున్నారు.

సంపాదకీయం

# డెమోక్రాట్ల ద్వంద్వ నీతి!

గత వారంలో అమెరికాలో డెమోక్రాట్లు ఆకస్మికంగా ప్రజావేగులకు మద్దతివ్వవలసిన అవసరాన్ని గుర్తించారు. జులై నెలలో అమెరికా అధ్యక్షుడు ఉక్రెన్ అధ్యక్షుడికి ఫోన్ చేసి అమెరికా ఆంతరంగిక రాజకీయాలను చర్చించిన విషయం వైట్‌హౌస్‌లో విధులను నిర్వహిస్తున్న సీఐఏ ఏజంట్ బయటపెట్టాడు. 2020లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో 'ఒక విదేశీ జోక్యం కోసం ట్రంప్ అభ్యర్థించాడు' అని సీఐఏ ఏజంట్ చేసిన కంప్లైంట్‌ని హౌస్ ఇంటిల్‌జెన్స్ కమిటీ విడుదల చేసింది.

> **ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ బాధ్యతను ఒక పాలక వర్గ పార్టీకి ఆధీనం చేయటం కుదరదు. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగాను, సోషలిజం కోసం చేసే ప్రజా పోరాటం మీద ఆధారపడి ఉండాలి.**

అలా ఫిర్యాదు చేసిన సీఐఏ ఏజంట్ ఒక 'గూఢచారి' అని ట్రంప్ ఖండించినప్పుడు ఆ వ్యక్తిలాగా 'ధైర్యసాహసాలను, దేశభక్తి'ని ప్రదర్శించగల వ్యక్తులు దేశానికి అవసరం అని, అటువంటి 'ప్రజావేగులందరిని' రక్షించవలసిన అవసరం ఎంతోవుందని హౌస్ ఇంటిలిజెన్స్ కమిటీ ఛైర్మన్ ఆడమ్ స్కిఫ్ ఉద్ఘాటించాడు. 2013లో అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ కాంట్రాక్టర్‌గావున్న ఎడ్వర్డ్ స్నోడెన్ నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ, ఇతర గూఢచార సంస్థలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రతి అమెరికా పౌరుడి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ మీద గూఢచర్యం చేశాయని చెప్పాడు. ఆయన ఆ విషయాన్ని తెలియజేసే డాక్యుమెంట్లని విడుదల చేసినప్పుడు స్కిఫ్ ఏమి చెప్పాడో ఈ సందర్భంగా గుర్తుచేయవలసిన అవసరం ఉంది.

2016లో అప్పటి అమెరికా అధ్యక్షుడైన ఒబామాకు స్కిఫ్ ఒక ఉత్తరం రాశాడు. 'మనదేశ చరిత్రలోనే అమెరికాను అప్రదిష్టపాలుచేసే అత్యంత విస్తృత పరిమాణంలో రహస్య సమాచారాన్ని బహిర్గతం చేసిన ఎడ్వర్డ్ స్నోడెన్‌ను క్షమించకూడదు' అని స్కిఫ్ తన లేఖలో విజ్ఞప్తి చేశాడు. ఆ లేఖను ఆయన ఇలా ముగించాడు.. 'ఆయన చేసిన పనికి ఆయనను అమెరికా ప్రభుత్వం జవాబుదారీని చేయాలి'. స్నోడెన్ బహిర్గతం చేసిన అమెరికా అకృత్యాలను గురించి ఆయన సహకారంతో రాసిన జర్నలిస్టులకు పులిట్జర్ ప్రైజ్ వంటి అవార్డులు వచ్చాయి. అయితే స్నోడెన్‌పైన మాత్రం మరణశిక్ష విధించటానికి వీలున్న గూఢచర్య అభియోగాలను మోపటం జరిగింది. పర్యవసానంగా స్నోడెన్ గత ఆరేండ్లుగా రష్యాలో శరణార్థిగా ఉంటున్నాడు.



ఒబామా పాలనలో డెమోక్రాట్లు చెల్సియా మాన్నింగ్‌ని జైలుపాలు చేసి హింసించారు. ఇరాక్, అఫ్ఘనిస్థాన్ తదితర దేశాలలో అమెరికా సైన్యం చేసిన నేరాలను, ఘోరాలను చెల్సియా మాన్నింగ్ బయటపెట్టినందున ఆమెను న్యాయ సూత్రాలను పట్టించుకోని ఒక మిలిటరీ న్యాయస్థానం శిక్ష విధించింది. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో హెలికాప్టర్ నుంచి అమెరికా సైనికులు జరిపిన కాల్పులలో ఇద్దరు రాయిటర్ వార్తాసంస్థ ఫోటోగ్రాఫర్లు సహా 12మంది పౌరులు చనిపోయారు. ఇద్దరు పిల్లలతోసహా అనేకమంది ఇరాకీ పౌరులు గాయపడ్డారు. తీవ్ర స్థాయిలో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన ఈ ఉదంతాన్ని వివరించే విడియోను మాన్నింగ్ బహిర్గతం చేశాడు. ఒబామా పదవీకాలం ముగిసే ముందు 2016లో ఆమెకు విధించిన శిక్ష తగ్గించింది.

వికీలీక్స్ జర్నలిస్టు జూలియన్ అస్సాంజేకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటానికి తిరస్కరించినందున ఆమెను ఈ సంవత్సరం తిరిగి జైలులో పెట్టారు. గత ఆరు నెలలుగా ఆమె జైలులో ఉంది. ఇక అస్సాంజే విషయానికివస్తే ఆయన బ్రిటన్ లోని బెల్‌మార్ష్ జైలులో మగ్గుతున్నాడు. అమెరికా యుద్ధ నేరాలను బహిర్గతం చేయటమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అమెరికా చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను కూడా యావత్ ప్రపంచానికి ఆయన తెలిసేలా చేశాడు. లండన్‌లోని ఈక్వడార్ రాయబార కార్యాలయంలో శరణార్థిగావున్న అస్సాంజేని చట్టవిరుద్ధంగా ట్రంప్ ప్రమేయంతో గత ఏప్రిల్‌లో అరెస్టు చేయటం జరిగింది. ఈ ఉదంతాలన్నింటిలోనూ 'వాళ్ళు చేసిన దానికి వాళ్ళే జవాబుదారీ' అనేదే డెమోక్రాట్ల వైఖరిగా ఉంది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ తరపున పోటీచేసిన హిల్లరీ క్లింటన్ కూడా ఇదే వైఖరి తీసుకుంది.

డెమోక్రాటిక్ పార్టీ రాజకీయ కాపట్యానికి అంతేలేదు. ప్రజావేగులపట్ల డెమోక్రాట్ల ధోరణి మిగతా విషయాలలోవలే అమెరికా పాలకవర్గ ప్రయోజనాలకు, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. జులై నెలలో ఉక్రెయిన్ అధ్యక్షుడికి ట్రంప్ ఫోన్ చేసిన విషయాన్ని బయటపెట్టిన సీఐఏ గూఢచారికి సంబంధించిన కేసు పాలక వర్గంలో నెలకొన్న వైరుధ్యాన్ని తెలియజేస్తుంది. ఇది ట్రంప్ పదవీకాలమంతా కొనసాగుతోంది. ఈ విభేదాలు విదేశాంగ నీతికి సంబంధించిన విషయాలపైన నెలకొన్నాయి. ముఖ్యంగా రష్యాతో ట్రంప్ తగినంత ఘర్షణాత్మక వైఖరి తీసుకోవటం లేదని డెమోక్రాట్లు, రిపబ్లికన్లు విమర్శిస్తున్నారు.

అంతిమంగా తెలుసుకోవలసిందేమంటే ఏ ఫైనాన్షియల్ కార్పొరేట్ వర్గం ట్రంప్‌ని ఆవిర్భవింపజేసిందో అదే వర్గానికి డెమోక్రాట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాబట్టి ట్రంప్ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా డెమోక్రాట్లు నిలకడగా పోరాడలేరనేది సుస్పష్టం. ఈ ప్రమాదకరమైన రాజకీయ సంక్షోభం నుంచి బయటపడటానికి ఒకే ఒక మార్గం ఉంది. ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ బాధ్యతను ఒక పాలక వర్గ పార్టీకి ఆధీనం చేయటం కుదరదు. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగాను, సోషలిజం కోసం చేసే ప్రజా పోరాటం మీద ఆధారపడి ఉండాలి. ఈ పోరాటం నుంచి మాన్నింగ్, అస్సాంజే, స్నోడెన్, బూర్జువావర్గ అణచివేతకు గురైన వారందరి రక్షణ కోసం చేసే పోరాటాన్ని వేరు చేయలేం.

# లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ నిర్మాణానికి నడుం బిగిద్దాం



సీతారాం ఏచూరి

భారతదేశంలో అద్వితీయమైన ప్రజా నాయకుడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీజీ. విశాల భారతదేశంలోని మూల మూలల నుంచీ ప్రజల్ని బ్రిటిష్ వలస పాలన వ్యతిరేక పోరాటంలోకి నడిపించాడు. స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగిన మా తరానికి భారతీయులకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఈ నాయకుడు నాటి భారతదేశంలో అతి పెద్ద పెట్టుబడిదారుడైన ఘన్ శ్యాందాస్ బిర్లా ఇంట్లో ఎందుకు నివసించాడు అన్న ప్రశ్న పదే పదే తొలిచేది. ఇదే ఇంట్లో 1948 జనవరి 30న ఓ హైందవోన్మాది కాల్చిన బుల్లెట్లకు అక్కడికక్కడే నేలకొరిగాడు. అటు విశాల ప్రజానీకానికి, ఇటు అతి పెద్ద పెట్టుబడిదారులకు ఆరాధ్యుడుగా కావటం వెనక వైరుధ్యం లేదా అన్నది మా తరం ముందున్న ప్రశ్న. ఈ విషయాన్ని తర్వాత పరిశీలిద్దాం.

> **ఈ నేపథ్యంలో గాంధీజీని స్మరించుకోవటం అంటే ఆయన ఏ విలువల కోసం జీవితం అంకితం చేశారో ఆ విలువల పరిరక్షణ కోసం మనలను మనం కర్తవ్యబద్ధులను చేసుకోవటమే. ఈ విలువలను సవాలు చేస్తున్న హైందవ జాతీయవాదాన్ని నిలువరించే కర్తవ్యాన్ని స్వీకరించటమే. మహాత్మ గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర భారతదేశాన్ని ఫాసిస్టు బీజేపీ/ఆరెస్సెస్‌లు ధ్వంసం చేయకుండా కాపాడుకోవటానికి కంకణబద్ధులమవుదాం.**

సమకాలీన భారతదేశంలో గాంధీ 150వ జయంతి కీలక ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాతంత్ర్యోదమ సేనానిగా గాంధీజీ ఏ ఆదర్శాల కోసం నిలబడ్డాడో ఆ ఆదర్శాలన్నింటిపైనా నేడు దాడి జరుగుతోంది. గాంధీజీ నికరమైన సామ్రాజ్యవాద వ్యతిరేకి. లౌకికతత్వానికి బద్ధుడు. అంటరానితనం, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాడాడు. గాంధీజీ యొక్క ఈ ఆదర్శాలన్నీ భారత రాజ్యాంగానికి పునాదులుగా మారాయి. నేడు గాంధీజీ పాటించిన విలువలు, వాటి పునాదిగా రూపొందిన రాజ్యాంగంపై నానాటికీ దాడి పెరిగింది. స్వాతంత్ర్యోద్యమం పతాక స్థాయిలోనూ, మంద్ర స్థాయిలో ఉన్నా గాంధీజీ ఈ విలువల పట్ల నిబద్ధత నుంచి ఎన్నడూ వైదొలగలేదు. కమ్యూనిస్టులు, మహాత్మ మధ్య ఉన్న రాజకీయ విబేధాలకతీతంగా ఈ వాస్తవాన్ని గుర్తించాలి.


**2019 ఎన్నికల అనంతరం**

2019 ఎన్నికల ఫలితాలతో భారతదేశంలో రాజకీయ మితవాద శక్తుల ఆధిపత్యం సంఘటితమైంది. ఈ విజయం తీరు, విస్తృతి, సాధించిన తీరు అటు ప్రజలకు ఇటు లౌకిక ప్రజాతంత్ర భారతావనికి పెనుసవాళ్లు విసురుతోంది. గుత్తపెట్టుబడిదారీ మతోన్మాద కూటమి ప్రజా ప్రయోజనాలకంటే జాతి, దాని ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ దుందుడుకు జాతీయవాద సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. సదరు జాతీయ ప్రయోజనాల కోసం ప్రజలు త్యాగాలు చేయాలని, చివరకు తమ ప్రజాతంత్ర హక్కులు కూడా త్యజించాలని కోరుతోంది. తాజాగా జాతీయ దర్యాప్తు సంస్థ చట్టానికి ప్రతిపాదించిన సవరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో హోం శాఖ మంత్రి అమిత్ షా జాతి ప్రయోజనాలను వ్యతిరేకించే వారంతా ఉగ్రవాద సమర్థకులే అని బల్లగుద్ది వాదించారు. ఈ క్రూరమైన సవరణలు ప్రజల మానవ హక్కులు, పౌర హక్కుల్ని దారుణంగా కాలరాయనున్నాయి. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసమ్మతి వ్యక్తం చేస్తున్న వారినందరినీ జాతి ద్రోహులుగా ముద్రవేస్తూ పోలీసు రాజ్యానికి సకల హక్కులు కట్టబెట్టడమే ఈ చట్ట సవరణలో కీలక అంశం. ఇటువంటి చట్టాలు గాంధీ ఆశించిన భారతం - లౌకిక ప్రజాతంత్ర భారతం మనుగడకే ముప్పు తెచ్చిపెట్టనున్నాయి.

మహాత్మా గాంధీ నోటి వెంట భారతీయత భావన అన్న మాట ఎన్నడూ రాలేదు. ఆయన రచనల్లో కూడా ఎక్కడా కనిపించదు. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాలే ఈ భావనకు పునాదులుగా ఉన్నాయి. ఆయన స్వతహాగా ధార్మికుడు. అదే సమయంలో మతం పూర్తిగా వ్యక్తిగత జీవితానికి పరిమితమై ఉండాలని కూడా దృఢంగా భావించాడు. రాజకీయాల్లో గానీ, ప్రభుత్వ విధానంలో గానీ మతానికి ఎటువంటి పాత్ర ఉండరాదని నిక్కచ్చిగా వాదించాడు. ఖాదీ, చరఖాలను గాంధీ ప్రోత్సహించటాన్ని ఆధునికత పట్ల వ్యతిరేకతగా భావించినా నయా ఉదారవాద విధానాల దూకుడు, మోడీ ప్రభుత్వం ఇవే విధానాలను మరింత ఉధృతంగా అమలుచేస్తున్న ఈ తరుణంలో జాతీయ స్వావలంబన, ఆర్థిక స్వయంప్రతిపత్తి పట్ల గాంధీజీకున్న నిబద్ధతకు ఖాదీ, చరఖాలు సంకేతాలుగా మిగులుతాయి. మహాత్మాగాంధీ ప్రదర్శించిన సామ్రాజ్యవాద వ్యతిరేకత, లౌకికతత్వం, అంటరానితనం నిర్మూలన లక్ష్యాలు నేటికీ ప్రాధాన్యత కలిగిన లక్ష్యాలుగానే ఉన్నాయి. అందువల్ల నేడు సాగుతున్న సాగాల్సిన పోరాటం భారతీయ జాతీయతకు, హైందవ జాతీయతకు మధ్య పోరాటమే. అందువల్ల గాంధీజీ 150వ జయంతి సందర్భంగా గాంధీజీ ఏ ఆదర్శాలు, ఆశయాల కోసం పాటుపడ్డాడో ఆ ఆదర్శాలు, ఆశయాల సాధనకు దేశ ప్రజలు కంకణం కట్టుకోవాలి.

**భారతీయత భావన**

భారతీయత భావన అంటే ఏమిటి? ఈ భావనలో ఉన్న సంక్లిష్టత పట్ల అప్రమత్తంగా ఉంటూనే సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే భారతదేశంలో తనలోని వైవిధ్యాన్ని పరిరక్షించుకుంటూ ముందుకు సాగే క్రమంలో విశాల ప్రజానీకాన్ని భారతీయత భావనలో భాగస్వాములను



చేయటమే ఈ భావనకు అర్థం. భారతీయత అన్న భావన మన జాతీయత గురించిన సమీకృత అవగాహనకు పునాదులు వేస్తుంది. కొన్ని సామాజిక తరగతులను దేశం నుంచి వెలివేసే హైందవోన్మాద జాతీయతకు ఇది భిన్నమైనది. ఈ రెండు భావనల మధ్య ఉన్న వైరం సుస్పష్టమే.

**భిన్న దృక్పథాల మధ్య ఘర్షణ**

మహాత్మా గాంధీ నాయకత్వంలో భారతీయులు సాగించిన మహోన్నత విముక్తి పోరాట వారసత్వమే భారతీయత భావన. 1920 దశకం నుంచీ ఉధృతంగా సాగిన స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో స్వతంత్ర భారతదేశం తీరుతెన్నుల గురించి మూడు పరస్పర భిన్నమైన దృక్పథాలు ముందుకొచ్చాయి. ఈ పోరాటంలో ప్రధాన స్రవంతిగా ఉన్న కాంగ్రెస్ స్వతంత్ర భారతదేశం ప్రజాతంత్ర గణతంత్ర దేశంగా ఉండాలన్న అవగాహనను ముందుకు తెస్తే ఈ అవగాహనను వామపక్షాలు మరింత బలోపేతం చేస్తూ దేశం సాధించే రాజకీయ విముక్తి దేశంలోని పౌరులందరికీ సామాజిక ఆర్థిక విముక్తిగా మారాలని, అటువంటి మార్పు సోషలిజం ద్వారానే సాధ్యమన్న అవగాహన ముందుకు తెచ్చింది.

ఈ రెండు దృక్పథాలకు పూర్తి విరుద్ధమైన దృక్పథం మరోటి ముందుకొచ్చింది. స్వతంత్ర భారతదేశపు స్వభావాన్ని ఆయా ప్రజలు పాటించే మత విశ్వాసం ఆధారంగా నిర్ధారించాలన్నది ఈ మూడో దృక్పథం. ఈ అవగాహన రెండు రకాలుగా వ్యక్తీకరించబడింది. ఇస్లామిక్ రాజ్యం నినాదాన్ని ముందుకు తెచ్చిన ముస్లిం లీగ్ రూపంలోనూ, మెజారిటీ మత రాజ్యభావనను (హైందవోన్మాద రాజ్యం) ముందుకుతెచ్చిన ఆరెస్సెస్ రూపంలోనూ ఈ భావనలు వ్యక్తీకరించబడ్డాయి. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధింపచేసుకునే క్రమంలోనే దురదృష్టవశాత్తూ దేశం భారత్ పాకిస్థాన్‌లుగా చీలటంతో ముస్లిం లీగ్ ఆకాంక్ష నెరవేరింది. ఈ రకమైన కుట్రకు బ్రిటిష్ వలస పాలకులదే ప్రధాన పాత్ర. నాడు భారతమాతకు తగిలిన గాయాలు నేటికీ మానలేదు. కానీ భారతదేశాన్ని హైందవోన్మాద దేశంగా మార్చాలన్న ఆరెస్సెస్ లక్ష్యం నాడు ఆచరణ సాధ్యం కాలేదు. కానీ ఈ మతోన్మాద శక్తులు మాత్రం తమ లక్ష్యసాధన దిశగా కృషి సాగిస్తూనే ఉన్నాయి. మహాత్మా గాంధీని ఓ కరుడుకట్టిన హైందవోన్మాది కాల్చి చంపటం గమనిస్తే స్వాతంత్ర్య సాధన సమయంలో భారతదేశం ఆరెస్సెస్ ముందుకు తెచ్చిన అవగాహనను తిరస్కరించటంతో ఆరెస్సెస్ ఎంతగా నిరుత్సాహానికి ఆగ్రహానికి లోనైందో అర్థమవుతుంది.

నేడు సమకాలీన భారతదేశంలో కనిపిస్తున్న అన్ని రకాల రాజకీయ ఘర్షణలకు మూలం ఈ మూడు దృక్పథాల మధ్య నాడు మొదలైన ఘర్షణలోనే ఉన్నాయి. ఈ వైరుధ్యాలను పరిష్కరించుకునే క్రమంలోనూ భారతీయత భావన భవిష్యత్తు ఏమిటన్నది తేలనుంది. భారతీయత భావనకు జవసత్వాలు సమకూర్చటంలో భారతీయ వామపక్షాలు విశేషమైన పాత్ర పోషించాయి. ఈ కారణంగానే నేటి పరిస్థితుల్లో భారతీయత భావనను సాక్షాత్కరింప చేసుకోవటంలో వామపక్షాలు ప్రధానమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.

**ఆరెస్సెస్ : ఫాసిస్ట్ ఎజెండా**

జాతీయత భావనకు ఆరెస్సెస్ ఇచ్చిన నిర్వచనం కోణం నుంచే హిందూ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యాన్ని సైద్ధాంతికంగా సమర్థించుకొంటోంది. "విదేశీ శక్తుల దురాక్రమణకు గురికాక ముందు దాదాపు ఎనిమిది వేల సంవత్సరాలుగా, ఇంకా చెప్పాలంటే పదివేల సంవత్సరాలుగా ఈ ప్రాంతంపై హిందువుల ఆధిపత్యం కొనసాగుతుందన్నది నిర్వివాదాంశం. అందువల్లనే ఈ భూమి హిందువులది. దేశం హిందూ దేశం" అన్న ఆరెస్సెస్ అధినేత అభిప్రాయమే ఈ దేశాన్ని తిరిగి మెజారిటీ ప్రజల మతాధిపత్య రాజ్యంగా మార్చలన్న నినాదానికి భూమిక. (మనం, మన జాతీయత నిర్వచనం, ఎంఎస్ గోల్వాల్కర్, 1939. పేజి 6)

హిందూత్వ ఉన్మాదులు మతమౌఢ్యం, అసహనం వంటివే ఈ దేశపు లక్షణాలని హైందవోన్మాదుల ప్రేలాపనలు. "... హిందూస్థాన్ అనే ఓ దేశం ఉనికిలో ఉందని, ఉండాలని, అందువల్ల ఈ దేశం హిందూ దేశం తప్ప మరోటి కాదనీ, హిందూ జాతి, హిందూమతం, హిందూ సంస్కృతి, భాషలకు భిన్నమైన ప్రజలందరూ 'జాతీయ జీవనం' నుంచి బహిష్కృతులవుతారన్న (తమ) నిర్ధారణను మనపై బలవంతంగా రుద్దుతున్నారు.

"(ఈ దేశాన్ని) వర్తమాన గాఢాంధకారం నుంచి విముక్తి చేసి హిందూ దేశంగా పునర్నిర్మించేందుకు సాగే ఉద్యమాలే నిజమైన జాతీయోద్యమాలన్న దీనికనుగుణంగానే ముందుకొస్తుంది. హిందూజాతిని, దేశాన్ని కీర్తించే వాళ్లే దేశభక్తులనీ, తమ లక్ష్య సాధన కోసం కార్యాచరణలోకి దిగుతారన్న వాదన ముందుకొస్తుంది. మిగిలిన వారంతా దేశద్రోహులన్నా కావాలి. లేదా జాతి వ్యతిరేకులన్నా కావాలని. వీళ్ల గురించి కాస్తంత సున్నితంగా చెప్పాలంటే మూర్ఖులు. (గోల్వాల్కర్, 1939, పే.43-44)."

స్వాతంత్రోద్యమ కాలంలో ముందుకొచ్చిన భారతీయత భావనకు గోల్వాల్కర్ ముందుకు తెచ్చిన భావన పూర్తిగా విరుద్ధమైనది. డిస్కవరీ ఆఫ్ ఇండియా అన్న తన గ్రంథంలో జవహర్‌లాల్ నెహ్రూ "భారతదేశం పొరల సమూహం. ఒక్కో పొరపై ఒక్కో ఆలోచనా స్రవంతి లిఖించబడి ఉంటుంది. ఎన్ని పొరలున్నా ఏ ఒక్క పొరా సంపూర్ణంగా దానికి ముందున్న పొరలను తుడిచిపెట్టలేదు" అని గర్వంగా ప్రకటించాడు.

రవీంద్రనాథ్ ఠాగూర్ సైతం "ఆర్యులు, అనార్యులు, ద్రావిడులు, చైనీయులు, సింథియన్లు, హూణులు, పఠాణులు, మొఘల్లు అందరూ ఈ నేలలో ఇంకిపోయి ఏకాత్మతను సంతరించుకున్నారు. ఆ ఏకాత్మతే భారతీయత" అన్నారు. గాంధీజీ ప్రాతినిధ్యం వహించిన భారతీయత అంటే దేశంలోని ఉన్న అందరినీ తనలో ఇముడ్చుకునే సమీకృత జాతీయత అన్న భావన నుంచి వైదొగలటమే ఆరెస్సెస్ ప్రతిపాదిస్తున్న జాతీయతకు అర్థం. సమీకృత భారతీయత అన్న భావన స్థానంలో నేడు మనం ఫాసిస్టు హిందూ రాష్ట్ర నిర్మాణం దిశగా అన్యమతస్తులను వెలివేసే హిందూ జాతీయతను చూస్తున్నాం.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

అనువాదం : కొండూరి వీరయ్య
సెల్: 9871794037

సవేరా

# ఊడుతున్న లక్షలాదిమంది ఉద్యోగాలు : మోడీ వైఫల్యం

భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నది. ఈ తీవ్ర సంక్షోభాన్ని ప్రధాన మీడియా తక్కువగా అంచనా వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం అదే తరహాలో ఆలోచిస్తోంది. ఆర్థికవృద్ధి క్షీణత (5శాతానికి పడిపోయింది), పెట్టుబడుల తగ్గుదల, బ్యాంక్ రుణాల స్తంభన, కొనుగోళ్ల తగ్గుదల లాంటి స్థూల ఆర్థిక సూచికలనే ప్రభుత్వం పరిశీలిస్తోంది. వీటిని పరిశీలించాల్సిందే! ఎందుకంటే భారతదేశం ఒక 'సూపర్ పవర్' అవుతుందని, 5ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవడం దాని లక్ష్యమనే ఊహాలోకంలో విహరిస్తున్నవారిని ఇవి కలవరపరుస్తాయి. అయితే ఈ గణాంకాలు, పరిశీలనలు.. మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు సృష్టించిన విధ్వంసాన్ని... వాస్తవ స్థితిలో అంచనా కట్టడం లేదు. వ్యవసాయ కార్మికులు, చిన్న మధ్య తరగతి రైతులు, గని కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, సేవారంగాల లోని ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులపై పడిన ప్రభావాన్ని పరిశీలిస్తే వాస్తవాలు బోధపడతాయి.

**పోతున్న ఉద్యోగాలు**

మన దేశంలో ఆటోమొబైల్ పరిశ్రమలో 3.7కోట్ల కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటికే 3లక్షల ఉద్యోగాలకు కోత పడిందని, రాబోయే కొద్ది కాలంలో 10లక్షల మంది ఉద్యోగాలు కోల్పోతారని ఆ పరిశ్రమ వర్గాలు ప్రకటించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. అయితే ఇది కూడా వాస్తవ పరిస్థితిని పూర్తిగా తెలియచేయడం లేదని కూడా అర్థం అవుతున్నది. ఒక పెద్ద పరిశ్రమ ఉంటే దానికి అనుబంధంగా అనేక పరిశ్రమలు ఉంటాయి. కొన్ని దానికి ముడి సరుకులు ఇచ్చేవి, మరికొన్ని విడి భాగాలను ఇచ్చేవి. పెద్ద పరిశ్రమలో డిమాండ్ తగ్గి ఈ అనుబంధ పరిశ్రమలు కూడా ప్రభావం పడి ఉద్యోగాలు పోతాయి. ఆటోమొబైల్ పరిశ్రమకు స్టీల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, విడి భాగాలు, రబ్బర్ టైర్లు, ఇతర చిన్న పరిశ్రమలలో కూడా ఉద్యోగాలు పోతాయి. ఉద్యోగాల కోత చాలా తీవ్రంగా ఉందని సీఐటీయూ సేకరించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

గనుల తవ్వకాల రంగంలో రాబోయే కొన్ని నెలల్లో 2-3లక్షల ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది. ఉత్పత్తి అయిన సరుకులు గుట్టలుగా పెరిగిపోతున్నాయి. వాటిని కొనే వారు లేరు. అందుకని యజమానులు వాళ్ల లాభాలకు నష్టం రాకుండా కార్మికులను తగ్గించుకోవడం లేదా పని దినాలను తగ్గించడం చేస్తున్నారు. సంక్షోభం ఇంతగా విలయ తాండవం చేస్తుంటే ప్రభుత్వం మైనింగ్‌రంగంలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నది. సంక్షోభ పరిస్థితిని వాడుకొని స్వదేశీ లేక విదేశీ పరిశ్రమలకు లాభం చేకూర్చాలనే మోడీ ప్రభుత్వ విధానాన్ని ఇది బట్టబయలు చేస్తున్నది. దీనివలన మరింత మంది ఉద్యోగాలు పోతాయి. బొగ్గు గని కార్మికుల వేతనాలు కూడా తగ్గిపోతాయి.


> **"ప్రజల కొనుగోలు శక్తి బాగా పడిపోయింది. చాలా కాలంగా జీతాలు పెరగక పోవడం, రైతులకు రాబడి తగ్గిపోవడం, గతం నుంచి కొనసాగుతున్న నిరుద్యోగం, 'జీఎస్‌టీ-నోట్ల రద్దు' లాంటి రెండు పెనుభూతాల వలన అత్యధికంగా పనులు కల్పించే చిన్న ఉత్పత్తిరంగం కునారిల్లడంతో ఉపాధిపై కోత పడింది. పనులు కల్పించి ప్రజల కొనుగోలు శక్తిని పెంచి సమస్యను పరిష్కరించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించడంలేదు. ప్రజల ఉపాధి కల్పనకు వెచ్చించే మొత్తాన్ని తగ్గించాలని... ప్రయివేటు రంగాన్ని విస్తరించాలని ఒత్తిడి చేసే... నయా ఉదారవాద విధానాలపై దానికి వున్న గుడ్డి నిబద్ధతే అందుకు కారణం."**

**స్టీల్ రంగం**

స్టీల్, ఆటోరంగాలకు మధ్య వున్న అనుబంధం గురించి తెలిసిందే. స్టీల్‌రంగం కీలకమైనది. డిమాండ్ లేకపోవడంతో ఈ రంగం కూడా సంక్షోభంలో ఇరుక్కున్నది. దాంతోపాటే ఆటోరంగం కూడా మునుగుతున్నది. ఇతరరంగాల పైనా ప్రభావం చూపుతోంది. రైల్వేలు, నిర్మాణరంగం ఇంజనీరింగ్ రంగాలు విరివిగా స్టీల్‌ను వాడుతుంటాయి. ఈ రంగాలు కూడా సంక్షోభం లోనే వున్నాయి. టాటా స్టీల్ ప్రయివేటు రంగంలో స్టీల్ ఉత్పత్తి చేసే అతి పెద్ద కంపెనీ. రూ.4000 కోట్లతో కంపెనీ విస్తరించాలను కున్నా, ప్రస్తుత పరిస్థితుల్లో వద్దని నిర్ణయించు కున్నది. దాంతో ఇక కొత్త ఉద్యోగాలు ఉండవు. జార్ఖండ్, ఒరిస్సాలలో స్టీల్‌రంగానికి అనుబంధంగా ఉన్న జంషడ్‌పూర్ చుట్టుపక్కల చిన్న పరిశ్రమలలో ఇప్పటికే ఒక లక్ష ఉద్యోగాలు పోయాయి.

**వస్త్ర పరిశ్రమ**

ఇదివరలో లేని విధంగా ఈ రంగంలో భారీ సంక్షోభం నెలకొన్నది. 10కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఇది. ప్రస్తుతం 2/3 వంతు మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంటే కొన్ని లక్షల మందికి ఉపాధి పోయే పరిస్థితి ఏర్పడింది. 'పత్తి నూలు'కు దేశ,




విదేశీ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఈ ఏడలాది మంచి పంట వచ్చింది. దాదాపు రూ.80,000 కోట్ల విలువ చేస్తుందని భావిస్తున్న సందర్భంలో... ఈ సంక్షోభం రైతును దివాళ దిశగా నడిపిస్తున్నది. పైగా అనుబంధ పరిశ్రమలు కూడా కునారిల్లుతాయి. దాంతో ఉద్యోగాల కోత కూడా పెద్ద ఎత్తున ఉంటుంది.

**రవాణా రంగం**

పెద్ద లారీలే కాదు, చిన్న సరుకుల రవాణా వాహనాలు కూడా ఈ రంగంలో ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గడంతో వీటి మీద కూడా తీవ్ర ప్రభావం పడింది. కోటి వాహనాలలో 60శాతం వాహనాలు పని లేక నిలబడి ఉన్నాయని తెలుస్తున్నది. అంటే ఈ రంగంలో పని చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్కులు, లోడింగ్ అన్ లోడింగ్ చేసే వారిపై తీవ్ర ప్రభావం పడుతున్నది. దీనికి తోడుగా కొత్త మోటారు వాహన చట్టం పుణ్యమా అని ఏదైనా ట్రాఫిక్ చట్టాల ఉల్లంఘన జరిగితే విపరీతమైన పెనాల్టీల వడ్డన జరుగుతున్నది. చిన్న యజమానులను దెబ్బ కొట్టి పెద్ద పరిశ్రమలకు లాభం చేకూర్చేలా ఉన్నాయి.

**నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్**

రవాణారంగంలో పని దొరకని వారికి గతంలో నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలో పని లభించేది. ఇప్పుడు అది కూడా గత కొన్ని సంవత్సరాలుగా సంక్షోభంలో ఉన్నది. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంటు కౌన్సిల్ లెక్కల ప్రకారం ఇప్పటికే లక్ష మందికి ఉద్యోగాలు పోయాయి. రాబోయే కొన్ని నెలలు మరో ఐదు లక్షల మంది ఉద్యోగాలు పోవచ్చని అంచనా కడుతున్నది. ఈ రంగానికి అనుబంధంగా ఉన్న పరిశ్రమలు సిమెంట్, స్టీల్, పెయింట్లు, ఎలక్ట్రికల్ సామగ్రి, ఇందులో రవాణా చేసే వారు కూడా దెబ్బ తింటున్నారు. ఇక్కడ కూడా ఉద్యోగాలు పోతున్నాయి. ఎగుమతి ఆధారిత రంగమైన ఐటీ మీద కూడా దెబ్బ పడింది. విదేశాల నుండి స్వదేశం నుంచి ఆర్డర్లు లేకపోవడంతో ఐటీ కంపెనీలు, ఐటీ ఆధారిత సంస్థలు తమ ఉద్యోగులను తొలగించి తమ భారం తగ్గించుకుంటున్నారు.

**రికార్డు స్థాయిలో నిరుద్యోగం**

ప్రస్తుతం పోతున్న ఉద్యోగుల పరిస్థితి ఇలా ఉంది! ఇక గత కొద్ది సంవత్సరాలుగా పోగుపడిన నిరుద్యోగం మాటేమిటి? అది మరింత జటిలంగా మారుతున్నది. సీఎంఐఈ తాజా లెక్కల ప్రకారం ఆగస్టు 2019 చివరికి నిరుద్యోగశాతం 8.7శాతం చేరుకున్నది. ఇది గత కొన్ని సంవత్సరాల కంటే చాలా ఎక్కువ. కార్మిక శాఖ అధికారికంగా గత మే నెలలో 2017-18లో నిరుద్యోగం 6.1శాతం ఉన్నట్టు, అది 45ఏండ్లలోనే అత్యధికమని ప్రకటించింది. అంటే నిరుద్యోగం తారా స్థాయికి చేరుకున్నది. పురుషుల కంటే మహిళలలో నిరుద్యోగం, ఉద్యోగాలు పోవడం చాలా ఎక్కువగా ఉన్నది. ఈ వినాశకర విధానాల ప్రభావం మహిళల పైనే ఎక్కువగా పడుతోంది. ఉద్యోగాల కోత ఈ గణాంకాలలో కొంత వరకూ కనబడినా మొత్తం సమస్యను వివరించలేవు. ఎందుకంటే కొంత శాతం నిరుద్యోగం కనబడకుండా ఉండిపోతుంది. ఉదాహరణకు ఒక కార్మికుడిని ఒక నెల రోజులు మీ గ్రామానికి వెళ్లి రమ్మని తప్పుడు హామీ ఇచ్చి పంపితే దాన్ని నిరుద్యోగ జాబితాలో చూపెట్టరు. ఇలాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

**విష వలయం**

ప్రజల కొనుగోలు శక్తి బాగా పడిపోయింది. దానికి అనేక కారణాలు ఉన్నాయి. చాలా కాలంగా జీతాలు పెరగక పోవడం, రైతులకు రాబడి తగ్గిపోవడం, గతం నుంచి కొనసాగుతున్న నిరుద్యోగం, జీఎస్‌టీ-నోట్ల రద్దు' లాంటి రెండు పెనుభూతాల వలన అత్యధికంగా పనులు కల్పించే చిన్న ఉత్పత్తి రంగం కునారిల్లడంతో ఉపాధిపై కోత పడింది. పనులు కల్పించి ప్రజల కొనుగోలు శక్తిని పెంచి సమస్యను పరిష్కరించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించడంలేదు. ప్రజల ఉపాధి కల్పనకు వెచ్చించే మొత్తాన్ని తగ్గించాలని... ప్రయివేటు రంగాన్ని విస్తరించాలని ఒత్తిడి చేసే... నయా ఉదారవాద విధానాలపై దానికి వున్న గుడ్డి నిబద్ధతే అందుకు కారణం.

కొనుగోలు శక్తి తగ్గిపోవడం, డిమాండ్ తగ్గిపోవడంతో వినిమయ సరుకుల రంగం బాగా దెబ్బతిన్నది. దీనికి మంచి ఉదాహరణ పార్లే-జి బిస్కెట్లు. రూ.5 చిన్న బిస్కెట్ ప్యాకెట్ కూడా అమ్ముడు పోని పరిస్థితి వచ్చిందని ఆ కంపెనీ యాజమాన్యమే ప్రకటించింది. దానితో పాటే బాగా అమ్ముడు పోయే చిరుతిళ్లు, అలంకరణ వస్తువులు, లోదుస్తులు, వంట పాత్రల కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి. దీంతో ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించుకొని ఇతర ఉపాయాలతో తమ లాభాలను కాపాడుకోవాలని చూస్తున్నారు. వాళ్లు చేసే మొదటి పని ఉద్యోగులను తొలగించడం, జీతాలు తగ్గించడం. ఫలితంగా కొనుగోలు శక్తి మరింత తగ్గిపోతుంది. దీన్నే విషవలయం అంటాం. ఇందులోనే ప్రస్తుతం మన దేశం చిక్కుకొన్నది.

దీని పరిష్కారానికి ఒకే ఒక మార్గం ఉన్నది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ విధానాలను మార్చుకునేలా చేయడమే. ప్రభుత్వం ప్రజల కోసం వెచ్చించే మొత్తాలను పెంచాలి. కేవలం ఉపశమనం కోసం మాత్రమే కాదు. ఉపాధి కల్పన కోసం కూడా ఖర్చు చేయాలి. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. జీతాలు పెంచి ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా చెయ్యాలి. ఇది విష వలయాన్ని ఛేదించే పద్ధతి. మళ్లీ ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా చేస్తుంది. తద్వారా ఉత్పత్తి పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రయివేటు రంగానికే మరిన్ని రాయితీలు ఇచ్చేందుకు తన వనరులను వినియోగిస్తున్నది. వేతనాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచేందుకు చూస్తున్నది. కనీస మద్దతు ధర ఇవ్వడానికి నిరాకరిస్తున్నది. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా నిరాకరిస్తున్నది. ఈ సంక్షోభాన్ని ఒక సాకుగా చూపి ఇప్పటికే ధనవంతులుగా ఉన్న వారిని మరింత ధనవంతులుగా చేసేందుకు పూనుకుంటున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ప్రతిఘటించాలి. అప్పుడే ప్రభుత్వం తన విధానాలను మార్చుకుంటుంది.

అనువాదం: టి.యస్.వి.రమణ,
సెల్: 8985628662

epaper.navatelangana.com








**డ్యాన్సింగ్ క్వీన్... జూబ్లీ హీరోయిన్... ఎన్ని పేర్లో. గ్లామర్‌డాల్‌గానే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా... తరువాత తన నటనా సామర్థ్యాన్ని నిరూపించుకుంది. పురుషాధిపత్యం ఉన్న ఇండస్ట్రీలో అత్యధిక హిట్లు సాధించిన ఏకైక హీరోయిన్ ఆశా. తను ఎంతగానో ప్రేమించిన నాసిర్ హుస్సేన్‌కు అప్పటికే పెండ్లయినందున.. అతడిని పెండ్లిచేసుకోలేక... మరెవరినో జీవితంలోకి తెచ్చుకోలేక అలాగే ఉండిపోయింది. పెండ్లి చేసుకోనందుకు తానెప్పుడూ పశ్చాత్తాప పడలేదు. 'సింగిల్‌గా ఉన్నా... నేను సంతోషంగా ఉన్నా' అని చెప్పే ఆశ జీవిత చరిత్ర.. 'ది హిట్ గాళ్'గా వచ్చింది. కేవలం నటిగానే కాకుండా... సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కు అధ్యక్షురాలిగా సేవలందించిన తొలి మహిళ. పేదప్రజలకు వైద్యసేవలు అందించాలనే సదాశయంతో ఆసుపత్రి నిర్మించి నిర్వహిస్తున్నది. అక్టోబర్ రెండున పుట్టినరోజు జరుపుకొని... 80వ ఏట అడుగుపెట్టిన స్టయిల్ ఐకాన్ గురించి...**

# బాలీవుడ్ హిట్‌గాళ్..

ఆశా పరేఖ్ గుజరాతీ. 1942 అక్టోబర్ రెండున ప్రాణ్ లాల్ పరేఖ్, సుధా పరేఖ్ దంపతులకు జన్మించింది. వారికి ఆశా ఏకైక సంతానం. తల్లి బోహ్రి ముస్లిం వనిత. తల్లికి నాట్యం అంటే చాలా ఇష్టం. అందుకే ఆవాకు కథక్, భరత నాట్యం నేర్పించింది. ఒకానొక నాట్య వేదికమీద ప్రముఖ దర్శక నిర్మాత బిమల్ రాయ్ ఆశా పరేఖ్ నాట్యాన్ని చూశారు. అప్పుడు ఆశా కు కేవలం పదేళ్ళు. బాలతారగా ఆమెను బాంబే టాకీస్ నిర్మించిన 'మా' (1952) అనే సినిమాలో వెండితెరకు పరిచయం చేశారు. తరవాత 1954 లో బిమల్ రాయ్ దర్శకత్వం వహించిన 'బాప్-బేటి' సినిమాలో కూడా ఆశా పరేఖ్ బాల తారగా నటించింది. ఆ తరవాత కూడా ఆశా పరేఖ్ మరికొన్ని సినిమాలలో బాల తారగా నటించినా అవి పెద్దగా విజయవంతం కాలేదు. దానితో నటనకు స్వస్తి చెప్పి చదువు మీద శ్రద్ధ పెట్టింది. 1959లో విజయభట్ 'గూంజ్ ఉఠీ షెహనాయీ' సినిమా నిర్మిస్తుండగా అందులో హీరోయిన్ అవకాశం వచ్చినట్లే వచ్చి తప్పిపోయింది. విజయ భట్ ఆశా పరేఖ్ ను చూసి ఆమె సినిమాలకు పనికిరాదని తేల్చేశాడు. ఆశా పరేఖ్ హీరోయిన్ గా పరిచయమైన మొదటి సినిమా 'దిల్ దేఖో దేఖో' (1959). 'దిల్ దేకే దేఖో' సినిమా సెట్టింగ్స్‌లో.. ఆశా చాలా చిన్నది. ఆ సెట్స్‌లో గీతాబాలి మెడచుట్టూ చేతులేసి గారాలుపోయేది. దాంతో గీతా' మనం ఆశాని దత్తత తీసుకుందాం' అనేదట షమ్మీతో. అప్పటినుంచి గీతా, షమ్మీలను చాచీ, చాచా అని పిలిచేది ఆశా.

**జూబ్లీ హిరోయిన్‌గా..**

నాసిర్ హుసేన్ వరసగా నిర్మించిన ఆరు సినిమాలో హీరోయిన్‌గా నటించింది ఆశా పరేఖ్. 'జబ్ ప్యార్ కిసీ సే హెూతా హై' సినిమాలో ఆశా పరేఖ్ సరసన దేవానంద్ హీరోగా నటించాడు. ఈ సినిమాలోని 'జియా ఓ జియా', 'సౌ సాల్ పెహలె' పాటలు సూపర్ హిట్లుగా నిలిచి నేటికీ వినపడుతూనే వున్నాయి. తరవాత 1963లో నాసిర్ హుసేన్ 'ఫిర్ వోహీ దిల్ లాయా హూ' అనే సినిమాను జాయ్ ముఖర్జీ ని హీరోగా పెట్టి ఆశా పరేఖ్ తో నిర్మించాడు. ఒ.పి. నయ్యర్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రం మ్యూజికల్ హిట్ గా నిలిచింది. 1966లో నాసిర్ హుసేన్ నిర్మించిన మరొక సూపర్ హిట్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రం 'తీస్రీ మంజిల్'. అందులో అశాపరేఖ్ సరసన షమ్మికపూర్ హీరోగా నటించాడు. ఆర్.డి. బర్మన్ సంగీతం స్వరపరచిన పాటలు ఆల్ టైం హిట్స్ గా నిలిచాయి. 1967లో నాసిర్ హుసేన్ నిర్మించిన 'బహారోం కే సప్నే' బ్లాక్ అండ్ వైట్ చిత్రంలో ఆశాపరేఖ్ కు జంటగా రాజేష్ ఖన్నా నటించాడు. ఇందులో మన్నాడే, లతాజీ ఆలపించిన 'చునరీ సంభాల్ గోరీ' మంచి హిట్. తరవాత 1969 లో ఆశాపరేష్ సరసన శశికపూర్ ని హీరోగా చేసి నాసిర్ హుసేన్ 'ప్యార్ కా మౌసమ్' అనే సినిమా నిర్మించాడు. ఈ సినిమా సిల్వర్ జూబిలీ చేసుకుంది. 1971లో జితేంద్ర హీరోగా, ఆశా పరేఖ్ హీరోయిన్ గా నాసిర్ హుసేన్ తీసిన సినిమా 'కారవాన్' బాక్సాఫిస్ హిట్. ఇందులో 'దిల్ బర్ దిల్ సే ప్యారే', 'కితనా ప్యారా వాదా హై', 'పియా తూ అబ్ తో ఆజా' పాటలు అజరామరాలే.




**'దో బదన్'తో ప్రశంసలు...**

60ల్లో ఆశా పరేఖ్ నటించిన సినిమాలు గ్లామర్ తారగానే. గ్లామర్ పాత్రలతో మొదలుపెట్టినా... అందులో ఉండే సంగీతం ఆమె సినిమాలు హిట్టయ్యేందుకు కారణం అయ్యింది. అయితే 1966లో రాజ్ ఖోస్లా దర్శకత్వంలో వచ్చిన 'దో బదన్', 1969లో వచ్చిన 'చిరాగ్', 1978 లో వచ్చిన 'మై తులసి తేరే అంగన్ కి' చిత్రాలలో ఆశా పరేఖ్ కు నటనకు సామర్థ్యమున్న పాత్రలు లభించాయి. 'దో బదన్' విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకునేలా చేసింది. రాజ్ ఖోస్లా దర్శకత్వం వహించిన 'దో బదన్' చిత్రంలో ఆశా పరేఖ్ మనోజ్ కుమార్ సరసన నటించింది. 1970 లో 'పగ్లా కహీ కా', 'కటీ పతంగ్' సినిమాలు ఈ కోవలోనివే. షమ్మికపూర్ సరసన 'పగ్లా కహీకా' లో ఆశా పరేఖ్ నటన శక్తి సామంతకు ఎంతగానో నచ్చింది. వెంటనే 'కటీ పతంగ్' చిత్రంలో ఆమెనే హీరోయిన్ గా తీసుకున్నాడు. అందులో ఉత్తమ నటనకు ఆశా పరేఖ్ ఫిలింఫేర్ బహుమతి గెలుచుకుంది. 1976 తరవాత గ్లామర్ పాత్రలకు స్వస్తి చెప్పి సహాయ పాత్రల్లో క్యారక్టర్ రోల్స్ కు పరిమితమైంది. వాటిలో వదినగా, తల్లిగా నటించింది. కానీ ఆపాత్రలు తనకు నచ్చకపోవడంతో సినిమా నటనకు స్వస్తి చెప్పింది.

**'ది హిట్‌గాళ్'గా ఆత్మకథ...**

తనను హీరోయిన్ గా పరిచయం చేసిన నాసిర్ హుసేన్ అంటే ఆశా పరేఖ్ కు చాలా ఇష్టం. ఆ ఇష్టమే ప్రేమగా మారింది. కానీ ఆ ప్రేమ పెళ్లిదాకా వెళ్ళలేదు. కారణం నాసిర్ హుసేన్ కు అప్పటికేకొరియోగ్రాఫర్ గా పనిచేస్తున్న ఆయేషాఖాన్ తో పెండ్లయ్యింది. దాంతో నాసిర్ హుస్సేన్‌ను పెండ్లి చేసుకోలేక, ఆ స్థానంలో మరొకరిని ఊహించుకోలేక జీవితాంతం అలాగే ఉండిపోయింది. ఈ ప్రేమనంతా తన ఆత్మకథ పుస్తకం 'ది హిట్ గాళ్'లో పేర్కొన్నది. అలాగని తానెప్పుడూ ఒంటరిగా ఫీలవ్వలేదు. కారణం మంచి మిత్రుల సాంగత్యం. వహీదా, సైరాబానో, హెలెన్, కీర్తి శేషులు సాధన, నందా ఆమెకు మంచి స్నేహితులు. అలాంటి మంచి మిత్రుల సాంగత్యాన్ని మించిన సంపద లేదని చెబుతుందామె. నాసిర్ హుస్సేన్ నుంచి నేర్చుకున్న దర్శకత్వం... ఆ తరువాత ఆమె తీసిన టీవీ సీరియల్స్‌కు ఉపయోగపడింది. 1990 లో టెలివిజన్ డైరెక్టర్ గా మారింది. 'ఆక తి' అనే సంస్థను ప్రారంభించి 'బాజే పాయల్', 'కోరా కాగజ్' 'పలాష్ కే ఫూల్', 'దాల్ మే కాలా' వంటి బుల్లితెర సినిమాలు నిర్మించింది. 1994–2000 మధ్యకాలంలో సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కు చైర్ పర్సన్ గా వ్యవధరించింది. తరవాత కేంద్రీయ సెన్సార్ బోర్డుకు చైర్ పర్సన్ గా కూడా వ్యవహరించింది. 2002లో ఫిలింఫేర్ సంస్థ ఆశా పరేఖ్ కు జీవన సాఫల్య పురస్కారం అందించింది. రియాలిటీ షో లకు న్యాయనిర్ణేతగా కూడా ఆమె వ్యవహరించింది. ప్రస్తుతం ఆశా పరేఖ్ ఒక న త్య అకాడమీని స్థాపించి నడిపించడమే కాకుండా, శాంతా క్రూజ్ వద్ద 'ఆశా పరేఖ్ ఆసుపత్రి' పేరిట ఒక పెద్ద వైద్యశాలను నిర్వహిస్తోంది. ఫిల్మ్ ఇండస్ట్రీ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యకలాపాల్లోనూ ఆమె భాగస్వామి.




కట్ట కవిత

### అమ్మే నా డ్రైవింగ్ ఫోర్స్...

నా మీద అమ్మ, నా గురువు నాసిర్ హుస్సేన్ ప్రభావం చాలా ఉంది. అమ్మ నా జీవితానికి వెన్నెముక. నన్ను ఎప్పుడూ ముందుకు నడిపించేది. అలాగే ఎంత ఎదిగినా ఒదిగి ఉండటాన్ని నేర్పించింది. గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, సినిమా సూపర్ హిట్టయినా... ఓకే ఓకే అనేది. అందుకేనేమో నేనెనప్పుడూ స్టార్‌లా ఫీలవ్వలేదు. డ్రైవింగ్ ఫోర్స్ మా అమ్మే. అయితే ఆన్‌స్క్రీన్‌లో లైవ్‌లీగా ఎలా ఉండాలి, స్పాంటేనియస్‌గా ఎలా స్పందించాలనేది షమ్మీ చాచా నేర్పించారు. నాకు ప్రయాణాలంటే ఇష్టం. వహీదా, సైరాజీ, హెలెన్‌తో కలిసి ఎక్కువగా లంచ్‌కు, సినిమాకు వెళ్తుంటా. ప్రయాణాలు కూడా చేస్తుంటా. నా జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించిన.

| పాపులర్‌సినిమాలు | పాపులర్ పాటలు... |
|---|---|
| దిల్ దేకే దేఖో(1959) | ఆజా ఆజా - తీస్రీ మంజిల్ |
| జబ్ ప్యార్ కిసీసే హెూతా హై(1961) | ఓ మేరే సోనారే - తీస్రీ మంజిల్ |
| జిద్దీ (1964), మేరే సనమ్(1965) | జాయియే ఆప్ కహా జాయేంగే - మేరే సనమ్ |
| తీస్రీ మంజిల్(1966), లవ్ ఇన్ టోక్యో (1966) | ఆజా పియా తోహే ప్యార్ దూ-బహారోం కే సప్నే |
| దో బదన్(1966), ప్యార్ కా మౌసమ్ (1969) | నా కోయీ ఉమ్గాగ్ హై - కటీ పతంగ్ |
| కటీ పతంగ్ (1970) | అచ్చా తో హమ్ చల్తే హై- ఆ మిలో సజ్నా |

## ఆరోగ్యప్రదాయిని ఖర్జూరం

- డ్రై ఫ్రూట్స్ లో అత్యంత చౌకైనది, పోషకాలపరంగా విలువైనది.. ఖర్జూరం. ఆరోగ్యప్రదాయినిగా పేరున్న ఖర్జూరం అత్యంత పురాతన కాలం నుంచీ వినియోగంలో ఉంది. కొలెస్ట్రాల్, కొవ్వు అసలే ఉండని ఫలాల్లో ఇదీ ఒకటి గనుక అందరూ నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. పైగా తీసుకొన్న నిమిషాల వ్యవధిలోనే శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది.
- ఖర్జూరంలోని పొటాషియం మెదడు పనితీరును పెంచుతుంది. వృద్ధుల్లో ఈ మార్పు మరింతగా కనిపిస్తుంది.
- ఐరన్ పుష్కలంగా ఉండే ఖర్జూరాలు తినే గర్భిణులకు, రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా వున్న బాలికలు, మహిళలకూ రక్తహీనత సమస్య రాదు.
- ఖర్జూరం తినే గర్భిణుల్లో కాన్పు సమయంలో గర్భాశయ కండరాలు వ్యాకోచించి కాన్పు సులభంగా జరగటమే గాక తగినన్ని చనుబాలు పడతాయి. అలసట, నీరసం కూడా దూరమవుతాయి.
- రోజుకో ఖర్జూరపండు తింటే ఇందులోని విటమిన్ 'ఏ' మూలంగా రేచీకటి వంటి నేత్ర సమస్యలు రావు.
- వారానికి కనీసం 3 లేదా 4 ఖర్జూరాలు తినేవారికి మలబద్ధకం బెడద ఉండదు.
- గుండె సమస్యలున్నవారు రాత్రి నీటిలో నానబెట్టిన ఖర్జూరాన్ని మెత్తగా నూరి ఉదయాన్నే తింటే మంచి ఫలితం ఉంటుంది.
- పురుషుల్లో లైంగిక, సంతానలేమి సమస్యలకు ఖర్జూరం వినియోగం ఎంతో మేలు చేస్తుంది.



- రాత్రిమేకపాలల్లో ఖర్జూరాల్ని నానబెట్టి ఉదయాన్నే రుబ్బి తేనె, యాలకుల పొడి, జోడించి తింటే లైంగికపటుత్వం కూడా పెరుగుతుంది.
- తరచూ నీళ్ల విరేచనాలతో బాధపడేవారు ఖర్జూరం తింటే అందులోని పొటాషియం వల్ల సమస్య దారికొస్తుంది.
- ఖర్జూరాల్లో సల్ఫర్ అలర్జీ, సైనస్ బాధితులకు గొప్ప ఉపశమనాన్ని కలిగిస్తుంది.
- బరువు తక్కువగా ఉండేవారు రోజూ 2 ఖర్జూరాలు తింటే బరువు పెరుగుతారు.
- రోజూ ఖర్జూరాలను తినడం వల్ల దంతాల మీద పాచి చేరదు. దీనివల్ల ఎనామిల్ దెబ్బతినకుండా చూసుకోవచ్చు.
- ఖర్జూరంలోని సెలీనియం, మాంగనీస్, కాపర్, మెగ్నీషియం వంటి ఖనిజలవణాలు ఎముకపుష్టిని కలిగిస్తాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఆస్టియోపొరోసిస్ రాకుండా చేస్తాయి.
- ఖర్జూరాల్లోని నికోటిన్ పేగు వ్యాధులను నివారిస్తుంది. వీటిలోని అమైనో ఆమ్లాలు జీర్ణశక్తికి ఊతమిస్తాయి.
- ఖర్జూరంలోని 'పెక్టిన్' అనే రసాయనం రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్‌ను అదుపు చేస్తుంది.

## డయేరియాను అరికట్టడానికి

వర్షాకాలంలో వచ్చే డయేరియా ప్రమాదకరమైన వ్యాధి. వాంతులు, విరేచనాలతో శరీరంలోని లవణశాతం కోల్పోయి నిస్సత్తువు అయి జ్వరం వస్తుంది. చివరికి ప్రాణాంతకంగా కూడా మారుతుంది. ఇలాంటి డయేరియాను మొదట్లోనే అరికట్టడానికి ఉపయోగపడే హెూమ్‌రెమిడీస్ ఏంటో తెల్సుకుందాం.

- డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే నీళ్లలో ఉప్పు, నిమ్మరసం వేసి తాగించాలి. చక్కెరనీళ్లు ఇవ్వాలి. ఈ ద్రావణాల్ని నీళ్లకు బదులు రోజంతా తాగించాలి. దీని వల్ల శరీరంలో లవణశాతం పెరుగుతుంది.
- కొబ్బరినీళ్లు, మజ్జిగ, పండ్లరసాలు, సూప్స్ తాగించాలి. ఇలా చేయటం వల్ల డయేరియా బాధితులు ఉపశమనం పొందుతారు.
- పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆపిల్ లాంటి పండ్లకు దూరంగా ఉండటం మంచిది. అలాగే ఆయిల్ ఫుడ్‌కు స్ట్రాంగ్ కాఫీ తాగటం వల్ల కూడా మంచి ఉపశమనం కలుగుతుంది.
- జీలకర్ర, మెంతులకు తగినంత పెరుగు కలిపి చూర్ణం చేసి తినాలి. దీని వల్ల శరీరం అదుపులోకి వస్తుంది.
- పాలు, పన్నీరు, జున్ను లాంటి వాటికి దూరంగా ఉండాలి.



## చిట్లిన జుట్టుకు బాదం నూనె

కాలంతో పనిలేకుండా కొందరి జుట్టు చిట్లుతుంది, పొడిబారుతుంది. వాటికితోడు చుండ్రు సమస్యా ఉంటుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే తగిన తేమ అంది జుట్టు ఆరోగ్యపరంగా ఎదుగుతుంది.

మెత్తటి జుట్టుకి: వెంట్రుకలు బిరుసుగాఉన్నప్పుడు సొరకాయ రసాన్ని తలకు పట్టించి అరగంటాగి గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరచుకోవాలి. ఆపై గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. లేదంటే ఒక అరటిపండు గుజ్జు, పావుకప్పు పాలూ, చెంచా తేనె కలిపిన మిశ్రమాన్ని జుట్టుకి పట్టించి స్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తే సరి.. జుట్టు మృదువుగా మారుతుంది. రోజూ తలస్నానం చేస్తే జుట్టు శుభ్రంగా ఉంటుందనుకుంటారు కొందరు. కానీ దానివల్ల వెంట్రుకల్లో సహజంగా ఉండే నూనెలు తగ్గుతాయి. ఫలితంగా వెంట్రుకలు బిరుసుగా మారతాయి. మూడురోజులకోసారి తలస్నానం చేయాలి. చేసేముందు గోరువెచ్చటి కొబ్బరినూనెను తలకు పట్టించి ఆపై మృదువైన షాంపూతో తలస్నానం చేయాలి.

పోషణ అందేలా: తగినంత తేమ అందకపోయినా జుట్టుపొడిబారుతుంది. ఇలాంటప్పుడు గుడ్డులోని తెల్లసొనా, పెరుగూ కలిపి బాగా గిలకొట్టి తలకు పట్టించాలి. ఇరవైనిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే ఫలితం ఉంటుంది.



శుభ్రత ముఖ్యం: మురికి వదలకుండానే తలస్నానం చేయడం, జుట్టు ఆరకుండానే నూనె రాసుకోవడం వల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా ఎదగవు. షాంపూలు తరచూ వాడుతున్నప్పుడు కొన్ని రసాయనాలు తలలో మిగిలిపోతాయి. అలా జరగకుండా ఉండాలంటే షాంపూలో కొంచెం బేకింగ్ సోడా కలిపి దాంతో తలస్నానం చేస్తే సరి.

చిట్లిన జుట్టుకి: బాదం నూనెలో ఉండే పోషకాలు జుట్టుని ఆరోగ్యంగా పెరిగేలా చేస్తాయి. పావుకప్పు పాలల్లో చెంచా బాదం నూనె వేసి తలస్నానానికి ముందు వెంట్రుకలకు రాసుకోవాలి. కాసేపయ్యాక షాంపూతో రుద్దుకుంటే జుట్టు చిట్లిపోకుండా ఉంటుంది. ఆరోగ్యంగానూ ఎదుగుతుంది.

ఈ రోజుల్లో ప్రతిఒక్కరూ ఎంతోకొంత వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కోవటం సహజమే. ఈ ఒత్తిడి పెరిగేకొద్దీ అది భరించలేని, విడువని తలనొప్పికి దారితీస్తోంది. పనిఒత్తిడి, పెరుగుతున్న ప్రమాణాలు, పోటీకి అనుగుణంగా పనిచేయాల్సిరావటం, కాలుష్యం, ట్రాఫిక్ ప్రయాణాల వల్ల ఈ తలనొప్పి భరించలేనిదిగా మారి రోజువారీ దినచర్యను దెబ్బతీస్తోంది.

## ఒత్తిడికి హెడ్ మసాజ్

- విడవని తలనొప్పుల వల్ల ఏకాగ్రత లోపంతో బాటు భావోద్వేగాల్లోనూ ప్రతికూలమైన మార్పులు వస్తాయి. దీంతో సహెూద్యోగులతో సఖ్యత తగ్గటం, వివాదాలు ఏర్పడటం వంటి సమస్యలు తప్పవు. సదరు ఉద్యోగి ఎంత కష్టపడినా, అతని వైఖరి వల్ల పడిన శ్రమకు తగిన ఫలితం ఉండదు. వీరిలో చాలామందికి మసాజ్ గురించిన అవగాహన లేక ఏళ్లతరబడి ఆ తలనొప్పులను భరిస్తూ ఉంటారు. తొలిదశలోనే వీరు మసాజ్ ను ఆశ్రయిస్తే మంచి ఆరోగ్యంతో బాటు సామాజిక సంబంధాలూ బాగుంటాయి.
- ఒత్తిడిని తగ్గించుకునేందుకు హెడ్ మసాజ్ కోరుకునేవారు గోరువెచ్చని కొబ్బరి, ఆలివ్, ఔషధ నూనెలు వాడొచ్చు. తలనొప్పి బాధితులు మాత్రం సుగంధ భరిత నూనెలు మసాజ్ కోసం వాడరాదు. బహు సున్నితమైన చర్మం లేదా జిడ్డు చర్మం ఉన్నవారు నూనెకు బదులు పెరుగు, నిమ్మరసం, పాలతో మసాజ్ చేసుకోవచ్చు.
- సౌకర్యంగా కూర్చొని కొద్దికొద్దిగా నూనెను అరచేతిలోకి తీసుకొని మాడుకు రాసి , జుట్టు కుదుళ్ళ నుంచి చివర్ల వరకు బాగా పట్టించాలి. ఆ తర్వాత మునివేళ్లతో మాడును నెమ్మదిగా బాగా మర్దన చేయాలి. మరీ ఎక్కువ వేగంతో రుద్దితే జుట్టు కుదుళ్ళు దెబ్బతింటాయి. మాడు, తల వేడెక్కేవరకు మసాజ్ కొనసాగించాలి.
- మసాజ్ సమయంలో ప్రశాంతంగా కళ్ళుమూసుకొని దాన్ని ఆస్వాదించాలి. మాడు మీద మసాజ్ అయినా తర్వాత నుదురు, కణతలు, మెడ, భుజం భాగాల్లో మసాజ్ చేసుకోవాలి. ఇలా రెండు సార్లు చేయాలి.
- మసాజ్ తర్వాత వెంటనే లేదా 3 గంటల తర్వాత, వీలుంటే మరునాటి ఉదయమూ తలస్నానం చేయొచ్చు. ఇంట్లోనే స్వయంగా మసాజ్ తో సంతృప్తి చెందనివారు స్పా, సెలూన్ లను ఆశ్రయించవచ్చు.


**ఉపయోగాలు**



- హెడ్ మసాజ్ వల్ల నాడులు చైతన్యవంతమవుతాయి. క్రమబద్ధమైన మసాజ్ మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. శరీరానికి, మనసుకు సమన్వయం పెరుగుతుంది.
- తల, నుదురు, కణతలు, మెడ, భుజ భాగాలకు రక్తసరఫరా పెరుగుతుంది.
- తలనొప్పి నుంచి తక్షణ ఉపశమనం, సుఖనిద్ర, మెదడుకు పునరుత్తేజం కలుగుతాయి.
- జుట్టు కుదుళ్ళు బలపడి, చర్మపు ముడతలు పోయి చక్కని అందం చేకూరుతుంది.

## జీతాలిచ్చేందుకూ ఇబ్బందులు

### పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స



**అమరావతి :** జీతాలు ఇచ్చేందుకు రాష్ట్రం వద్ద నిధులు లేవని, గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేసిన ఫలితంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెప్మాపై మున్సిపల్ కమిషనర్లు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆర్థిక పరిస్థితి కుంటుపడిందని, ఒక్క మున్సిపల్‌శాఖలోనే రూ.15 వేల కోట్ల బకాయి ఉందని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఒకటోతేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. అన్నా క్యాంటీన్లలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని విమర్శించారు. వాటిపై విచారణ జరుగుతోందని, త్వరలో వివరాలు తెలుస్తాయని అన్నారు. రాష్ట్రంలో 110 మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామని, ఈ ఏడాది చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు ముగ్గురు అధికారులు, ముగ్గురు ఎన్‌జిఓలతో అధ్యయన కమిటీ వేస్తామని తెలిపారు. 10వ తేదీన నిర్వాసితుల దినోత్సవం నిర్వహించాలని సూచించారు. నిర్వాసితుల కోసం ఢిల్లీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధివిధానాలనుఅధ్యయనం చేయాలని సూచించారు. అంతకుముందు వర్క్‌షాపులో పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు, కమిషనర్ జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయకుమార్, మెప్మా అడిషనల్ డైరెక్టర్ శివపార్వతి మాట్లాడారు. సుమారు 40 సంస్థల నుండి ఎన్‌జిఓ ప్రతినిధులు హాజరయ్యారు. నిర్వాసితులకు ఉపాధి కల్పనా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## టీఎస్ఆర్టీసీ సమ్మెకు ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు

- నేడు గేట్‌మీటింగ్‌లు, ప్రదర్శనలు

**అమరావతి:** ఆర్టీసీ రక్షణ, వేతన ఒప్పందం, సర్వీస్ కండీషన్లు తదితర డిమాండ్లపై శనివారం నుంచి తెలంగాణలో చేపట్టనున్న ఆర్టీసీ సమ్మెకు ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నదని విమర్శించారు. సమ్మెకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రీజినల్, డిపో యూనిట్లలో గేట్ మీటింగ్‌లు, ప్రదర్శలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించండి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలనీ ఐజీపీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాయంలో అట్రాసిటీ కేసుల పురోగతిపై ఐజీపీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాధితులకు అందించిన పరిహారం, కేసుల వివరాలను ప్రతి నెల 15లోగా కమిషన్‌కూ అందించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో జరిగే పౌర హక్కుల రోజు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఆదేశాలు ఇచ్చి, అందరూ భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రాసిక్యూషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి కేసులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్ వైజయంతి, ఎస్పీ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ నాగలక్ష్మి, సీనియర్ అధికారులు, కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, విద్యాసాగర్, సుంకపాక దేవయ్య., చిల్కమర్రి నరసింహులు పాల్గొన్నారు

## 10 వేల మందితో బతుకమ్మ సంబురాలు

- పర్యాటక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బతుకమ్మ పండుగ చివరి రోజు వేడుకలను 10 వేల మందితో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఘనంగా నిర్వహించనున్నట్టు అబ్కారీ, పర్యాటక శాఖమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రవీంద్ర భారతిలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు జరుపుకోవడానికి ఎన్నో అడ్డంకులు కల్పించారన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు. ఉద్యోగులు, ప్రజలు నేడు ఎంతో స్వేచ్ఛగా బతుకమ్మ వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారల సంఘం అధ్యక్షురాలు మమత, మహిళా ఉద్యోగులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కష్ణయాదవ్, నగర అధ్యక్షులు గుండూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో గొర్రెల పంపిణీ :మంత్రి తలసాని

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

త్వరలోనే రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. మిగిలిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఇన్సూరెన్స్ ఉండి చనిపోయిన గొర్రెల స్థానంలో కొత్త వాటిని దీపావళిలోపు ఇస్తామని చెప్పారు. డీడీలు కట్టిన వారందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామనీ, ఎవ్వరూ అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గురువారం మాసాబ్‌టాంక్‌లోని పశుసంవర్ధ శాఖ డైరెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో మంత్రి చాంబర్‌ను ఆయన ప్రారంభించారు. సచివాలయం ఖాళీ చేసిన నేపథ్యంలో మంత్రి తన కార్యకలాపాలన్నీ ఈ కార్యాలయం నుంచి కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెరువు, కుంటల్లో చేప పిల్లలు వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విజయ డెయిరీని రెండేండ్లలో గాడిన పెడతామన్నారు. దీని ఔట్‌లెట్స్, ఉత్పత్తులను కూడా పెంచుతామన్నారు. సినిమా టికెట్లు పెంచుతామనీ, ఫిల్మ్ం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఆన్‌లైన్ టికెటింగ్ వ్యవస్థను ప్రవేశ పెట్టబోతున్నామని వెల్లడించారు.

## ఆర్టీసీ తాత్కాలిక నియామకాలు

- డ్రైవర్‌కు రూ.1,500, కండక్టర్‌కు రూ.వెయ్యి
- రోడ్లపైకి స్కూల్ బస్సులు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం తన శాయశక్తులా ప్రయత్నాలను ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రయివేటు బస్సులతో పాటు ఎలాగూ దసరా సెలవులు ఉన్నందున స్కూల్‌బస్సుల్ని కూడా రోడ్లపై తిప్పేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాత్కాలిక డ్రైవర్లుగా పనిచేయదలచిన వారు తమ ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లతో ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని డిపోలవారీగా ఇప్పటికే ప్రకటనలు ఇచ్చారు. కండక్టర్లుగా పనిచేసేందుకు 10వ తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్నవారు అర్హులని, వారు కూడా ఒరిజినల్ సర్టిఫికెట్లతో డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు. తాత్కాలిక డ్రైవర్లకు రోజుకు రూ.1,500, కండక్టర్లకు రోజుకు వెయ్యి రూపాయలు చెల్లిస్తారు. రిటైర్డ్ ఉద్యోగుల సేవల్ని వినియోగించుకోనున్నారు. రిటైర్డ్ సూపర్‌వైజర్లకు రోజుకు రూ.1,500, రిటైర్డ్ మెకానిక్‌లు, క్లర్క్‌లకు రోజుకు రూ.వెయ్యి చొప్పున సొమ్ము చెల్లిస్తామంటూ అధికారులు ప్రకటనలు జారీ చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రవాణాశాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

# మోడీ వద్దకు వినతులెన్నో..

### రాష్ట్రానికి న్యాయం జరిగేనా ?

- రేపు ప్రధానితో సీఎం భేటి
- అంతకుముందు తెలంగాణా సీఎంతో చర్చలు
- రైతు భరోసా ప్రారంభోత్సవానికి ప్రధానికి ఆహ్వానం



**అమరావతి:** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒక్క రోజు తేడాతో వెనువెంటనే ప్రధానిని కలవనుండడం చర్చనీయాంశం అయింది. ప్రధాని వద్ద ఏ అంశాలు చర్చకు పెడతారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శనివారం ప్రధాని నరేంద్రమోడీని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖరరావు వేర్వేరు సమయాల్లో కలవనున్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలను ప్రధానికి వివరించనున్నారు. రైతు భరోసా పథకం ప్రారంభోత్సవానికి రావాలని జగన్మోహన్‌రెడ్డి ప్రధానిని కోరనున్నా రు. కేంద్రంతో అనుసరించాల్సిన వ్యూహంపై ఇటీవల ఇద్దరు ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో సమావేశం అయ్యారు. ఆ సమయంలో కేంద్రం తీరుపై చర్చించారనే వార్తలు కొన్ని పత్రికల్లో రాగా వాటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రాన్ని ఏం కోరనున్నారనే ప్రశ్నార్థకంగా ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయింది. జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు, కడప స్టీలు, విశాఖ రైల్వే జోన్ వంటి అనేక అంశాలూ ఇంకా కొలిక్కి రాలేదు. ప్రధానిని కలి సిన సమ యంలో ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి వీటిని ప్రధాని దృష్టికి తీసుకెళతారా లేదా అనేది ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. పోలవరం అపెక్స్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యంగా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను పున: పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేంద్రం గుర్రుగా ఉంది. అధికారికంగా లేఖలు రాసింది. మరోవైపు పిపిఏలవల్ల డిస్కమ్‌లపై 20 వేల కోట్ల భారం పడిందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. కేంద్రం మాత్రం మార్చొద్దని చెబుతోంది. ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. పోలవరం రివర్స్ టెండర్ల విషయంలోనూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటనలపైనా ప్రధానికి వివరిస్తారని రాష్ట్రం చెబుతుంటే అది జరుగుతుందా లేదా అనేది రేపటి సాయంత్రానికి కానీ తెలియదు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వలేదు. వాల్తేర్ డివిజన్‌తో కూడిన జోన్ ఇవ్వాలని ఎంపిలు పట్టుబట్టారు. ఇదే అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళతారని చెబుతున్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి చట్టపరంగా రావాల్సిన నిధుల విషయంలో ఇంకా కేంద్రం స్పష్టత ఇవ్వడం లేదు.

## మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆస్తులు 20 కోట్లు

**కర్నూలు:** కర్నూలు జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ రూ.20 కోట్ల మేర అక్రమా స్తులు సంపాదించారు. ఏసీబీ సోదాల్లో బెంగ ళూరు కార్తీక్ నగర్‌లో మూడు కోట్ల విలువైన జీప్లస్ సెవెన్ అపార్ట్ మెంట్, ఉదాల్ హల్లిలో రెండు కోట్ల విలువ చేసే ఇంటి స్థలం. హైదరాబాద్‌లోని జయభేరి ఆరెంజ్ ఆర్కేడ్‌లో రూ.కోటిన్నర విలువచేసే అపార్ట్‌మెంట్, గాజుల మల్లాపురంలో కోటి రూపాయల ఇంటి స్థలం. ప్రస్తుతం నంద్యాలలో నివాసం ఉంటున్న ఇంట్లో రూ.1.45 లక్షల నగదు, కిలో బంగారం లభ్యమయ్యాయి. మనీ ట్రాన్స్‌ఫర్ కోసం భార్య పేరు మీద ఆక్సీట్రీ హోటల్ ప్రయివేట్ లిమిటెడ్ , సిన్బిడ్స్ అనే రెండు సూట్ కేసు కంపెనీల స్థాపన వంటివి వెలుగులోకి వచ్చాయి. ఆయనపై కేసు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ నాగభూషణం వివరాల ప్రకారం.. ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో గురువారం శివప్రసాద్ ఇంటిలో సోదాలు చేపట్టారు. బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు కూడా సోదాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అక్రమాస్తులు బయటపడ్డాయి. ఆయన పేరున రూ.20 కోట్ల మేర ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తొలిరోజు సోదాల్లో రూ. 8 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు బయటపడ్డాయి.

# హుజూర్‌నగర్‌లో 'అధికార' ఎత్తులు

### సామాజిక తరగతుల వారీగా ఓట్ల విభజన

- రాష్ట్ర క్యాడర్ మొత్తం అక్కడే..
- పరువు కోసం కాంగ్రెస్ యత్నాలు
- ప్రచారానికి రానున్న ప్రియాంక గాంధీ!

**నవతెలంగాణ- నల్లగొండ ప్రతినిధి**

'మీ కులానికి ఓట్లు ఎన్ని ఉంటాయి.. మీకింత ప్యాకేజీ ఇస్తాం.. మేము గెలవగానే లోన్లు ఇప్పిస్తాం.. ఓట్లన్నీ మాకే పడాలే. ఒక్క ఓటు కూడా మిగతా వాళ్లకు పడొద్దు'.. ఇదీ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఉప ఎన్నిక కోసం ఓట్ల కోసం అధికార టీఆర్ఎస్ వేస్తున్న ఎత్తుగడలు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సామాజిక తరగతికో ఇన్‌చార్జిని నియమించింది. రాష్ట్ర క్యాడర్ మొత్తం ఇక్కడే ఉంది. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రచారం చేయనున్నారు. మరోవైపు కాంగ్రెస్ కూడా తమ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడానికి వ్యూహాలు రచిస్తోంది. ప్రచారంలో భాగంగా ప్రియాంక గాంధీని రంగంలోకి దింపనుంది.

రాష్ట్ర రాజకీయమంతా ఇప్పుడు హుజూర్‌నగర్ ఎన్నిక పైనే నడుస్తోంది. ఆ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రధానంగా టీఆర్ఎస్, పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ నాయకులు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. కులాల వారీగా ఓట్లను విభజిస్తున్నారు. అధికార టీఆర్ఎస్ 700 మంది నాయకులను రంగంలోకి దింపి ప్రచారం చేయిస్తోంది. సిట్టింగ్ సీటును దక్కించుకోవడానికి కాంగ్రెస్ కూడా తీవ్ర యత్నాలు చేస్తోంది.



కులానికో ఇన్‌చార్జి

టీఆర్ఎస్ కుల రాజకీయం మొదలు పెట్టింది. సామాజిక తరగతుల వారీగా ఓట్లను విభజించి ఇన్‌చార్జిలను నియమించింది. నియోజకవర్గంలో మొత్తం 2,20,108 ఓట్లున్నాయి. బీసీ సామాజిక తరగతికి చెందిన ఓట్లు 83,663, ఓసీ 53,662, ఎస్సీ 37,727, ఎస్టీ 28,240, ముస్లిం మైనార్టీకి చెందిన ఓట్లు 6141 ఉన్నాయి. ఆయా సామాజిక తరగతులను మచ్చిక చేసుకోవడానికి టీఆర్ఎస్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్రంలోని ముఖ్య నాయకులు మొత్తంగా 700 మందిని ప్రచార రంగంలో దింపింది. ఒక్కో సామాజిక తరగతికి ఆరుగురితో కూడిన బృందాన్ని నియమించి గడప గడపకూ తిప్పుతోంది.


**పదవా..? లోన్లా..? మీ ఇష్టమంటూ ఆఫర్లు**

ఎన్నికల ప్రచారంలో దిగిన ఆయా సామాజిక తరగతులకు చెందిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, సీనియర్ నాయకులు గ్రామాల్లో కుల పెద్దలకు ఎరవేసే పనిలో పడ్డారు. వారితో మంతనాలు జరుపుతున్నారు. 'మీ కులం ఓట్లు మొత్తం మా పార్టీ అభ్యర్థికి వేయించండి.. లోన్లు ఇప్పిస్తాం, పార్టీలో ఏదో ఒక నామినేటెడ్ పదవి కూడా ఇప్పిస్తాం' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు.

**స్టార్ క్యాంపెయినర్లతో ప్రచారం**

ఈ నియోజకవర్గం కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడం, ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండలో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో ఈ ఎన్నికలను టీఆర్ఎస్ సవాల్‌గా తీసుకుంది. ఉప ఎన్నిక పూర్తి బాధ్యతను ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అప్పగించింది. ప్రచార స్టార్ క్యాంపెయిన్‌గా మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, పరిస్థితులను బట్టి కేసీఆర్‌ను కూడా రంగంలోకి దింపడానికి ప్లాన్ సిద్ధం చేసింది.

### కాంగ్రెస్‌కు అగ్ని పరీక్షే..



సిట్టింగ్ సీటును కాపాడుకోవడం ఇప్పుడు కాంగ్రెస్ కు అగ్ని పరీక్షగా మారింది. ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని గెలుపించుకుంటే తప్ప భవిష్యత్ లో టీఆర్ఎస్‌ను ఢీకొట్ట లేమన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ప్రచార ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. సీనియర్ క్యాడర్, యూనివర్శిటీ నుంచి విద్యార్థులు, నిరుద్యోగులను ఎన్నికల ప్రచారంలో దింపనుం ది. ఆరేండ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. టీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా రాష్ట్ర క్యాడర్ మొత్తాన్ని ప్రచారంలో దింపే ఆలోచన లో ఉంది. ప్రధానంగా ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రచారంలో ఉండనున్నారు. చివరి రెండు రోజులు ప్రచార కార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకులు ప్రియాంక గాంధీని కూడా తీసుకురానున్నట్టు తెలిసింది.

## ఉపఎన్నికల్లో అధికార దుర్వినియోగం: బీజేపీ

**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ సర్కార్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని బీజేపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. పోలీసులు, అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లొంగి పనిచేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో పోటీ చేయాలని యోచించిన సర్పంచుల సంఘం అధ్యక్షులు భూమన్నను రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసుల్లో అరెస్ట్ చేసిందని చెప్పారు. సాంకేతిక సమస్యల పేరుతో 30 మంది గిరిజన హక్కుల నేతలు, స్వతంత్రుల నామినేషన్లను తిరస్కరించారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. పరిశీలకుడిని పంపాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్టు చెప్పారు.కాగా మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ తనయుడు వీరేందర్ గౌడ్ బీజేపీ కండువా కప్పుకున్నారు.

## ఈజీహెచ్ఎస్ స్కాంపైనా దర్యాప్తు చేయాలి

- ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్‌కు సీపీఐ(ఎం) వినతి




**నవతెలంగాణ - సిటీబ్యూరో**

ఈఎస్ఐ కుంభ కోణంతో పాటు ఈజీహె చ్‌ఎస్‌లో జరిగిన స్కాంపైనా సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఐ (ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నాయకులు బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెల్‌నెస్ సెంటర్లకు అవసరమైన మందుల కొనుగోళ్లలో నిబంధనలు పాటించలేదని, అధిక ధరలకు కొనుగోలు చేశారని విమర్శించారు. గతంలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టుకు సీఈఓగా పనిచేసిన పద్మ ఈ అవకతవకలకు బాధ్యురాలన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మెన్ హోదాలో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఆమోదించిన తీర్మానాన్ని కూడా ఫిర్యాదుతో పాటు జత చేసినట్టు చెప్పారు. ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్‌గానూ గతంలో అనేక అక్రమాలకు పాల్పడిన ఆమె ఆస్తులపైనా సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 17 నాన్‌రేట్ కాంట్రాక్ట్ సంస్థల నుంచి మందులు కొనుగోలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిలో ఆరుగురు ఈఎస్ఐ శాఖకు చెందిన వారేనని, ఈజీహెచ్ఎస్‌పైనా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎన్.మారన్న ఉన్నారు.

# వైద్యరంగానికి నిధుల్లేకనే..

- ఐఏఎన్ సదస్సు ప్రారంభోత్సవంలో వెంకయ్యనాయుడు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



ప్రభుత్వం చాలినన్ని నిధులు విడుదల చేయకపోవడంతో దేశ వైద్యరంగంపై పెను ప్రభావం పడుతున్నదని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో గురువారం జరిగిన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ 27వ సదస్సును ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సరిపోయేంత సంఖ్యలో వైద్యులు లేకపోవడం, వ్యాధులు రాకుండా నివారణపై చైతన్యపరిచే వ్యవస్థ లేకపోవడం, వైద్యానికవుతున్న ఖర్చు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతుల కొరత, ప్రజల్లో ఆరోగ్యబీమాపై అవగాహన లేకపోవడం తదితర అంశాలు వైద్యరంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస వైద్య వసతుల కొరతతోపాటు నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్ సీడీ) కారణంగా భారత్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నదని చెప్పారు. వైద్యుల కొరతను తీర్చేందుకు మరిన్ని వైద్యకళాశాలలను ప్రారంభించాల్సిన అవసరముందనీ, ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు న్యూరాలజీలో సీట్లు పెంచడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సీటీ, ఎమ్మారై స్కాన్ సౌకర్యాలున్నఆస్పత్రులను వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయడం ద్వారా కొంతమేరనైనా ఉపశమనం కలిగించాలని సూచించారు.

**వైద్యులు కదిలితేనే అవగాహన......**

ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డాక్టర్లు కదలాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వ్యాధుల నివారణపై పాఠశాలలు, కాలేజీలు, యువజన కేంద్రాలు, గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వినోద్ పాల్, కిమ్స్ ఆస్పత్రి ఎండీ డా.భాస్కర్ రావు, ఐఏఎన్ అధ్యక్షులు డా. సతీష్, న్యూరాలజీ వరల్డ్ ఫెడరేషన్ అధ్యక్షుడు డా. విలియమ్ కారల్, కార్యక్రమ కార్యనిర్వాహక కార్యదర్శి డా.సీతాజయలక్ష్మితోపాటుగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, పోర్చుగల్, జపాన్, ఇటలీలకు చెందిన 15మంది అంతర్జాతీయ నిపుణులతోపాటు 2వేల మంది వైద్యులు పాల్గొన్నారు.

## రబీకి సిద్ధం కావాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యకార్యదర్శి సి పార్థసారధి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రబీ సీజన్‌కు(యాసంగి)సిద్ధం కావాలని వ్యవసాయ ముఖ్యకార్యదర్శి సి పార్థసారధి ఆదేశించారు. ఎరువులూ, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులవారీగా సాగు, పంటల సమాచారం సేకరించాలన్నారు. గురువారం సచివాలయంలో వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జ, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా స్థాయి వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, విత్తన కార్పొరేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంట సమయం ముగియడం, యాసంగి సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వానాకాలంలో వేసిన పంటల వివరాలు, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమీక్షించుకోవాలని సూచించారు.


# నేడు ధర్మాధికారి కమిటీ భేటీ

- విద్యుత్ ఉద్యోగుల విభజనపై నిర్ణయం
- ఆంధ్రా ఉద్యోగుల ఆప్షన్లు తిరస్కరించాలి-టీఈఈజేఏసీ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంపై జస్టిస్ ధర్మాధికారి కమిటీ శుక్రవారం ఇరు రాష్ట్రాల విద్యుత్‌శాఖల ఉన్నతాధికారులతో భేటీ కానుంది. ఈ సమావేశం రెండ్రోజులపాటు జరుగుతుంది. గత నెలలో జరిగిన సమావేశంలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు కూడా ఆప్షన్లు ఇవ్వాలని కమిటీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈమేరకు తెలంగాణ విద్యుత్ సంస్థల ఉద్యోగులు ఆప్షను ఇచ్చారు. అయితే ఆంధ్రా స్థానికత పేరుతో తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ చేయబడిన 1157 మంది కూడా ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తెలంగాణలోనే పనిచేసేందుకు ఆసక్తి చూపడం వివాదానికి దారి తీస్తున్నది. ఆప్షన్ల పేరుతో తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం చేయొద్దని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈఈజేఏసీ) కన్వీనర్ శివాజీ జస్టిస్ ధర్మాధికారి కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై గురువారం నాడిక్కడ జేఏసీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. 60 ఏండ్లుగా తెలంగాణలో లోకల్ రిజర్వేషన్లు అమలు చేయలేదని, దానివల్ల స్థానిక యువత తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంపై ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రు ల చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయన్నారు. ఆంధ్రా ఉద్యోగుల్ని వారి స్వరాష్ట్రానికి తీసేసుకోవా లని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్థానికత ఆధారంగా ఇప్పటికే తెలంగాణ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఉద్యోగుల కేటాయింపుల్ని పూర్తిచేశాయి. శుక్రవారం జరిగే ధర్మాధికారి కమిటీకి ఇదే నివేదిక ఇవ్వనున్నట్టు విద్యుత్‌సౌధలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు ఈ కేటాయింపు లను సమీక్షిస్తారు. అభ్యంతరాలను ధర్మాధికారి కమిటీకి విన్నవిస్తారు. రెండ్రోజులు జరిగే ఈ సమావేశమే చివరిది కావచ్చని అంచనా. ఇరు రాష్ట్రాల వాదనలు, ప్రతిపాదనలతో కూడిన నివేదికను జస్టిస్ ధర్మాధికారి సుప్రీంకోర్టుకు సమర్పిస్తారని తెలిసింది.

## లొంగిపోయిన మావోయిస్టు దళ కమాండర్



**నవతెలంగాణ - భద్రాచలం**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం తాలూకాలోని మంగళగూడ గ్రామానికి చెందిన మావోయిస్టు దళ కమాండర్ సవలం యడమయ్య అలియాస్ రామారావు భద్రాచలం ఏఎస్పీ రాజేష్‌చంద్ర ఎదుట లొంగిపోయాడు. గురువారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్, ఒడిషాలోని కోరాపుట్‌లో పోలీసులపై జరిగిన 12 దాడుల్లో యడమయ్య పాల్గొన్నాడని తెలిపారు. ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలిసేందుకు బయటకు వచ్చినట్టు చెప్పారు.

# 'మొత్తం పెసర్లను కొనుగోలు చేయాలి'

**నవతెలంగాణ-వైరాటౌన్**

మార్కెట్‌కు తెచ్చిన పెసర్లను మొత్తం కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వైరా వ్యవసాయ మార్కెట్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు మాట్లాడుతూ.. పెసల కొనుగోలుకు గత సోమవారం వరకు మార్క్‌ఫెడ్ గడువు ప్రకటించినప్పటికీ వైరా మార్కెట్ అధికారులు మాత్రం శుక్ర, శని, ఆదివారాల్లో పంటను మార్కెట్‌కు తీసుకురానివ్వకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సోమవారం తెచ్చిన పంట కొనుగోలుకు మాత్రమే అనుమతివ్వడం ఏంటని ప్రశ్నించారు.

పైగా కొనుగోలు చేసిన పంటను కాంటా వేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ఆందోళన విషయం తెలుసుకున్న వైరా ఎస్ఐ తాండ్ర నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులు, రైతుసంఘం నాయకులతో మాట్లాడారు. అనంతరం మార్క్‌ఫెడ్ డీఎం విజయచంద్ర, డీసీఎంఎస్ మేనేజర్ శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన పెసలను కచ్చితంగా కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, రైతు సంఘం నాయకులు మాడపాటి మల్లికార్జున్, నల్లమోతు వెంకటనారాయణ, చెరుకుమల్లి కుటుంబరావు, మాదినేని సైదులు తదితరులు పాల్గొన్నారు.




మార్కెట్ ఎదుట రైతుల రాస్తారోకో

## ఈతకెళ్లి అన్నదమ్ములు మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

**నవతెలంగాణ-కురవి**



దసరా సెలవులు ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపాయి. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాయి. సెలవుల్లో ఊర్లో గడిపేందుకు తల్లితో కలిసి వెళ్లిన అన్నదమ్ములు బావిలో ఈతకొడుతుండ గా ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుదనపల్లి గ్రామానికి చెందిన పూలోజు సోమన్న-వీరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. వారు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. పెద్ద కుమారుడు వేణు(14) పదో తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడు వరుణ్(12) 8వ తరగతి చదువుతున్నాడు. అయితే, దసరా సెలవులు రావడంతో వీరలక్ష్మి ఇద్దరు పిల్లలను తీసుకొని సుదనపల్లికి బయలుదేరింది. మార్గమధ్యలో కురవిలో చెల్లెలు ఇంటికి వెళ్లింది. అక్కడ వేణు, వరుణ్, పిన్ని కొడుకు ధనుష్‌తో కలిసి ఈత కొట్టడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. గట్టు పైన ఉన్న కర్రకు తాడు కట్టి ముగ్గురూ బావిలోకి దిగారు. తాడును పట్టుకుని ఈత కొడుతుండగా, పైన కర్ర విరిగిపోయింది. దాంతో ధనుష్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. కానీ వేణు, వరుణ్‌కు ఈత రాకపోవడంతో మునిగిపోయి మృతిచెందారు. ఇద్దరు పిల్లలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కాదు. విషయం తెలిసిన వెంటనే ఊరు ఊరంతా బావి వద్దకు తరలి కన్నీటి పర్యంతమైంది.



# ఇరాక్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు

- **20 మంది మృతి, 400 మందికి పైగా గాయాలు**

**బాగ్దాద్:** ఇరాక్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ అల్లర్లలో మృతి చెందిన నిరసనకారుల సంఖ్య గురువారం నాటికి 20కి చేరింది. మృతుల్లో ఓ పోలీసు అధికారి కూడా ఉన్నాడు. 400 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగా త్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అవినీతి, నిరుద్యోగ సమస్యతో విసుగు చెందిన ప్రజలు ఈ ఉద్యమానికి తెరలేపారు. దక్షిణ ఇరాక్ ప్రాంతంలో ఆందోళనలు ఉధృతమ య్యాయి. ఇరాక్‌లో చెలరేగిన పరిస్థితులు ప్రధాని అదెల్ అబ్దెల్ మహదీకి ఇబ్బందికరంగా మారాయి. నిరసనకారులు తక్షణమే ఆందోళన కార్యక్రమాలు విరమించుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అయితే, నిరసనకారులు ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేశారు. ముఖ్య నగరాల వీధుల్లోకి చేరుకొని ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. తెహ్రీర్ స్క్వేర్ ప్రాంతంలో నిరసనకారులపై పోలీసులు రబ్బరు బుల్లెట్లు, బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. నజాఫ్ నగరంలో ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. బాగ్దాద్ నుంచి తెహ్రీర్ చేరుకునేందుకు నిరసనకారులు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. విమానాశ్రయాల్లోనే విమానాలను నిలిపివేశారు. దీంతో, ప్రయాణీ కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరసనకారుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

## పోలీస్ అధికారులపై కత్తితో దుండగుడి దాడి

- **నలుగురు మృతి, పారిస్‌లో ఘటన...**

**పారిస్:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో దుండగుడు బీభత్సం సృష్టించాడు. కత్తితో నలుగురు పోలీస్ అధికారులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నలుగురు అధికారులు మృతి చెందారు. ఈ ఘటన అనంతరం పారిస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక అధికారులు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...పారిస్‌లోని సెంట్రల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కత్తి దాడి జరిగింది. పోలీస్ అధికారులపై ఓ దుండగుడు కత్తితో మెరుపుదాడికి దిగాడు. ఈఘటనలో నలుగురు పోలీస్ అధికారులు మృతిచెందారు.

అనంతరం అప్రమత్తమైన పోలీసులు దుండుగుడిని కాల్చి చంపారు. దుండగుడు కాల్పులకు పాల్పడ్డ కారణం తెలియరాలేదని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జీన్ మార్క్ బైలియుల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనతో ఉగ్రవాదం సంబంధంలేదని జీన్ మార్క్ తెలిపారు. ఈ ఘటనపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్, మేయర్ అన్నె హిదాల్గో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

## నిధుల సేకరణలో ట్రంప్ రికార్డు

- **మూడు నెలల్లో రూ.888 కోట్లు**

**వాషింగ్టన్:** వచ్చే ఏడాది జరుగనున్న అధ్యక్ష ఎన్నికల కోసం భారీగా నిధులు సమీకరిస్తున్నారు ట్రంప్ మద్దతుదారులు. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో 125 మిలియన్ డాలర్లను ( రూ.888 కోట్లు ) రిపబ్లికన్ నేషనల్ కమిటీ, డొనాల్డ్ ట్రంప్ ఎలక్షన్ క్యాంపెయిన్ సభ్యులు కలిసి సమీకరించారు. ఇది అధ్యక్ష ఎన్నికల నిధుల సమీకరణలో ఓ రికార్డుగా స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఒబామా హయాంలో 2011 మూడో త్రైమాసికంలో 70 మిలియన్ డాలర్లను ( రూ.497 కోట్లు) మాత్రమే సమీకరించారని తెలిపాయి. 2019లో 308 మిలియన్ డాలర్లను (రూ.2,188 కోట్లు) సమీకరించినట్టు ట్రంప్ మద్దతుదారులు వెల్లడించారు. 156 మిలియన్ డాలర్లు ( రూ.1,108 కోట్లు) బ్యాంకులో నిల్వ ఉన్నట్టు తెలిపారు. ట్రంప్‌పై డెమోక్రాట్ల అభిశంసన తీర్మానానికి వ్యతిరేకంగా ఈ నిధుల సమీకరణ చేపట్టారు.డెమోక్రాట్లు అధ్యక్షుడిపై గత వారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే డెమోక్రాట్ల చర్యలకు వ్యతిరేకంగా 8 మిలియన్ డాలర్లను (రూ. 56 కోట్లు) ప్రకటనల నిమిత్తం ఖర్చు చేయనున్నట్టు ట్రంప్ క్యాంపెయిన్ ప్రకటించింది. అభిశంసన తీర్మానానికి డెమోక్రాట్ల మద్దతుకు వ్యతిరేకంగా రిపబ్లికన్ నేషనల్ కమిటీ కూడా 2 మిలియన్ డాలర్లను ( రూ.14కోట్లు ) ఖర్చు చేయనున్నట్టు వెల్లడించింది.

## భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధం వస్తే...

- **10 కోట్ల మందికి పైగా ప్రాణాలకు ముప్పు:రాట్కెర్స్ యూనివర్సిటీ**

**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మధ్య అణుయుద్ధం వస్తే జరగబోయే పరిణామాలపై అమెరికాకు చెందిన ఓ యూనివర్సిటీ సంచలన అధ్యయనం వెలువరించింది. అణుయుద్ధంతో అంతర్జాతీయంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటాయనీ... దీని కారణంగా దాదాపు 10 కోట్ల మందికి పైగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వెల్లడించింది. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య 2025 లోపు యుద్ధం సంభవించే అవకాశాలున్న నేపథ్యంలో... యుద్ధానంతర పరిస్థితులపై న్యూ బ్రూన్స్‌విక్‌లోని 'రాట్కెర్స్ యూనివర్సిటీ' పరిశోధకులు అధ్యయనం చేశారు. 'సైన్స్ అడ్వాన్సెస్' అనే పత్రికలో ఇది ప్రచురితమైంది. రాట్కెర్స్ యూనివర్సిటీ పరిశోధకుడు అలన్ రోబక్ మాట్లాడుతూ... "అలాంటి యుద్ధమంటూ జరిగితే.. కేవలం బాంబులు విడిచిన చోట మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికే ప్రమాదం" అని అన్నారు. కాశ్మీర్‌పై ఇప్పటికే పలు యుద్ధాలు చేసుకున్న దాయాది దేశాలు.. 2025 నాటికి 400 నుంచి 500 అణ్వాయుధాలు సమకూర్చుకునే అవకాశం ఉందని తాజా అధ్యయనం తెలిపింది.

# మెక్సికో సరిహద్దులో ఎలక్ట్రిక్ తీగలు..!

## వలసల నిర్మూలనకు ట్రంప్ నిర్ణయం

- **అమెరికా అధ్యక్షుడి చర్యల పట్ల సర్వత్రా విమర్శలు**



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న పలు నిర్ణయాల పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వలసల నిర్మూలన కోసం మెక్సికో సరిహద్దులో ఎలక్ట్రిక్ తీగలు ఏర్పాటు చేయనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ అమాన వీయ చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మెక్సికో నుంచి అమెరికాకు వలసలను నిర్మూలించేందుకు సరిహద్దు చుట్టూ గోడ కడతానని చెప్పిన ట్రంప్ తాజాగా సరిహద్దుల్లో ఇనుప కంచెను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, వలసలు ఆగడం లేదని ఓ వింత నిర్ణయం తీసుకున్నారాయన. బోర్డర్‌లో ఎలక్ట్రిక్ తీగలు అమర్చి వాటిపై ముండ్ల కంచె ఏర్పాటు చేయాలని, అంతే కాకుండా దానికి కొద్ది దూరంలో నీటి కాలువ తవ్వి అందులో పాములు, మొసళ్లను ఉంచాలని అధికారులను ఆదేశించారు.

వైట్‌హౌస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. వలసవాదులు కంచె దాటేందుకు ప్రయత్నిస్తే వారి కాళ్లను కాల్చేయాలని అన్నారు. అయితే, వలసవాదులకు కాస్త మద్దతిచ్చేలా మాట్లాడిన వారిపైనా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### వలసదారులపై హొండురాస్‌తో ట్రంప్ సర్కార్ ఒప్పందం



హొండురాస్ వలసదారులను దేశం నుంచి పంపించాలని ట్రంప్ సర్కారు నిర్ణయించు కుంది. ఈ క్రమంలో హొండురాస్ దేశస్థులను బహిష్కరించడానికి ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకుంది.ఈ ఒప్పందం ప్రకారం హొండురాస్ శరణార్థులను అమెరికా దక్షిణ సరిహద్దు నుంచి బయటకు పంపిస్తుంది. ఇప్పటికే గ్వాటెమాలా, ఎల్ సాల్వడర్‌లతో అమెరికా ఇదే తరహా ఒప్పందాలను కుదుర్చు కుంది. ట్రంప్ మాత్రం అమెరికా-మెక్సికో సరిహద్దుల గుండా ప్రవేసిస్తున్న వలసదారుల సంఖ్యను తగ్గించాలని కృతనిశ్చయంతో ఉన్నారు. మెక్సికో తర్వాత మధ్య అమెరికా దేశాలైన హొండురాస్, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ల నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు అమెరికాలో ఆశ్రయం పొందేందుకు తరలివస్తున్నారు. దీనిని కట్టడి చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకుంది.అయితే, వీటికి చట్టసభలో అనుమతితో పాటు న్యాయపరంగా ఎన్నో సంక్లిష్ట దశలను దాటాల్సి ఉంటుందని పలువురు నిపుణులు అభిప్రాయపడు తున్నారు. కాగా ఈ నెల ప్రారంభంలో అమెరికాలో ఆశ్రయం పొందేందుకు వస్తున్న వలసదారులను దక్షిణ సరిహద్దుల్లో ఆపివేయాల్సిందిగా ఫెడరల్ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఆగస్టు నాటికి 8,11,016 మంది వలసదారులను యూఎస్ హొంలాండ్ సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 5.9 లక్షల మంది ఎల్ సాల్వడర్, గ్వాటెమాలా, హోండురాస్‌కు చెందినవారు కావడం గమనార్హం.

## విధి నిర్వహణ మరిచి...

- **పోలీస్ అకాడమీ డైరెక్టర్ వికె సింగ్ సంచలన వ్యాఖ్యలు**

**నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి :** తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ వికె సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసులు విధి నిర్వహణను మరిచి ప్రవర్తిస్తున్నారనీ, బడా బాబులు, రాజకీయనాయకులకు సేవ చేస్తున్నారని అన్నారు. పోలీస్ అకాడమీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక కార్యకర్తల్లా ఉండాల్సిన పోలీసులు.. డబ్బు, అధికారం ఉన్నవాళ్లతో స్నేహంగా ఉంటున్నారని అన్నారు. అసలు పోలీసులతో ప్రజలకు పని లేదనీ, నేరాలు జరిగినప్పుడు తప్పా ప్రజలకు పోలీసులు ఏవిధంగానూ ఉపయోగపడడం లేదని తెలిపారు. చట్టానికి, న్యాయానికి మాత్రమే పోలీసులు జవాబుదారీ అనీ, ప్రభుత్వానికి కాదని అన్నారు. అకాడమీలో ఇస్తున్న శిక్షణ క్షేత్రస్థాయిలో పనికి రావడం లేదని చెప్పారు. శిక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అవి వృథా అవుతున్నాయన్నారు. శిక్షణ తీసుకుని వెళ్తున్న పోలీసులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల కోసం పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రజల నుంచి గుర్తింపు రావడం లేదన్నారు. కొంత మంది పోలీసుల తీరువల్ల నిజాయితీగా పనిచేసిన వారికి కూడా చెడ్డ పేరు వస్తుందనీ, విధి నిర్వహణలో చనిపోయినా కూడా పోలీసులకు సరైన గౌరవం దక్కడం లేదని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి ఆనవాయితీ ఇంకా పోలీస్ శాఖలో కొనసాగుతోందన్నారు. పోలీస్ డ్రెస్ మీద ఉన్నంత మాత్రాన మనమే గొప్ప కాదనీ, సమాజ సేవ కోసం వచ్చినప్పుడు నిజాయితీగా పనిచేయాలని హితవు పలికారు. పోలీస్ అంటే భయం కాదు.. గౌరవం రావాలని సూచించారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా వ్యవహరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. 'సమాజంలో ఉన్న అవినీతిపరులకు, నేరస్తులకు పోలీసులు సహకరిస్తే ఇక వారికి ఎందుకు శిక్ష పడుతుంది. అమాయకులపై అక్రమ కేసులు నమోదవుతున్నాయి. పోలీస్ ట్రైనింగ్‌లో ఇదే నేర్చుకున్నారా? జైళ్లలో ఉన్నవారు 90శాతం బీదవారే. కొంతమందికి కనీసం ఎందుకు అరెస్ట్ అయ్యామో.. ఏ కేసులో అరెస్ట్ అయ్యి జైలుకు వచ్చామో కూడా తెలియదు' అని వికె సింగ్ అన్నారు. న్యాయంగా రావాల్సిన ప్రమోషన్లు పైరవీలతో వస్తున్నాయనీ, పోలీస్ అంటే కేవలం బిల్డప్ అయ్యి ఉండాల్సిన అవసరం లేదనీ, వికలాంగుడైనా పోలీసు కావొచ్చని వికె సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వికె సింగ్ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఈ సారి కాస్త ఘాటుగా మాట్లాడారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.


## తమిళనాట ఫ్లెక్సీల ఏర్పాటుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**చెన్నై:** ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ల పర్యటన నేపథ్యంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతివ్వాలంటూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా, గతంలో పేర్కొన్న నిబంధనలకు లోబడి ఫ్లెక్సీలను ఏర్పాటుచేసుకోవాల్సిందిగా ఆదేశించింది. కాగా, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భారత్‌లో ఈ నెల 11నుంచి 13వరకు తమిళనాడులో పర్యటించనున్నారు. ఇరుదేశాల సత్సంబంధాల మెరుగు కోసం పలు అంశాలను చర్చించనున్నట్టు సమాచారం.అలాగే సమీపంలోని చారిత్రక ప్రాంతమైన మహాబలిపురాన్ని సందర్శించనున్నట్టు తెలుస్తున్నది. ఈ అనాధికార భేటీ ఏర్పాట్లను సీఎం పళనిస్వామి స్వయంగా పరిశీలిస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన వీఆర్వో

- **రైతు వద్ద లక్ష రూపాయలు డిమాండ్**
- **రూ.50వేలు తీసుకుంటుండగా పట్టివేత**

**నవతెలంగాణ-తుర్కయాంజల్**



భూమి మ్యుటేషన్ కోసం రైతు దగ్గర రూ.50వేలు లంచం తీసుకుంటూ వీఆర్వో శంకర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం గుర్రంగూడకు చెందిన రైతు జక్కిడి ముత్యంరెడ్డికి తుర్కయంజాల్‌లో ఎకరం 29 గుంటలు భూమి ఉంది. రెండు నెలల క్రిందట మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ పని చేయడానికి తుర్కయంజాల్ వీఆర్వో శంకర్ రైతు వద్ద లక్ష రూపాయలు డిమాండ్ చేయగా 70 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ తరువాత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఒప్పందం ప్రకారం ముందుగా గురువారం రైతు నుంచి వీఆర్వో శంకర్ రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ చెప్పారు. ఫోన్ నెంబర్ 9440446140కు సమాచారం అందించాలని సూచించారు. ఈ దాడిలో సీఐలు గంగాధర్, మజీవ్ అలీ ఖాన్, నాగేంద్రబాబు, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి

- **రాష్ట్ర సర్కారుకు వీఆర్వో, వీఆర్ఏ జేఏసీ అల్టిమేటం**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

తమ మనోవేదనను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు కూడా వెనకాడబోమని వీఆర్వో, వీఆర్ఏ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసింది. సమ్మెలోకి వెళ్లేందుకు రెవెన్యూ ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది. ఈ మేర కు వీఆర్వో, వీఆర్ఏ సంఘాల జేఏసీ ప్రతినిధులు గరికె ఉపేంద్రరావు, ఎ.బాలనర్సయ్య, పి.విజయరామారావు, వంగూరు రాములు, హరాలే సుధాకర్‌రావు, బి.సుదర్శన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేసిన తహసీల్దార్లను, వీఆర్ఓలను రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా పాత స్థానాలకు పంపించటం లేదని ఆరోపించారు. రెవెన్యూ ఉద్యోగులపై సీఎం కేసీఆర్ దుష్ప్రచారం వల్ల, విపరీత పని ఒత్తిళ్ల మధ్య రెవెన్యూ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, గుండెపోటుకు గురై చనిపోతున్నారనీ, మరికొందరు అనారోగ్యాల పాలవు తున్నారని వాపోయారు. సెలవు, పండుగ దినాల్లో కూడా కుటుంబాలకు దూరంగా ఉంటూ రెవెన్యూ ఉద్యోగులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారనీ, అలాంటి తమపై నిందలు మోపడం దారుణమని పేర్కొన్నారు. పనివిధానంలో శాస్త్రీయత కొరవడిందని ఆందోళన వెలిబుచ్చారు.

# తమిళనాడులో దళితుల పోరాటం

## బస్టాప్‌లో కూర్చునే స్థలం నుంచి భూ హక్కుల వరకు...

- **సానుకూల ఫలితాలతో ఆందోళనలకు పదును..**





**చెన్నై:** దేశవ్యాప్తంగా దళితులపై దారుణాలు కొనసాగుతున్న తరుణంలో... బస్టాప్‌లో కూర్చునే స్థలం నుంచి మొదలు అంటరానితనం, రెండు గ్లాసుల విధానానికి వ్యతిరేకంగా, ఆలయప్రవేశం, భూ హక్కుల వరకూ తమిళనాడులో వెనుకబడినవర్గాలు నిరంతరం పోరాడుతున్నారు. మొక్కవోని దీక్షతో వారు జరుపుతున్న పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో విజయం దిశగా అడుగులు వేశాయి.. వేస్తున్నాయి. పాలనాయంత్రాంగం దిగొచ్చి వారి డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇస్తున్నది.. ప్రముఖ కమ్యూనిస్టు నేత బి శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) అనుబంధ సంఘం 'తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ (టీఎన్‌యూఈఎఫ్)' ఇటీవల అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టింది. విరుధునగర్, తిరువన్నమలై, పుదుకొట్టయి, ఈరోడ్ మరియు ధర్మపురి జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి.

**థెమావూర్‌లో బస్ షెల్టర్ పునరుద్ధరణ**

పుదుకోట్టయి జిల్లాలోని థెమావూర్‌లో బస్ షెల్టర్‌ను జిల్లా యంత్రాంగం పునరుద్ధరించింది. దళితులు అక్కడ కూర్చుంటున్నారని పెత్తందారులు ఆ బస్ షెల్టర్ రూఫ్, బెంచ్‌లను పదేపదే ధ్వంసం చేస్తూ వచ్చారు. తద్వారా దళితులు ఆ బస్టాప్‌లో కనీసం బస్సు కోసం వేచివుండటాన్ని కూడా పెత్తందారులు అడ్డుకున్నారు. చాలాకాలంగా ఈ దురాగతం కొనసాగుతుండగా, దళితుల ఆందోళన నేపథ్యంలో బస్‌షెల్టర్‌ను అధికారులు ఇటీవల పునరుద్ధరించారు. 'ఏడేండ్లుగా బస్‌షెల్టర్‌లో దళితులకు చోటులేదు. మా ఆందోళనతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. బస్ షెల్టర్‌ను పునరుద్ధరించారు. సీసీటీవీ కెమెరాను అక్కడ ఏర్పాటుచేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం' అని టీఎన్‌యూఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శామ్యూల్ రాజ్ చెప్పారు. ఈ ప్రాంతంలోని టీ దుకాణాల్లో రెండు గ్లాసుల పద్ధతి అమలులో వుంది. 'దళితులకు ఇచ్చే గ్లాసుల డిజైన్ వేరుగా వుంటుంది. పరీక్షగా చూస్తేనేకానీ.. మామూలు వ్యక్తులకు అర్థంకాదు. సమస్యను మేం ఎత్తిచూపాం. ఆందోళనచేపట్టాం. దాంతో దుకాణాల నుంచి ఆ గ్లాసులను తొలగించారు' అని రాజ్ తెలిపారు.

**ధర్మపురిలో భూ పంపిణీ**

ధర్మపురి జిల్లాలోని ఉంగరనల్లిలో భూ పోరాటం విజయవంతమైంది. 2011లో మొత్తం 78 మంది లబ్దిదారులకు 2.59 ఎకరాల భూమిని కేటాయించారు, కానీ, ఆ భూమి పెత్తందారుల ఆక్రమణలో ఉండిపోయింది. ఆ గ్రామం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి దగ్గరగా ఉన్నది. పదేపదే అధికారులకు దళితులు మొర పెట్టుకున్నా పాలనా యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. టీఎన్ యూఈఎఫ్ ఆ దళిత కుటుంబాలకు మద్ద తుగా నిలిచింది. ఆందోళనతో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. దళితులకు ఆ భూమిని అప్పగించారు.

**విరుదునగర్‌లో 2011 నుంచి మూతపడిన ఆలయం...**

విరుదునగర్ జిల్లాలోని పావాలి గ్రామంలో కన్నిమారియమ్మన్ కామాచి ఆలయం 2011లో మూతపడింది. పెత్తందారీ కులస్థులకుచెందిన ఓ కుటుంబ నియంత్రణలో వున్న ఆ ఆలయంలోకి దళితులు ప్రవేశించకుండా అడ్డుకునేందుకు గుడినే మూసేశారు. తమను ఆలయంలోకి ప్రవేశించనివ్వటంలేదని దళితులు కోర్టు గడపకెక్కారు. అయితే.. ఆలయం తెరిచినప్పుడు లోపలికి వెళ్లే హక్కు దళితులకు ఉన్నదని కోర్టు తీర్పునిచ్చింది. అప్పటి నుంచి ఆలయాన్ని పెత్తందారులు మూసివేశారు. 'ఆ పెత్తందారీ కుటుంబం వేరే జిల్లాకు వెళ్ళిపోయంది. అయినా ఆలయాన్ని తమ నియంత్రణలోనే ఉంచుకోవాలని చూసింది. ఆ ఆలయానికున్న 10 ఎకరాల భూమిని వారే వాడుకుంటున్నారు. శాంతి కమిటీ సమావేశాన్ని అధికారులు ఏర్పాటుచేశారు. అ కుటుంబం సమావేశానికి హాజరుకాలేదు. మేం తిరిగి కోర్టును ఆశ్రయించాం. త్వరలో ఆలయం తెరుచుకుంటుందన్న విశ్వాసంతో ఉన్నాం' అని శామ్యూల్ రాజ్ చెప్పారు.

### దళితుల భూమి పెత్తందార్ల చేతిలో...

తిరువన్నమలై జిల్లాలోని కదంబంకుట్టెయి గ్రామంలో షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు 10 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో '7.26 ఎకరాల భూమిని పెత్తందారులు స్వాధీనం చేసుకున్నారు. దళితులు తమ వద్ద రుణాలు తీసుకున్నారనీ, వాటిని తిరిగి చెల్లించలేక.. వారే తమకు భూములను అప్పగించారని పెత్తందారులు చెబు తున్నారు. వాస్తవానికి భూమిని వారు బలవంతంగా లాక్కు న్నారు. మా పోరాటంతో దిగివచ్చిన రెవెన్యూ అధికారులు, వారికి ఆ భూమిని అప్పగించేందుకు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని శామ్యూల్ తెలిపారు. హామీ నెర వేరకపోతే.. సీపీఐ(ఎం) నేతృత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని టీఎన్‌యూఈఎఫ్ నేత ప్రకటించారు.

దళితుల హక్కుల రక్షణకు అనేక చట్టాలున్నప్పటికీ.. కనీసం ప్రాథమిక సౌకర్యాలు కూడా అందని స్థితిలోకి వారు నెట్టబడుతున్నారు. సంఘాల నీడన ఒకపక్క పోరాటాలు పెరుగుతున్నా.. మరోపక్క వారి అణచివేత కూడా అదేవిధంగా పెరుగుతుందనటానికి ఇటీవల వెలుగు చూస్తున్న అనేక ఘటనలు సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. అలాగే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. అనేకసాకులతో వారిపై క్రూరమైన దాడులు, అణచివేత, వివక్ష ఘటనలు పెచ్చుమీరుతున్నాయి. ఏదేమైనా.. హక్కుల కోసం మొక్కవోని దీక్షతో ఇటీవల ఆందోళనలూ పెరుగుతున్నాయి... కొన్ని అనుకూల ఫలితాలు వస్తుండటంతో టీఎన్‌యూఈఎఫ్ వంటి సంఘాలు తమ హక్కుల సాధనకు మరిన్ని పోరాటాలకు సిద్ధమవుతున్నాయి.

## పాసుపుస్తకం కోసం ట్యాంక్ ఎక్కి రైతుల నిరసన

**నవతెలంగాణ-కేసముద్రం రూరల్**




పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తుండటంతో రైతులు పెట్రోల్ సీసాలు పట్టుకుని నీళ్ల ట్యాంక్ ఎక్కారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో గురువారం జరిగింది. నారాయణపురం గ్రామానికి చెందిన రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. 1962 నుంచి 2017 వరకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయన్నారు. ఇటీవల భూ ప్రక్షాళన చేసిన తర్వాత 268 మంది రైతులకు సంబంధించి 1,605 ఎకరాల భూమికి కొత్త పాసుపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అధికారులను అడిగితే అటవీభూమి అని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వచ్చే వరకు కిందికి దిగబోమని చెప్పడంతో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎస్ఐ సతీష్‌గౌడ్ అక్కడికి వచ్చి వారితో మాట్లాడారు. పట్టాలు ఇప్పిస్తామని హామీనివ్వటంతో ఆందోళన విరమించారు.

# గాంధీని పొగిడి గాడ్సేకు గుడినా?

- **బీజేపీ ద్వంద వైఖరిపై కుంతియా విమర్శ**

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**



మహాత్మాగాంధీ విషయంలో బీజేపీ ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా విమర్శించారు. ఒకవైపు గాంధీపై పొగడ్తలు గుమ్మరిస్తూనే...మరోవైపు గాంధీని హత్య చేసిన గాడ్సేకు గుడి కడుతున్నారని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి బోసురాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీ గురించి బీజేపీ నేతలు మాట్లాడుతూనే...గాడ్సేకు గుడి కట్టి, వారిద్దరినీ ఒకే గాటున కడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ తమ ప్రచారం కోసం గాంధీ కండ్ల అద్దాలను, ఆయన పేరును వాడుకుంటున్నదన్నారు. హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి గెలుపు కోసం నాయకులందరూ ఉమ్మడిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. ముందస్తు ఎన్నికల్లో ప్రభుత్వం కావాలనే కోదాడలో కక్ష పూరితంగా ఓడించిందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో టీఆర్ఎస్ ఏడు సీట్లు ఓడిపోయిందనీ, హుజూర్‌నగర్ ఎన్నికల్లో ఆపార్టీ భయపడుతున్నదనీ, అందుకే సీపీఐ మద్దతు కోరుతున్నదన్నారు.

**సచివాలయంలోని మసీదులను ప్రారంభించండి : హోంమంత్రికి వినతి**

సాధారణ ప్రార్థనల కోసం సచివాలయ ప్రాంగణంలోని మసీదులను తిరిగి ప్రారంభించాలని కాంగ్రెస్ కోరింది. ఏడు దశాబ్దాలకు పైగా ఆ మసీదుల్లో ప్రార్థనలు జరుగుతున్నాయనీ, సెప్టెంబర్ 30న వాటిని మూసివేసిందని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్ అలీకి టీపీసీసీ మైనారిటీల విభాగం చైర్మెన్ షేక్ అబ్దుల్లా సోహైల్, అధికార ప్రతినిధి నిజాముద్దీన్ వినతిపత్రం సమర్పించారు. ఈ చర్య మత హక్కును ఉల్లంఘించినట్టుగా ఉందన్నారు. మసీదులు, దేవాలయాలు కార్యాలయాలు కావనీ, వెంటనే ప్రార్థనలకు అనుమతి ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

epaper.navatelangana.com



'లక్ష్మీ బాంబ్' చిత్రంలో హిజ్రాగా అక్షయ్‌కుమార్

# నవచిత్రం

## కబడ్డీ నేపథ్యంలో సినిమా షురూ



తమన్నా, గోపీచంద్, బోయపాటి శ్రీను

గోపీచంద్, తమన్నా జంటగా సంపత్ నంది దర్శకత్వంలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న నూతన చిత్రం రామానాయుడు స్టూడియోలో గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. హీరోహీరోయిన్లు గోపీచంద్, తమన్నాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బోయపాటి శ్రీను క్లాప్ నివ్వగా, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ కెమెరా స్విచాన్ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో గోపీచంద్ మాట్లాడుతూ, 'శ్రీనివాస్, పవన్ కుమార్‌తో ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది. పర్ఫెక్ట్ స్టోరీతో వస్తున్నాం. 'గౌతమ్ నంద' సమయంలోనే సంపత్‌తో మరో సినిమా చేస్తానన్నాను. ఇప్పుడు సూపర్ స్క్రిప్ట్‌తో వచ్చాడు. ఆయనతో వర్కింగ్ కంఫర్ట్‌గా ఉంటుంది. తమన్నాతో తొలిసారి కలసి నటిస్తున్నాను. ఆమెది కూడా ప్రాధాన్యత కలిగిన పాత్ర. సౌందర్ రాజన్ 'గౌతమ్‌నందా'లో నన్ను బాగా చూపించాడు. ఇందులో అంతకుమించి చూపిస్తాడని నమ్ముతున్నా. మంచి టీమ్‌తో, మంచి కథతో వస్తున్నాం. కచ్చితంగా ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని అన్నారు.

"సైరా'లో అద్భుత నటనతో మెప్పించిన తమన్నాకి అభినందనలు. నా గత చిత్రాలకు భిన్నంగా తొలిసారి స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా చేస్తున్నా. కబడ్డీ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆంధ్రా మహిళల కబడ్డీ జట్టుకి కోచ్‌గా గోపీచంద్, తెలంగాణ టీమ్‌కి కోచ్‌గా తమన్నా కనిపిస్తారు. రియల్ లైఫ్ ప్లేయర్స్‌ని తీసుకున్నాం. ఫస్ట్ టైమ్ బలమైన కథతో సినిమా చేస్తున్నా. ఎమోషన్స్ కూడా అదే రేంజ్‌లో ఉంటాయి. 'గౌతమ్‌నందా'తో గోపీచంద్ అభిమానులను నిరాశ పరిచాను. ఈ సినిమాతో వారిని మెప్పిస్తాను. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని సంపత్ నంది తెలిపారు.

తమన్నా మాట్లాడుతూ 'సంపత్‌తో ఇది మూడో సినిమా. 'రచ్చ'లో మెమరబుల్ క్యారెక్టర్ ఇచ్చాడు. ఈ కథ చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. కథ విన్నప్పుడు గర్వంగా ఫీలయ్యాను. ఇటీవల సినిమాల్లో కంటెంట్‌కి ప్రాధాన్యత పెరిగింది. ఇది అలాంటి చిత్రమే. నటనకి ప్రాధాన్యత ఉన్న పాత్ర పోషిస్తున్నాను. గోపీచంద్‌తో నటించడం ఇదే తొలిసారి. ఆయన అమేజింగ్ యాక్టర్' అని చెప్పింది. 'ఎనిమిదేళ్లుగా గోపీచంద్‌తో సినిమా చేయాలనుకుంటున్నాం. రకరకాల కథలు విన్నాం కానీ కుదరలేదు. ఈ కథ వినగానే గోపీచంద్ షూటింగ్ ఎప్పుడన్నారు?. అంతలా ఆయనకు ఈ కథ నచ్చింది. తమన్నా కూడా అదే తరహాలో స్పందించారు. అన్ని కమర్షియల్ అంశాల మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాత శ్రీనివాసా చిట్టూరి చెప్పారు.

# భారతీయ సినిమాగా 'సైరా..' ముద్ర వేసుకుంది

### - 'థ్యాంక్యూ ఇండియా' ప్రెస్‌మీట్‌లో చిరంజీవి



జగపతిబాబు, సురేందర్‌రెడ్డి, రామ్‌చరణ్, చిరంజీవి, తమన్నా, సుస్మిత, పరుచూరి బ్రదర్స్

'నేను నటించిన 150 సినిమాలు ఒక ఎత్తు, 'సైరా నరసింహారెడ్డి' మరో ఎత్తు అని అందరూ ప్రశంసిస్తున్నారు. ఆ మాటలు వింటుంటే చాలా ఆనందంగా ఉంది. ఇది సౌత్ సినిమా అని కాకుండా భారతీయ సినిమాగా ముద్ర వేసుకున్నందుకు గర్వంగా ఉంది' అని చిరంజీవి అన్నారు.

ఆయన హీరోగా నటించిన చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో నయనతార, తమన్నా కథానాయికలుగా అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతిబాబు, రవికిషన్, సాయిచంద్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా బుధవారం విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన 'థ్యాంక్యూ ఇండియా' మీట్‌లో చిరంజీవి మాట్లాడుతూ, 'ఇరవై ఏండ్ల క్రితమే స్వాతంత్ర సమరయోధుడిపై సినిమా చేయాలని, భగత్ సింగ్ లాంటి మహావ్యక్తి పాత్ర పోషించాలనుకున్నాను. కానీ 12 ఏండ్ల క్రితం పరుచూరి బ్రదర్స్ సరిగ్గా అలాంటి కథతో వచ్చారు. ఐడియా నాకు బాగా నచ్చింది. కానీ బడ్జెట్ ఎవరు పెడతారు?, ఇంత పెద్ద సినిమాని ఎక్కడ తగ్గినా న్యాయం చేయలేం. దీంతో కొన్ని సంవత్సరాలుగా దాన్ని పక్కన పెడుతూ వచ్చాను. ఇప్పుడు చరణ్ రావడంతో పట్టాలెక్కింది. దీనికి సురేందర్‌రెడ్డి న్యాయం చేయగలరనిపించింది. అడగ్గానే ఒప్పుకున్నాడు. మా కథ విని, తనే టీమ్‌తో అద్భుతంగా కథ రెడీ చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆయన కథని సిద్ధం చేసిన తీరుకి హ్యాట్సాఫ్ చెప్పాలి. తనపై మేం పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సినిమాని ఓ ఎపిక్‌గా తీర్చిదిద్దారంటే ఆ క్రెడిట్ సురేందర్‌రెడ్డికే దక్కుతుంది. ఈ సినిమా కోసం తను ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడో నాకు తెలియదుగానీ, కథకి న్యాయం చేయాలనే కసితో పనిచేశారు. తను తెలుగు పరిశ్రమకి దొరికిన మరో అద్భుతమైన దర్శకుడు. స్క్రిప్ట్ విషయంలో సత్యానంద్ ఎంతో ఉపయోగపడ్డారు. ఆర్టిస్టులతోపాటు టెక్నీషియన్లు ప్రాణం పెట్టి పనిచేశారు. 'గురువు పాత్రకి మీరు చేస్తే బాగుంటుంద'ని అడగ్గానే నా స్నేహితుడి కోసం చేస్తున్నా అని తనకు సంబంధించి తనే ఖర్చు పెట్టుకుని అమితాబ్ బచ్చన్ ఫ్రీగా నటించారు. ఆయన్ని చూసి ఎంతో నేర్చుకున్నా. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. కానీ తీర్చుకునే ప్రయత్నం చేస్తా. అనుష్క కూడా ఎలాంటి ఫలితం ఆశించకుండా నటించారు. అడగ్గానే కన్నడ నటుడు సుదీప్ అవుకు రాజుగా తనదైన స్టయిలీష్ నటనతో మెప్పించారు. అలాగే ఎంతో బిజీగా ఉండే విజయ్ సేతుపతి రాజాపాండీగా నటించారు. జగపతిబాబు తన పాత్ర కోసం ప్రాణం పెట్టారు. నా పాత్ర పక్కన పెడితే అందరిని ఆకట్టుకోవడంతోపాటు కదిలించిన పాత్ర తమన్నాది. లక్ష్మిగా ఆమె నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. సిద్ధమ్మగా నయనతార మెప్పించారు. సాయిచంద్ ఈ సినిమా కోసం గెడ్డం పెంచారు. మధ్యలో మరో సినిమా వచ్చినా ఒప్పుకోలేదు. అంత డెడికేటెడ్‌గా వర్క్ చేశారు. ఇలా ప్రతి పాత్రధారి బాగా నటించారు. టెక్నీషియన్ల పరంగా కెమెరామెన్ రత్నవేలు అద్భుతంగా చూపించారు. నేను 20ఏండ్లు వెనక్కి వెళ్ళినట్టు చూపించారంటున్నారు. ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ ఆనాటి కాలాన్ని ప్రతిబింబించేలా సెట్స్ వేసి సహజత్వం తీసుకొచ్చారు. 3800 వీఎఫ్ఎక్స్ షాట్స్ చేయడం ఈజీ కాదు. కానీ కమల్ కన్నన్ బృందం 25 స్టూడియోస్‌లో వర్క్ చేయించి అనుకున్న టైమ్‌కి అందించారు. సాయిమాధవ్ బుర్రా అద్భుతమైన డైలాగులతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఆంగ్లేయులను ఎదురించిన తొలి తెలుగు యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి లాంటి స్వాతంత్ర సమరయోధుల చరిత్ర నేటి తరాలకు, దేశవ్యాప్తంగా, ప్రపంచానికి తెలియాలంటే ఏకైక మార్గం సినిమా. ఈ సినిమాతో అందరికి నరసింహారెడ్డి గురించి తెలుస్తుంది. ఇది సౌత్ సినిమాగా కాకుండా ఇప్పుడు ఓ భారతీయ చిత్రంగా ముద్ర వేసుకుంది. సినిమా చూసి బాలీవుడ్ మీడియా స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చింది. ఇలాంటి గొప్ప చిత్రాన్ని తీసినందుకు గర్వపడుతున్నాం' అని ట్వీట్స్‌లో ప్రశంసించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.

**'ఈ విజయాన్ని ఊహించలేదు. ఇంత మంచి కథాలోచన చేసిన పరుచూరి బ్రదర్స్‌కి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. ఇది గర్వపడే చిత్రమవుతుంది. విడుదలకు నెల రోజుల ముందు నుంచి నాకు నిద్రపట్టలేదు. ఉదయం 3 గంటల సమయాల్లో ఉలిక్కి పడి లేచేవాడిని. అలా ఎందుకు జరుగుతుందో అర్థమయ్యేది కాదు. బహుశా నిర్మాతలందరికీ ఇలానే ఉంటుందేమో అనిపించేది. సినిమా చేయడానికి, డాడీకి పెద్ద హిట్ ఇవ్వడానికి ఉయ్యాలవాడ ఆత్మ మమ్మల్ని కలిపినట్టు అనిపించింది. రాజీవన్, రత్నవేలు, కమల్ కన్నన్, ఆర్టిస్టులు ఇలా అందరు ఎంతో కష్టపడి సినిమాకి పనిచేశారు. అందరిచేత కూల్‌గా దర్శకుడు సురేందర్‌రెడ్డి వర్క్ చేయించుకున్నారు. అందరికంటే చిరంజీవిగారు తన ఇమేజ్‌ని పక్కన పెట్టి జీవించేశారు. అందుకే ఇంతటి విజయం వరించింది' అని నిర్మాత రామ్‌చరణ్ తెలిపారు.**

చిత్ర దర్శకుడు సురేందర్‌రెడ్డి చెబుతూ, 'సినిమా విడుదలైతే అప్పుడే మూడేండ్లు పూర్తయ్యాయా? అనిపిస్తుంది. ఈ ఫలితం కష్టం మొత్తం మర్చిపోయేలా చేసింది. అయితే ఈ సినిమా చేయాలనప్పుడు నిద్రలేని రాత్రులు గడిపాను. ఇంత పెద్ద బడ్జెట్‌ని, చిరంజీవిగారిని, ఇంత భారీ తారాగణాన్ని ఇచ్చారు. ఇలాంటి సినిమాలు హిట్ అయినవి చాలా తక్కువ. పైగా ఇందులో వినోదం లేదు, చిరంజీవితో పాటలు లేవు, పైగా ఆయన పాత్రని చంపేస్తాం. అసలు ఇది ఆడియెన్స్‌కి నచ్చుతుందా? ఫ్యాన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే భయంతో నిద్రపట్టలేదు. అప్పుడు నేను నమ్ముకున్నది కేవలం దేశభక్తిని మాత్రమే. చిరంజీవి కూడా అదే చెప్పి ప్రోత్సహించారు. నాన్నకి గొప్ప సినిమా ఇవ్వాలని, నాన్న కలని నెరవేర్చాలని చరణ్ ఎంతో తపించారు. అలా చిరంజీవిగారి డ్రీమ్‌లో నేను భాగమైనందుకు, ఇంతటి గొప్ప సినిమా చేసినందుకు గర్వపడుతున్నా' అని చెప్పారు.

'కెరీర్‌లో గొప్పగా చెప్పుకునే లక్ష్మి పాత్రనిచ్చినందుకు సురేందర్‌రెడ్డికి, చరణ్‌కి థ్యాంక్స్. ఇది వరకు నన్ను రకరకాల పేర్లతో పిలిచేవారు. ఇప్పుడు లక్ష్మి నరసింహారెడ్డి అంటున్నారు. చిరంజీవిగారి డ్రీమ్ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలనుంది' అని తమన్నా తెలిపారు.

జగపతిబాబు చెబుతూ, 'నాన్నకు ప్రేమతో అంటూ చిరంజీవి కోసం చరణ్ చేసిన చిత్రమిది. తండ్రికి గొప్ప బహుమతి ఇచ్చారు. నా పాత్రకి ఇంత స్పందన వస్తుందని ఊహించలేదు' అని చెప్పారు. 'ఎక్కువగా కలెక్షన్ల విషయంలో బాలీవుడ్ సినిమాల గురించే వింటుంటాం. కానీ మొదటిసారి సౌత్ సినిమా కలెక్షన్లు చెప్పుకోవాలి. ఈ సినిమా తొలి రోజు వరల్డ్ వైడ్‌గా రూ.85కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసింది' అని నిర్మాత దిల్‌రాజు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పరుచూరి బ్రదర్స్, సత్యానంద్, సాయిమాధవ్ బుర్రా, రాజీవన్, రత్నవేలు, కమల్ కన్నన్, విక్కీ, సుస్మిత తదితరులు పాల్గొని తమ విజయానందాన్ని పంచుకున్నారు.

# చాణక్య డ్రీమ్ ప్రాజెక్ట్




తిరు

"చాణక్య' నా డ్రీమ్ ప్రాజెక్ట్. దీనిపై ఐదేండ్లుగా వర్క్ చేశా. గోపీచంద్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం చాలా ఆనందంగా ఉంది' అని అంటున్నారు దర్శకుడు తిరు.

గోపీచంద్, మెహరీన్ జంటగా, జరీనా ఖాన్ కీలకపాత్రధారిణిగా తిరు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'చాణక్య'. దసరా కానుకగా ఈ నెల 5న సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు తిరు మాట్లాడుతూ, 'చిన్నప్పట్నుంచి తెలుగు సినిమాలంటే ఇష్టం. చిరంజీవిని బాగా ఇష్టపడతా. దర్శకుడు శివ నాకు ఫ్రెండ్. మేమిద్దరం అసిస్టెంట్‌గానూ పనిచేశాం. శివ ద్వారా గోపీచంద్ పరిచయం. ఆయనతో మంచి స్పై బేస్డ్ యాక్షన్ సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకుంటున్నా. బేసిగ్గా నాకు స్పై ప్రధాన చిత్రాలంటే ఇష్టం. నా ఫేవరేట్ జోనర్. ఏడాదిన్నర క్రితం గోపీచంద్‌కి ఈ కథ చెప్పా. ఆయన లవ్ ట్రాక్‌లో కొన్ని మార్పులు చెప్పారు. తెలుగులో వచ్చిన స్పై బేస్డ్ చిత్రం 'గూఢచారి' చూశా. దాని కంటే స్పాన్‌పరంగా, స్కేల్ పరంగా ఇది చాలా పెద్దది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించా. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ కూడా చేశాను. రా, సీఐఏ, ఐఎస్ఐ వంటి సంస్థల గురించి బాగా స్టడీ చేశా. నేను చదువుకున్నది, సినిమాల ద్వారా చూసిన దాని బట్టి సొంతంగానే క్రియేట్ చేసుకున్నా. రియాలిటీకి దగ్గరగా ఉండేలా తీశాను. ఇందులో హీరో చేసిన స్పై కోవర్ట్ ఆపరేషన్ దేని కోసమనేది తెరపైనే చూడాలి. ఇందులో విలన్ పాకిస్థాన్‌కి చెందిన వ్యక్తిగా ఉంటాడు. కొంత పోర్షన్ పాకిస్థాన్‌లో చిత్రీకరించాల్సింది. కానీ సెట్ వేసి చేశాం. రాజస్థాన్‌లో యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నప్పుడు బైక్ ఛేజింగ్ టైమ్‌లో గోపీచంద్‌కి పెద్ద గాయమైంది. నిజానికి అది పెద్ద ప్రమాదమే. మేమంతా ఎంతో టెన్షన్ పడ్డాం. కానీ మాలో గోపీచంద్ ధైర్యం నింపారు. రెండుమూడు నెలల్లో షూటింగ్‌కి వస్తానని ధైర్యం చెప్పారు. ఆయన చాలా హార్డ్ వర్కర్. గతంలో ఎన్నో యాక్షన్ సినిమాలు చేశారు. కానీ ఇందులో క్లాసీగా, స్టయిలీష్ యాక్షన్‌తో ఆకట్టుకుంటారు. ఇందులో ఆయన నటన చాలా సెటిల్డ్‌గా ఉంటుంది. ఓ రకంగా కొత్త గోపీచంద్‌ని చూస్తారు. బాలీవుడ్‌లో వచ్చిన 'ఏక్ థా టైగర్', 'టైగర్ జిందా హై'తో సంబంధం లేదు. పూర్తి కొత్తగా ఉంటుంది. నిర్మాత అనిల్ సుంకర ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుంది' అని అన్నారు.



బెల్లంకొండ గణేష్

# సరికొత్త లవ్‌స్టోరీతో ఎంట్రీ

ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ రెండో తనయుడు, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తమ్ముడు బెల్లంకొండ గణేష్ హీరోగా పరిచయం కాబోతున్నారు. పవన్ సాధినేని దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని బెటెల్ లీఫ్ ప్రొడక్షన్స్, లక్కీ మీడియా పతాకాలపై బెక్కం వేణు గోపాల్ నిర్మిస్తున్నారు. 'ఓ సరికొత్త లవ్ స్టోరీతో బెల్లంకొండ గణేష్ హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఈ నెల 5న సినిమా ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి రథన్ సంగీతం అందిస్తుండగా, కార్తీక్ ఘట్టమనేని కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. వివేక్ ఆత్రేయ డైలాగ్స్ రాస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

# ఇక భయ పెడతా..



సోనమ్ కపూర్

**'ఇప్పటి వరకు నేను యాక్షన్, హర్రర్ జోనర్ సినిమాలు చేయలేదు. ఆయా జోనర్ చిత్రాల్లో నటించాలనుకుంటున్నా' అని అంటోంది సోనమ్ కపూర్. కెరీర్ ప్రారంభం నుంచి చాలా సెలక్టీవ్‌గా సినిమాలు చేసే సోనమ్ శక్తివంతమైన పాత్రలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. లేటెస్ట్‌గా 'ది జోయా ఫ్యాక్టర్'లో చేసిన పాత్రతోనూ ప్రేక్షకుల్ని విశేషంగా మెప్పించింది. 'నేనిప్పటి వరకు చాలా జోనర్ సినిమాలు చేశా. కానీ యాక్షన్ ప్రధానంగా, హర్రర్ నేపథ్య చిత్రాలు చేయలేదు. ఆ దిశగా నేనేంటో నిరూపించుకోవాలనుకుంటున్నా. ఇవి నాకు చాలా భిన్నంగా ఉంటాయి. అంతేకాదు చాలా ఎగ్జైట్ చేసే జోనర్స్ కూడా. వీటిల్లో నటించాలని ఆతృతగా ఉంది' అని సోనమ్ తెలిపింది. త్వరలో సుజిత్ సిర్కార్, విశాల్ భరద్వాజ్‌లతో సోనమ్ సినిమాలు చేయనున్నట్టు సమాచారం. అందులో రణ్‌బీర్ కపూర్‌తో ఓ సినిమా ఉంటుందని తెలుస్తోంది. అయితే ఎవరి దర్శకత్వంలో ఈ చిత్రం ఉంటుందనేది ప్రస్తుతానికి మాత్రం సస్పెన్స్‌గా నే ఉంది.**

# క్రిష్ 4కి రంగం సిద్ధం

'క్రిష్' బాలీవుడ్‌లో విజయవంతమైన ఫ్రాంఛైజీ. సూపర్ హీరోలని ఇండియన్ స్క్రీన్‌కి పరిచయం చేసిన సిరీస్ ఇది. హృతిక్ రోషన్ హీరోగా ఆయన తండ్రి రాకేష్ రోషన్ ఈ చిత్రాలను రూపొందించారు. ఇప్పటికే వచ్చిన మూడు సినిమాలు బాక్సాఫీసు వద్ద ఘన విజయాలు సాధించాయి. కలెక్షన్ల పరంగానూ రికార్డులు సృష్టించాయి. దీనిలో భాగంగా 'క్రిష్ 4' సినిమాని రూపొందించేందుకు రాకేష్ రోషన్ చాలా రోజులుగా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆయన కాన్సర్‌కి గురికావడంతో స్క్రిప్ట్ దశలోనే సినిమా ఆగిపోయింది. కాన్సర్ నుంచి కోలుకున్న రాకేష్ రోషన్ ఇప్పుడు స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారట. గత చిత్రాలకంటే భారీ స్థాయిలో, భారీ తారాగణంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో సినిమాని మొదలు పెట్టి, 2020 క్రిస్మస్ కానుకగా విడుదల చేయాలని ఆయన భావిస్తున్నారు.



హృతిక్ రోషన్, రాకేష్ రోషన్



అరవింద స్వామి

# వెండితెర ఎంజీఆర్

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా ఓ బయోపిక్ రూపొందుతున్న విషయం విదితమే. టైటిల్ పాత్రలో కంగనా రనౌత్ నటిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఎల్.విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విష్ణు ఇందూరి, శైలేష్ సింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఇందులో కీలక పాత్ర కోసం అరవిందస్వామిని ఎంపిక చేశారు. "బాలీవుడ్ 'క్వీన్' కంగనా ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ బయోపిక్‌లో ఎంజీఆర్ పాత్రలో అరవింద స్వామి నటించనున్నారు. విజయేంద్రప్రసాద్ రచయితగా పని చేస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్‌ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నాం. తెలుగు, తమిళం, హిందీలో సినిమా తెరకెక్కనుంది' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

# అలరించే రొమాంటిక్ కామెడీ



రాకేష్ వర్రె, గార్గేయి ఎల్లా ప్రగడ

రాకేష్ వర్రె, గార్గేయి ఎల్లా ప్రగడ జంటగా బసవ శంకర్ దర్శకత్వంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రాకేష్ వర్రె నిర్మిస్తున్న చిత్రం 'ఎవరికీ చెప్పొద్దు'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి దర్శకుడు బసవ శంకర్ మాట్లాడుతూ, 'అబ్బాయిని ఇష్టపడ్డ అమ్మాయి తన ప్రేమను మాత్రం అతనికి చెప్పదు. అబ్బాయి ఫోన్ చేసినా తిడుతుంది. చేయకపోయినా తిడుతుంది. కానీ ప్రేమిస్తుంది. ఇద్దరి మధ్య ఉండే అంతరం కులం. మరి ఈ అంతరాన్ని దాటి ఈ ప్రేమికులు ఒకటయ్యారా..లేదా అనేది తెలుసుకోవాలంటే ఈ చిత్రం చూడాల్సిందే' అని అన్నారు.

'హార్ట్ టచింగ్ లవ్ స్టోరీస్‌ను తెలుగు ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తుంటారు. అలాంటి రొమాంటిక్ కామెడీ స్టోరీతో ప్రేక్షకుల ముందుకి వస్తున్నాం. సినిమాకి సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. మా సినిమాను అక్టోబర్ 8న దిల్‌రాజుగారు రిలీజ్ చేస్తున్నారు. ఆయన అందిస్తున్న సహకారానికి స్పెషల్ థ్యాంక్స్. ట్రైలర్ చూసిన వాళ్లందరూ బాగుందంటున్నారు. అందరికీ నచ్చే చిత్రమవుతుంది' అని నిర్మాత రాకేష్ వర్రె తెలిపారు.

# తెగని 'ఆర్టీసీ' చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

నాటి చర్చలు కూడా విఫలమైన విషయం తెలిసిందే. గురువారం మరోమారు ఇవే అంశాలపై చర్చించేందుకు రావల్సిందిగా అధికారులు జేఏసీ నేతల్ని ఆహ్వానించారు. జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి, తిరుపతి (టీఎమ్‌యూ), కో కన్వీనర్ కె రాజిరెడ్డి, ఎస్ బాబు (ఎంప్లాయీస్ యూనియన్), వీఎస్ రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్) చర్చలకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు రెండు విడతలుగా చర్చలు జరిపారు. అయినా సమస్యల పరిష్కారంపై ఏకాభిప్రాయం కుదరలేదు. దసరా సందర్భంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని, సమ్మెను విరమించాలని సోమేష్‌కుమార్ కోరారు. సమస్యలు పరిష్కరిస్తే...సమ్మెకు వెళ్లబోమని, ఆ పరిష్కారాలకు నిర్దిష్టకాలపరిమితి ఉండాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. దీనితో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఆర్టీసీ కార్మికులకు తాత్కాలికంగా కరువుభత్యం ఇవ్వడమా...లేక పే రివిజన్‌ను ప్రతిపాదించడమా అనే అంశంపై చర్చల్లో పురోగతి కనిపించలేదు. ఆర్టీసీ విలీనంపై అధ్యయనం చేశాకే నిర్ణయం ఉంటుందని సోమేష్‌కుమార్ తేల్చిచెప్పారు. ఆ అధ్యయనాన్ని ఎన్నిరోజుల్లో పూర్తిచేసి, ప్రభుత్వానికి ఎప్పట్లోపు నివేదిక ఇస్తారో తేదీని ఖరారు చేయాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఓవైపు జేఏసీ నేతలతో చర్చలు జరుగుతుండగానే, బస్‌భవన్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమ్మె జరిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎలా చేయాలి అనే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, టీఎస్‌ఆర్టీసీ ఇంఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ హాజరయ్యారు. ఆయనే జేఏసీ



నేతలతో కూడా చర్చలు జరపడం గమనార్హం. ఈ తరహా ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని జేఏసీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమను చర్చలకు పిలిచి, ప్రత్యామ్నాయాలపై సమీక్షించ డం ఏంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాతపూర్వకంగా నిర్దిష్ట కాలపరిమితితో డిమాండ్ల పరిష్కారాలపై స్పష్టత ఇస్తేనే ఒప్పుకుంటామని, లేకుంటే సమ్మెలోకి వెళ్ళడం తథ్యమని తేల్చిచెప్పారు. శుక్రవారం మరోదఫా చర్చలకు ఆహ్వానిస్తామని అధికారులు జేఏసీ నేతలకు చెప్పారు. దీంతో అర్థాంతరంగా చర్చలు ముగిసాయి.

**ప్రత్యామ్నాయాలు చూడండి : మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

ఈనెల 5వతేదీ నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి వెళ్తే...ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఆయన గురువారం తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లను సమీక్షించారు. టీఎస్‌ఆర్టీసీ ఇంఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీలోని అద్దెబస్సుల్ని పూర్తిస్థాయిలో నడపా లని ఆదేశించారు. ప్రయివేటు బస్సులను స్టేజి క్యారియ ర్లుగా నామమాత్ర రుసుంతో అనుమతి ఇస్తూ తిప్పాలని చెప్పారు. మెట్రోరైల్, ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల ట్రిప్పుల్ని అద నంగా పెంచి, ప్రయాణీకుల్ని గమ్యస్థానాలకు చేర్చాలని సూ చించారు. తాత్కాలిక డ్రైవర్లను నియమించి ఆర్టీసీ బస్సుల్ని నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, సమ్మె సమయంలో తిరిగే ఆర్టీసీ బస్సులకు తగిన రక్షణ కల్పించాల్సిందిగా పోలీ స్‌శాఖను కోరాలని ఆదేశించారు. సమ్మె ప్రభావం సామాన్య ప్రయాణీకులకు తెలియకుండా వ్యవహరించాలని చెప్పారు.

**డిమాండ్ బ్యాడ్జీలతో నిరసన**

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ, విధులకు హాజరయ్యారు. బస్‌భవన్ సహా అన్ని డిపోలు, యూనిట్లలో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

**మమ్మల్నీ చర్చలకు పిలవండి : జేఏసీ-1 లేఖ**

సమ్మెనోటీసు ఇచ్చిన తమ సంఘాలను కూడా చర్చల కు ఆహ్వానించాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ-1 డిమాండ్ చేసిం ది. ప్రభుత్వం మూడు సంఘాలతో కూడిన జేఏసీతోనే చర్చలు జరుపుతున్నదని, ఇది సరికాదని జేఏసీ-1 కన్వీనర్ టీ హన్మంతు (తెలంగాణ జాతీయమజ్దూర్ యూనియన్) అన్నారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షులు సోమేష్‌కుమార్‌కు లేఖ రాసారు.

**ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి**

టీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఐదో తేదీ నుంచి సమ్మె వెళ్లే ఆలోచనను కార్మికుల చేత విరమింపజేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనం చేస్తామనీ, ఖాళీలన్నీ భర్తీ చేసి పీఆర్సీ అమలు చేస్తామని హామీనిచ్చి దాటవేయడం సరిగాదన్నారు. టీఆర్ఎస్ ఆర్టీసీని దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని చెప్పిన సీఎం కేసీఆర్..నేడు బకాయిలు చెల్లించకుండా ఆ సంస్థ సంక్షోభంలోకి కూరుకుపోయేలా చేయడం దారుణమని పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో ఇప్పటికే ప్రయవేటు ట్రావెల్స్ వాళ్లు ప్రయాణికుల నుంచి ఇష్టానురీతిగా చార్జీలు వసూలు చేస్తున్నారనీ, ఆర్టీసీ సమ్మెచేస్తే వాటికి అడ్డూఅదుపూ లేకుండా పోతుందని తెలిపారు. ప్రభుత్వం భేషజాలకు పోవద్దని సూచించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించానీ, ప్రజారవాణాకు ఆటంకం కలుగకుండా చూడాలని కోరారు.

**ఆర్టీసీ సమ్మెకు వైద్య,ఆరోగ్య ఉద్యోగుల మద్దతు :యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్**

ఆర్టీసీలో ఉద్యోగ సంఘాలన్నీ తమ 20 డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల ఐదో తేదీ నుంచి జరపబోయే సమ్మెకు మద్దతిస్తున్నట్టు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.యాదానాయక్, కె.బలరాం, ఉపాధ్యక్షులు భూపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయాలని చూడటం దారుణమని పేర్కొన్నారు. ఆర్టీసీలోనే కాదు...రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్యశాఖతోపాటు ప్రభుత్వ శాఖల్లోని లక్షలాది మంది ఉద్యోగులకు కూడా పీఆర్సీని ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు.

# మాట్లాడకుంటే హక్కులొస్తాయా?

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకో లేదని విమర్శించారు. జమ్మూ కాశ్మీర్ పరిస్థితి విషమంగా మారడం పట్ల సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసిందని, అక్కడ పరిస్థితులు సజావుగా మారకుండానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించడం సరికాదన్నారు. అందులోనూ ప్రత్యక్ష ఎన్నికలు కాకుండా, పరోక్ష ఎన్నికల్లో తమ తొత్తుల రక్షణతో ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నట్టు కేంద్ర కమిటీ భావిస్తుందని తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించాలని, అప్పుడే ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

**హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై ఆరున ప్రకటిస్తాం**

తెలంగాణలోని హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు జరుగుతున్నాయని, సాంకేతిక కారణాలతో తమపార్టీ అభ్యర్థి నామినేషన్ చెల్లకుండా పోయిందని తెలిపారు. అయితే సీపీఐ మాత్రం టీఆర్ఎస్‌కి మద్దతు ఇచ్చిందని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని ఆరో తేదీనపార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించి తెలియజేస్తామని తెలిపారు.

**ఏపీ విధానంతో నిర్మాణరంగం సంక్షోభం**

రాష్ట్రంలో ఇసుక విధానంతో నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని రాఘవులు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సభ్యులు అక్కడి పరిస్థితులను కేంద్ర కమిటీ చర్చలో లేవనెత్తారని తెలిపారు. ఏపీలో ఇసుక విధానం కారణంగా భవన నిర్మాణ కార్మికులు అందరూ రోడ్డున పడ్డారని అన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, జన నివాసాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయడం సరైం ది కాదని పేర్కొన్నారు. ఒక పక్క మద్యాన్ని క్రమ క్రమంగా తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు ఈ విధంగా చెయ్యడమేంటని ప్రశ్నించారు. దీనిపై వెంటనే అందరితోనూ మరి ముఖ్యంగా మహిళా సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**హక్కులొస్తాయనుకోవడంలో పసలేదు**

ఏపీ, తెలంగాణల్లో వైసీపీ, టీఆర్ఎస్ మీద బీజేపీ దూకుడుగా విమర్శలు చేస్తుందని, తామే ప్రత్యామ్నాయమంటూ ప్రచారం చేస్తుందని రాఘవులు తెలిపారు. చాపకింద నీరులా ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ శక్తులు మతోన్మాద భావాలు సృష్టించాలని చాలా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయని, అందుకే బీజేపీని ప్రమాదకరంగా భావిస్తున్నామని తెలిపారు. వైసీపీ, టీఆర్ఎస్‌లు బీజేపీ పట్ల కావాల్సినంత కరుకుగా వ్యవహరించడం లేదనేది స్పష్టమన్నారు. జగన్, కేసీఆర్‌లు కేంద్రంపైన ఏమి మాట్లాడకుండా ఉంటే ఏవో హక్కులు వస్తాయనుకుంటున్నారని అన్నారు. కేంద్రం రాష్ట్రాల హక్కుల్ని కాలరాసి, నిధులను కొల్లగొట్టి అన్యాయం చేస్తుంటే, న్యాయం చేస్తారని ఆలోచించడం మంచిది కాదని హితవు పలికారు. దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీని విస్తరిస్తామని బీజేపీ ప్రకటించడం ద్వారా దేశానికి నష్టం జరుగుతుందని, ఏపీ, తెలంగాణకు కూడా ఇబ్బంది కలుగజేస్తుందని విమర్శించారు.

# టీఎస్ఐపాస్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి సోపానం

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఇందులో 8,400లకు పైగా అనుమతులు కార్యరూపం దాల్చాయని వివరించారు. దేశంలో పరిశ్రమల అనుమతులు, వాటిలో ప్రభుత్వాల పాత్ర విషయంలో ఈ చట్టం ద్వారా ఒక విస్తృతమైన చర్చకు తెరలేచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల సమన్వయంతో కలిసి ఒక ఎకనామిక్ విజన్ కోసం పని చేసినప్పుడే దేశ ఆర్థిక ప్రగతి వేగవంతం అవుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర జాబితాలతో పాటూ, ఉమ్మడి జాబితా అంటూ రాజ్యాంగం ప్రత్యేకంగా అధికారాలను ఇచ్చిందని, అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి జాబితాలో ఉన్న అనేక అంశాలకు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాల్సిన సమయం వచ్చిందన్నారు. తమ రాష్ట్రంలో అధికార వికేంద్రీకరణ స్ఫూర్తి బలంగా ఉందని, అందుకే తెలంగాణ ఏర్పడ్డాక ఉన్న పది జిల్లాలను 33 జిల్లాలుగా, అనేక నూతన గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశామని చెప్పారు. పెద్ద ఎత్తున పట్టణీకరణ జరుగుతున్న నేపథ్యంలో పట్టణాల్లో మౌలిక వసతుల సంక్షోభం తలెత్తుతుందని, ఇలాంటి సమస్యలు పరిష్కారానికి అవవసరమైన ఆలోచనలకు కొరత లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ వల్ల స్వేచ్ఛగా రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టలేకపోతున్నాయని, ఈ విషయంలో కేంద్రం ఒక సహాయకారిగా నిలవాలని కాంక్షించారు. కేంద్రీకరణ పారిశ్రామిక అభివద్ధికి దోహదపడదని ఆయన చెప్పుకొచ్చారు.

# జడ్చర్లలో భారీ వర్షం

నవతెలంగాణ-జడ్చర్ల

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. మార్కెట్ యార్డులో విక్రయించేందుకు లింగంపేట, బూర్గుపల్లి, పర్వతాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు తీసుకొచ్చిన వరి, మొక్కజొన్న, ఆముదం తడిసి ముద్దయింది. టార్పాలిన్‌లు కప్పినప్పటికీ పెద్ద వర్షం కురవడంతో ధాన్యమంతా పనికి రాకుండా పోయిందని రైతులు వాపోయారు. హైదరాబాద్ నగరంలోనూ మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఒక్కసారిగా జోరుగా వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో అత్యధికంగా 4.4 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా అల్వాల్‌లో 1 సెం.మీ వర్షం కురిసింది. ట్యాంక్‌బండ్, బుద్ధ భవన్, సికింద్రాబాద్, ముషీరాబాద్, శివం రోడ్డు, మలక్‌పేట్, సంతోష్‌నగర్, కర్మన్‌ఘాట్, నాగోల్, కర్మన్‌ఘాట్, బీఎన్ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.



# ఒత్తిడి భరించలేక తహసీల్దార్ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో భార్య, పిల్లలు వచ్చి వెళ్తున్నారు. పెద్దకొడుకు వివాహం, చిన్నకొడును అమెరికా పంపడంపై ఇటీవల కుటుంబంలో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో గిరిరావు తన భార్యతో వీడియో కాల్ మాట్లాడారు. గురువారం ఉదయం 8:30 గంటలకు ఇంటి పని మనిషి తలుపులు ఎంత కొట్టినా స్పందన రాలేదు. దీంతో స్థానికులు, రెవెన్యూ ఉద్యోగుల సాయంతో తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతున్న గిరిరావు(56) కనిపించాడు. ఘటనా స్థలానికి కలెక్టర్ రామ్మోహన్‌రావు, జేసీ వెంకటేశ్వర్లు సహా రెవెన్యూ ఉద్యోగులు చేరుకున్నారు. ఎన్నికల విధుల కోసం వచ్చిన గిరిరావును ఆ ప్రక్రియ పూర్తయినా బదిలీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మానసికంగా వేధించిందని ఆరోపిస్తూ రెవెన్యూ ఉద్యోగులు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌ది ఆత్మహత్య కాదనీ, ప్రభుత్వ నిర్లక్ష్యపు హత్య అనీ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. ఎన్నికల బదిలీపై వచ్చిన తహసీల్దార్ తాను తిరిగి హైదరాబాద్ బదిలీ కోరుకున్నా.. ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.

**ఎంత టెన్షన్ పెట్టారో : మృతుడి భార్య**

'ఎంత టెన్షన్‌లో పెట్టారో అందుకే ఇలా అయింది' అంటూ మృతుడి భార్య విలపించింది. ఆత్మహత్య సమాచారం అందిన వెంటనే గిరిరావు భార్య నిజామాబాద్‌కు తరలివచ్చారు. ఆమె వచ్చేసరికి ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 20 రోజుల్లో బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ చేయలేదనీ, రాష్ట్ర ప్రభుత్వం, సీఎం ఏం చేస్తున్నారనీ ఆమె ప్రశ్నించారు. తమ కుటుంబానికి తీరని అన్యాయం చేశారంటూ ఆమె కన్నీమున్నీరైంది.

**తహసీల్దార్ ఆత్మహత్య బాధాకరం : డిప్యూటీ కలెక్టర్ల సంఘం**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా రూరల్ తహసీల్దార్ జ్వాలా గిరిరావు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమనీ, అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతికి తెలుపుతున్నామని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, రమేష్ రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడ కలచివేస్తున్నదని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తహసీల్దార్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో జిల్లాలకు బదిలీ చేసిన వారిని తక్షణమే వారి సొంత జిల్లాలకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

# ఖజానాకుకిక్కు

(మొదటిపేజీ తరువాయి)

కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించి ఎక్సయిజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం విధానం అమలుల్లోకి రానున్నది. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం శ్లాబ్ ధరలను పెంచింది. ప్రస్తుతమున్న నాలుగు శ్లాబులను ఆరు శ్లాబులుగా మార్చింది. ఇప్పటి వరకు జనాభా ఆధారంగా శ్లాబు రేట్లు 45లక్షల నుంచి రూ.55 లక్షల వరకు ఉండగా, దీన్ని రూ.50లక్షల నుంచి రూ.1.10 కోట్లకు పెంచింది. మద్యం షాపు దరఖాస్తు రుసుమును కూడా రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు పెంచింది. వీటివల్ల సర్కారుకు సుమారు రూ. 2వేల కోట్ల ఆదాయం సమకూరనుందని అధికారవర్గాల అంచనా.

**జనాభా ప్రాతిపదికన శ్లాబు రేట్లు :** ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన శ్లాబు ధరలను నిర్ణయించింది. ఐదువేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 50 లక్షలు, ఐదువేల ఒకటి నుంచి 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో 60లక్షలు, లక్ష జనాభా నుంచి 5 లక్షల లోపు ఉన్న ప్రాంతాలకు రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.1.10 కోట్లుగా స్లాబ్ ధరలుగా నిర్ణయించింది.

**దరఖాస్తు ఫీజునూ.. :** మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజును రూ. లక్ష నుంచి రూ.2 లక్షలకు ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,216 మద్యం షాపులు ఉన్నాయి. లాటరీ పద్ధతిన దుకాణదారులను ఎంపిక చేయనుంది. సదరు వ్యక్తి ఒక వేళ డ్రాలో గెలుపొందక పోతే దరఖాస్తు రూపేణా చెల్లించిన రూ. 2 లక్షలను ప్రభుత్వం తిరిగి ఇవ్వదు. మరోవైపు మద్యం షాపుల సమయాల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర పట్టణాలు, మున్సిపాల్టీల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలకు అనుమతిచ్చింది. మద్యం, బార్ షాపుల సమయాన్ని కుదించాలంటూ వస్తున్న విజ్ఞప్తులను సర్కారు ఖాతరు చేయలేదు.

**నీరాలేనట్టే :** నూతన మద్యం విధానంలో 'నీరా' అమ్మకాల ప్రస్తావనే లేదు. నూతన మద్యం పాలసీలో నీరా అమ్మకాలను అనుమతిస్తామని ఇటీవల ఎక్సయిజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. కానీ ఆయన హామీ నెరవేరలేదు. దీంతో మరో రెండేండ్ల వరకు 'నీరా'పై నిరాశే మిగలనుంది.

# గురుకులాల అధ్యయనానికి రానున్న హార్వర్డ్ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గురుకులాల్లో పేదవిద్యార్థుల ఎదుగుదలకు ఎలాంటి నైపుణ్యాలతో విద్య అందిస్తున్నారో తెలుసుకోవడానికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హార్వర్డ్ యూనివర్సిటీ బృందం రానున్నట్టు గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గురుకుల విద్యార్థులకు ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తు న్నారన్న విషయాలపై అధ్యయనం (కేస్ స్టడీ) చేసేందుకు వస్తున్నట్టు హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పెర్నాండో రీమర్స్ మెయిల్ ద్వారా సమాచారం అందించినట్టు తెలిపారు.

# దాగుడుమూతలు

(మొదటిపేజీ తరువాయి)

మూడేండ్ల క్రితమే కేంద్రానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసింది. ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించటానికి కేంద్రం ఒక టాస్క్ ఫోర్స్ నియమించగా టాస్క్ ఫోర్స్ కూడా దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేదు. టాస్క్ ఫోర్స్ సమావేశానికి గతంలో హాజరైన రాష్ట్ర పరిశ్రమల మంత్రి కేటీఆర్ కొన్ని ప్రతిపాదనలు చేసినప్పటికీ కేంద్రం ఇప్పటి వరకూ స్పందించలేదు.

బయ్యారం ఉక్కు కర్మాగారానికి అవసరమైన ఇనుప ఖనిజం లభ్యం కాకపోతే ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా నుంచి ఖనిజాన్ని తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు. ఇనుప ఖనిజం తరలించటానికి దాదాపు 200 కిలోమీటర్ల దూరం రైలు మార్గాన్ని నిర్మిస్తే సరిపోతుం దని ఆయన ప్రతిపాదించారు. దీనిపై కేంద్రం నుంచి ఎటువంటి సానుకూల ప్రకటన ఇప్పటి వరకూ రాలేదు.

**ఆశలపై నీళ్లు చల్లిన కేంద్ర మంత్రి....**

ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉక్కు కర్మాగారాన్ని నేరుగా కేంద్రం నెలకొల్పే అవకాశం లేదని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కర్మాగారం ప్రారంభించాలనుకుంటే కేంద్రం పరోక్ష సహకారం అందిస్తుందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని మాత్రమే పునర్విభజన చట్టంలో పేర్కొన్నారని, స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. కేంద్ర మంత్రి ఈ ప్రకటన చేసిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించలేదు.

**కాళేశ్వరం జాతీయ హోదాపైనా...**

ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా గురించి కేంద్రంతో మాట్లాడతారంటూ టీఆర్ఎస్ పార్టీ చెప్తూ వచ్చింది. అయితే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ప్రతిపాదనలూ అందలేదని కేంద్రం ఇటీవల పునరుద్ఘాటించింది. రాష్ట్ర పునర్విభజన సందర్భంలో ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చి దీని నిర్మాణానికి అయ్యే ఖర్చంతా కేంద్రమే భరించాలని నిర్ణయించారు. పునర్విభజన చట్టంలో కూడా దీనిని పొందుపరచారు. అదే సందర్భంలో తెలంగాణలోని ఏదో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటూ టీఆర్ఎస్ నేతలు కోరారు. ఇది కేవలం ప్రకటనగా మిగిలిపోయిందే తప్ప కేంద్రానికి ఎటువంటి ప్రతిపాదనలనూ నీటి పారుదల శాఖ ప్రత్యేకంగా పంపలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రికి లేఖ రాశారని టీఆర్ఎస్ నేతలు అంటున్నారు. లేఖ రాసి చేతులు దులుపుకుంటే సరిపోదని, కేంద్రంతో పోరాడి దీనిని సాధించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కాళేశ్వరం జాతీయ హోదా వ్యవహారాన్ని కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం చేశారనే విమర్శలను అధికార పార్టీ ఎదుర్కొంటున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు, బ్యాంకుల నుంచి రుణాల సేకరణతో ఈ ప్రాజెక్టు పనులను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టును కేంద్రం చేతిలో పెడితే ఇక్కడ కాంట్రాక్టు పనులపై తమకు పూర్తి అధికారం ఉండదనే కారణంతోనే జాతీయ హోదా గురించి కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి చేయటం లేదనే విమర్శలు కూడా పెల్లుబికాయి. కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటున్న బీజేపీ నేతలు..విచారణకు మాత్రం కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదు. ప్రకటనలకే పరిమితమయ్యారు. జాతీయహోదా గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదు.

**యురేనియం చిక్కుముడి వీడేనా...**

నల్లమల అడవులకు, అక్కడ నివసించే చెంచులకు, పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతుందని భావిస్తున్న యురేనియం తవ్వకాల విషయంలో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని ఇటీవల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలతో పాటూ నల్లమల ప్రాంత ప్రజలు ఆందోళన బాట పట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. ఈ తీర్మానం తమకు అందిందో లేదో కేంద్రం ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటన చేయలేదు. యురేనియం వ్యవహారంలో తాము ముందుకే పోతామని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఇటీవల ప్రకటించారు. యురేనియం తవ్వకాల కోసం రాష్ట్ర వన్యప్రాణి బోర్డు సహా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ఇప్పటి వరకూ ఉపసంహరించుకోక పోవటంపై పర్యావరణ వాదులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యురేనియం తవ్వకాలు ఆపాలంటే కేంద్రంపై పూర్తి స్థాయి పోరాటం చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

ప్రధాన మంత్రి వద్దకు అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని కూడా తీసుకువెళ్లాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. దీనిపై సీఎం కేసీఆర్ ఇప్పటి వరకూ నోరు మెదపలేదు. యురేనియం అంశంపై సీఎం ప్రధాన మంత్రి నుంచి స్పష్టమైన హామీ తీసుకుంటారా లేదా అని అందరూ ఎదురు చూస్తున్నారు.

## నేడు మోడీతో కేసీఆర్ భేటీ

● ప్రధాని అపాయిట్‌మెంట్‌లలో స్వల్ప మార్పులు

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్, శుక్రవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. లోక్‌కళ్యాణ్‌మార్గ్‌లోని ప్రధాని అధికారిక నివాసంలో ఈ సమావేశం సాగనుంది. అయితే ముందుగా అనుకున్న సమయంలో మార్పు జరిగింది. ఉదయం 11:30 గంటలకు జరగాల్సిన ఈ భేటీ సాయంత్రం 4:30 గంటలకు మారింది. సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రమే ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకున్నారు. ఆయన వెంట ఎంపీలు కేకే, నామా నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు రాజీవ్‌శర్మ, తదితరులు ఉన్నారు. మోడీతో జరిగే సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది.

**రేపు ప్రధాని ఏపీ సీఎం జగన్..**

ఏపీ సీఎం జగన్ సైతం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. శనివారం మధ్యాహ్నం ప్రధాని మోడీ, జగన్‌ల భేటీకి అపాయింట్‌మెంట్ ఖరారైనట్టు ఏపీ సీఎంఓ అధికారవర్గాలు తెలిపాయి. శనివారం ఉదయం 11:30 గంటలకు జగన్ ఢిల్లీ చేరుకుంటారు. ప్రధానితో భేటీ అనంతరం తిరిగి జగన్ ఏపీకి వెళ్లనున్నారు.

## ఈఎస్ఐ డైరెక్టర్‌గా అహ్మద్ నదీమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈఎస్ఐ డైరెక్టర్‌గా అహ్మద్ నదీమ్‌ను నియమిస్తున్నట్టు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నదీమ్ ప్రస్తుతం లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈఎస్ఐలో మందుల కొనుగోళ్ల కేసులో నిందితురాలిగా ఉన్న మాజీ డైరెక్టర్ దేవికారాణి రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే. కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో ఈ పోస్టు కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో అహ్మద్ నదీమ్‌ను డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## తీగలాగితే..

(మొదటిపేజీ తరువాయి)

చూసింది. దాదాపు 20 కోట్ల రూపాయలకు పైగా మందులను కొనుగోలు చేసినట్టుగా లెక్కలు చూపించి అందులో భారీ మొత్తంలో వాటాలు పంచుకున్నారని ఏసీబీ వర్గాలను బట్టి తెలుస్తోంది. ఈ విషయమై తాజాగా కొన్ని ఆధారాలు లభించడం, మరి కొంత లోతుగా విశ్లేషించగా.. ఈ కోణంలోనూ ఏసీబీ దర్యాప్తును ముమ్మరం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు మరిన్న వాస్తవాలు వెలుగులోకి తేవడానికి ఏసీబీకి చెందిన మరో టీమ్‌ను డీజీ పూర్ణచంద్రరావు రంగంలోకి దింపారు. దీనికి సంబంధించి గురువారం తమ అధికారులతో ఆయన సమావేశమై సమగ్రంగా చర్చించినట్టు తెలిసింది . ఇదంతా ఒక ఎత్తు అయితే ఈఎస్ఐ ఆస్పత్రి ద్వారా కార్మికులకు అందించే వైద్య బీమాల్లోనూ ప్రస్తుతం పట్టుబడ్డ నిందితులు అవినీతికి పాల్పడినట్టు ఏసీబీకి ఆధారాలు లభించినట్టు సమాచారం. తమ వద్ద వైద్య సౌకర్యాలు ఉన్నప్పటికీ అవి అందుబాటులో లేవని చెప్పడం, సదరు రోగులను తాము ఎంపిక చేసుకున్న ప్రయివేటు ఆస్పత్రులకు తరలించి వైద్య బీమా సొమ్ము వారికి చెందేలా చూడటం, తద్వారా కమీషన్‌లను దండు కున్నట్టు ఏసీబీ దర్యాప్తులో వెలుగు చూసినట్టు తెలిసింది. వీటన్నింటిని క్రోడీకరించుకుని ఈఎస్ఐ ఐఎంఎస్ తో పాటు కొత్తగా బయటపడ్డ అవినీతి కలిపి జరిగిన కుంభకోణం రెండు వదల కోట్ల రూపాయలకు పైనే ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారని తెలిసింది. ఇదే సమయంలో కేసులో తేలిన నిందితుల ఆస్తులు, ఇండ్లు, కార్యాలయాలపై తమ సోదాల పరంపరను ఏసీబీ అధికారులు కొనసాగిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ మేరకు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఆరెస్పీ, సీపీఐఎంఎల్, ఎంసీపీఐ(యూ) గురువారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ఆర్టీసీలో సమ్మెను నివారించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించిందని తెలిపాయి. ఈ కమిటీ అనేక దఫాలుగా కార్మిక సంఘాలతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని పేర్కొన్నాయి. ఆర్టీసీ ప్రయివేటీకరణ, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల హక్కులు వంటి డిమాండ్లతో కార్మిక సంఘాలు ప్రభుత్వం ముందుంచిన కోర్కెలు న్యాయమైనవని తెలిపాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని పేర్కొన్నాయి. కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయినందునే సమ్మె యథాతథంగా ఉంటుందని కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించిందని తెలిపాయి. అందువల్ల ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా ప్రజలు, కార్మికుల ప్రయోజనకారిగా ఉండే డిమాండ్లను తక్షణమే పరిశీలించి వాటి పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశాయి. ఆర్టీసీ బస్సులపైనే సామాన్య ప్రజలు ఆధారపడుతున్నందున సమస్య జఠిలం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపాయి. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమ్మె నివారణకు సకల ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశాయి.

## ఉపాధి చూపే కోర్సులతోనే భవిత

(మొదటిపేజీ తరువాయి)



వీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థుల పరిశోధనా పత్రాలకు డేటాబ్యాంక్ ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. చాన్సలర్ హోదాలో హాజరవుతానని చెప్పారు. సమాజంలో వస్తున్న పరిస్థితులకు అనుగుణంగా విశ్వవిద్యాలయాల పనితీరు ఉండాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, గ్రామాలను దత్తత తీసుకోవాలని సూచించారు. హరితహారం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో ఉండే ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు సమగ్రంగా ఉండాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. హాస్టల్ వసతులను మెరుగుపర్చాలన్నారు. ఆహ్లాదంగా నేర్చుకునే వాతావరణం కల్పించాలని సూచించారు. సంతోషంగా చదివేలా చైతన్యపరచాలన్నారు. గ్రంథాలయాలను బలోపేతం చేయాలని, డిజిటల్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా అధ్యాపకులు ఆకట్టుకునేలా బోధించాలని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాజంలో మార్పులకు అనుగుణంగా బోధనా సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలని కోరారు. మహిళా సాధికారత, ఉన్నత విద్యకు అమ్మాయిలు ఎక్కువ మంది వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కర్రికులమ్‌లో యోగాను చేర్చాలన్నారు. యోగా, ధ్యానం చేయాలని చెప్పారు. ఉన్న వనరులతోనే విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. పూర్వ విద్యార్థులతో ఉన్న అల్యూమ్నీని భాగస్వామ్యం చేయాలని సూచించారు. అధ్యాపకులకు అకడమిక్ సోషల్ రెస్పాన్సబులిటీ (ఏఎస్ఆర్) ఉండాలన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని చదువు అందించాలని కోరారు. మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి బి జనార్ధన్‌రెడ్డి, కాలేజీయేట్ ఎడ్యుకేషన్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లు ఆర్ లిం బాద్రి, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, వీసీలు అర్వింద్ కుమార్, పార్థసారథి, అనిల్‌కుమార్, రాహుల్‌బొజ్జా, చిరంజీవులు, సందీప్ సుల్తా నియా, అశోక్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, కవితా దర్యానీరావు, జేఎన్టీయూహెచ్ రెక్టార్ కె గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్‌మిట్టల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 841 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలి పారు. 2019, ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలు విడుదల చేశామని పేర్కొన్నారు. వారి జీతాల కోసం రూ. 20.32 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులకు కాలేజీల ప్రిన్సిపాల్స్ జీతాలు చెల్లించాలని ఆదేశించారు. జీతాలు విడుదల చేయడం పట్ల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు.

| సెన్సెక్స్ ▼198 | నిఫ్టీ ▼ 45 | డాలరుకు రూపాయి విలువ | బంగారం(10.గ్రా) | వెండి (కేజీ) |
| --- | --- | --- | --- | --- |
| 38,106 | 11, 314 | 70.87 | రూ. 39,110 | రూ. 45,750 |

కోడిగుడ్లు (వందకి)

| | | | |
| --- | --- | --- | --- |
| హైదరాబాద్ | 335 | విజయవాడ | 347 |
| ఒక్కగుడ్డుకు | 4.00 | చెన్నై | 375 |
| వరంగల్ | 338 | ముంబయి | 385 |




## మార్కెట్లోకి హ్యుందాయ్ కొత్త 'ఎలంట్రా'



**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాకు చెందిన కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ భారత మార్కెట్లోకి సరికొత్త సెడాన్ కారు ఎలెంట్రాను విడుదల చేసింది. దీని ధరను కంపెనీ రూ.15.89 లక్షల నుంచి రూ.20.39 లక్షలుగా నిర్ణయించింది. ఈ కారును బ్లూలింక్ కనెక్టెడ్ కార్ టెక్నాలజీని వినియోగించి రూపొందించారు. సరికొత్త ఎలంట్రా బీఎస్-6 పెట్రోల్ ఇంజిన్‌తో లభిస్తుంది. ఈ కారు ఎస్, ఎస్ఎక్స్, ఎస్ఎక్స్ ఏటీ, ఎస్ఎక్స్(ఓ)ఏటీ వేరియంట్లతో రానుంది. ఎలంట్రా కొత్త వెర్షన్‌లో అవుట్‌లుక్‌లో భారీ మార్పులు చేశారు. హెడ్‌ల్యాంప్స్, బంపరు, ఫాగ్ ల్యాంప్స్‌లో మార్పులు చేశారు. ఈ కారు మొత్తం ఐదు రంగుల్లో లభిస్తుంది. వైర్‌లెస్ ఛార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్‌సీట్స్, ఇన్ఫినిటీ సౌండ్ సిస్టమ్, డోర్ స్పీకర్స్, సెంటర్ స్పీకర్స్, ట్వీటర్స్, యాప్లిఫైర్, సబ్ ఊఫర్, క్రూజ్ కంట్రోల్, డ్యూయల్ జోన్ ఎఫ్ఏటీసీ, క్లస్టర్ ఐనెజర్, రియర్ ఏసీ, ఎలక్ట్రిక్‌సన్ రూఫ్, అల్యూమినియం పెడల్స్ వంటివి ఈ కారులో కొత్త ఫీచర్లుగా ఉన్నాయి. ఏబీఎస్, ఈబీడీ , ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, రియర్‌పార్కింగ్ సెన్సర్, హిల్ అసిస్టెంట్ కంట్రోల్, వెహికల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్ వంటివి సేఫ్టీ ఫీచర్లు కూడా ఇందులో అమర్చారు.

## దారుణంగా పురుష-స్త్రీ ఉద్యోగ నిష్పత్తి!



**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రధాన కంపెనీల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య దారుణంగా ఉన్నట్టుగా ఒక నివేదికలో వెల్లడైంది. భారత్‌లోని ప్రధాన కంపెనీల్లోని 53 సంస్థల్లో పురుష- స్త్రీ ఉద్యోగుల నిష్పత్తి 10:1 శాతం లేదా అంతకంటే తక్కువగానే ఉన్నట్టుగా కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ వాచ్ (సీఆర్‌డబ్ల్యు) నివేదికలో వెల్లడైంది. ప్రధాన కంపెనీల్లో దాదాపు 70 శాతం కంపెనీల్లో దివ్యాంగులైన ఉద్యోగుల సంఖ్య ఒక శాతం కంటే కూడా తక్కువగా ఉన్నట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. దేశంలోని 300 ప్రధాన కంపెనీలలో కేవలం 39 సంస్థలు మాత్రమే తమతమ కంపెనీల్లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, వోబీసీల వివరాలను వెల్లడించేందుకు ముందుకు వచ్చినట్టుగా ఈ నివేదిక వివరించింది. మొత్తం కంపెనీలలో కేవలం 103 కంపెనీలు మాత్రమే మహిళా ఉద్యోగుల తగ్గింపునకు సంబంధించిన వివరాలను బయటకు వెల్లడించగా.. మిగతా కంపెనీలు ఇందుకు నిరాసక్తతను కనబరిచాయి. మొత్తం దేశంలో వివిధ కంపెనీలు అందిస్తున్న కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం నిధుల్లో అత్యధికం అంటే దాదాపు రూ.2,482.75 కోట్లు మహారాష్ట్రకుఅందినట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాలకు కేవలం రూ.29.9 కోట్లు మాత్రమే సీఎస్ఆర్ గ్రాంట్ల కింద నిధులు అందినట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ వెల్లడించిన నివేదిక ప్రకారం 2014-15 ఆర్థిక సంవత్సరానికి గాను 16,785 కంపెనీలు కేవలం రూ.10,065 కోట్ల మేర నిధులను మాత్రమే సీఎస్ఆర్ కార్యక్రమాలకు కేటాయించినట్టుగా తెలిపారు. దేశంలోని కంపెనీలు దాదాపు రూ.23,247.90 కోట్ల మేర నిధులను సీఎస్ఆర్ కింద ఖర్చు చేయాల్సి ఉండగా సంస్థలు ఇందులో కేవలం 57 శాతం నిధులను మాత్రమే వెచ్చించినట్టుగాతీ నివేదిక తెలిపింది.

# అదానీకి మోడీ మెహర్బానీ!

- అదానీ గ్రూపు సంస్థల కోసం నిబంధనల సడలింపు
- వాయు కాలుష్య ప్రమాణాల పెంపునకు సూత్రప్రాయ ఆమోదం
- మిగతా ప్లాంట్లు పాటిస్తున్నా..అస్మదీయుడి కోసం వెసులుబాటా!


(ఫైల్)

**న్యూఢిల్లీ :** వడ్డించేవాడు మనోడైతే.. ఏ వరుసలో కూర్చుంటేనేమీ అనే తీరులో ఉన్నది అదానీ థర్మల్ పవర్‌ప్లాంట్‌ల కోసం మోడీ సర్కారు నిబంధనలు సడలించిన వ్యవహారం. దేశంలో కాలుష్య ప్రమాణాలను నిర్దేశించే అత్యున్నత సంస్థ సెంట్రల్ పొల్యుషన్ కంట్రోల్ బోర్డు(సీపీసీబీ) పరిశీలించిన ఏడు థర్మల్ పవర్ ప్లాంట్‌లలో అదానీకి చెందిన రెండు యూనిట్లు మాత్రమే నిర్దేశిత ప్రమాణాలను మించి వాయు కాలుష్యాలను విడుదల చేస్తున్నాయి. దీంతో మోడీ సర్కారు వాయు కాలుష్య ప్రమాణాలనే మరింత పెంచేందుకు సూత్రప్రాయ ఆమోదాన్ని తెలిపింది. వాయు కాలుష్య ప్రమాణాలను పెంచడం సరికాదనీ.. థర్మల్ పవర్ ప్లాంట్లు నిర్దేశించిన ప్రమాణాలను సులువుగా పాటించవచ్చని సీపీసీబీ చివరి వరకూ వాదించినా.. ఫలితం లేకపోయింది. అదానీ థర్మల్ పవర్‌ప్లాంట్‌లకు అనుగుణంగా అంటే వాయు కాలుష్య ప్రమాణాలను 300 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్ నుంచి 450కి పెంచేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రితేశ్ కుమార్ సింగ్ 2019 మే 17న సూత్రప్రాయ ఆమోదం తెలిపారు. వాయు కాలుష్య ప్రమాణాలను 450 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్‌లకు పెంచాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నది. దీన్ని సీపీసీబీ వ్యతిరేకిస్తూ వస్తున్నది. అయినప్పటికీ సీపీసీబీ నిర్ణయాన్ని తోసిపుచ్చి వాయు కాలుష్య ప్రమాణాలను పెంచేందుకే కేంద్రం మొగ్గుచూపడం గమనార్హం. సీపీసీబీ, విద్యుత్ శాఖకు చెందిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ)లు కాలుష్య ప్రమాణాలపై విభేదిస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని థర్మల్ పవర్ ప్లాంట్‌లను ఎంపిక చేసి పరిశీలించిన తర్వాతే కాలుష్య ప్రమాణాల పెంపుపై ఒక అభిప్రాయానికి వచ్చేందుకు సీపీసీబీ, సీఈఏ నిర్ణయించుకున్నాయి. 2019 ఫిబ్రవరి 13 నుంచి 2019 ఏప్రిల్ 2 వరకు రాజస్థాన్‌లో కవాయిలోని అదానీ పవర్ రాజస్థాన్ లిమిటెడ్, నాగపూర్‌లోని ఎన్‌టీపీసీ మౌదా సూపర్ టీపీఎస్, హర్యానాలో జాజ్జర్‌లోని మహాత్మా గాంధీ టీపీఎస్, పంజాబ్‌లో రాజ్‌పురాలోని నభా పవర్ లిమిటెడ్‌ల కాలుష్య ఉద్గారాలను పరిశీలించాయి. దీనికి సంబంధించిన నివేదికను సమావేశానికి ముందే పర్యావరణ, విద్యుత్ మంత్రిత్వ శాఖలకు సీపీసీబీ 2019 మే 2న పంపించింది. ఈ రిపోర్టు ప్రకారం.. పరిశీలించిన ఏడు ప్లాంట్‌లలో కేవలం అదానీకి చెందిన రెండు పవర్ ప్లాంట్‌లలో మాత్రమే నిబంధనలకు మించి నైట్రోజన్ ఆక్సైడ్‌ను 509 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్, 584 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్ ఉద్గారిస్తున్నాయి. ఇది నిర్దేశిత 300 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్ కంటే చాలా అధికం. కాగా, మిగితా మూడు ప్లాంట్‌లకు చెందిన ఐదు యూనిట్లలో ఈ ఉద్గారాలు 200 నుంచి 300 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్‌లలోపే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కాలుష్య ప్రమాణాల పెంపునకు కేంద్రం సూత్రప్రాయ అనుమతినివ్వడం గమనార్హం. శ్వాస వ్యవస్థలో సమస్యలు, ఊపిరితిత్తులకు తీవ్ర నష్ట కలిగించే నైట్రోజన్ ఆక్సైడ్ వాయువులు మన దేశంలో వాహనాల తర్వాత అత్యధికంగా థర్మల్ పవర్ ప్లాంట్‌ల నుంచే విడుదల అవుతున్నాయి. కాగా, పర్యావరణహితం, ప్రజల ఆరోగ్యాల కంటే అదానీ థర్మల్ పవర్ ప్లాంట్‌లే మోడీ సర్కారు ప్రధానమయ్యాయా? అని పలువురు కార్యకర్తలు ఆగ్రహిస్తున్నారు.

**సీపీసీబీ సలహాలతోనే ప్రమాణాల ఖరారు.. కానీ..**

కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సీపీసీబీ శాస్త్రవేత్తల సలహాలతోనే అనేక శాఖల కోసం పర్యావరణ ప్రమాణాలను నిర్ధారిస్తుంటుంది. వీరితోపాటు పరిశ్రమల నిపుణులతో సుదీర్ఘ చర్చలు జరిపి 2015 డిసెంబర్‌లో ప్రస్తుతమున్న ప్రమాణాలను కేంద్రం నిర్దేశించింది. దీని ప్రకారం.. 2003 నుంచి 2016 మధ్యకాలంలో ప్రారంభమైన థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లు నైట్రోజన్ ఆక్సైడ్‌ను 300 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్‌లకు మించి విడుదల చేయరాదు. తాజాగా కేంద్ర విద్యుత్ శాఖ వీటిపై అభ్యంతరాలు లేవనెత్తగా.. సీపీసీబీ తిరస్కరించింది. కాగా, సీపీసీబీ శాస్త్రవేత్తల సలహాలతో నిర్దేశించిన ఈ ప్రమాణాలను కేంద్ర విద్యుత్ శాఖ అభ్యంతరాల మేరకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సడలించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, 2017 తర్వాత ప్రారంభమైన విద్యుత్ ప్లాంట్లు నైట్రోజన్ ఆక్సైడ్ విడుదల చేసే పరిమితి 450 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్‌లకు పెంచాలని కేంద్ర విద్యుత్ శాఖ డిమాండ్ చేయడం గమనార్హం.

### నిబంధనల అనుసరణకు ఇచ్చే గడువు పొడిగింపు

అదానీ పవర్ స్పందిస్తూ.. తమ పవర్ ప్లాంట్‌లు ప్రస్తుతమున్న అన్ని నిబంధనలను పాటిస్తున్నాయని వివరించింది. ప్రస్తుతం నైట్రోజ్ ఆక్సైడ్‌కు సంబంధించి ఎలాంటి నిబంధనల్లేవని తెలిపింది. సీపీసీబీ మార్గదర్శకాల ప్రకారం.. అదానీ పవర్ రాజస్థాన్ లిమిటెడ్.. నైట్రోజన్ ఆక్సైడ్‌కు సంబంధించిన నిబంధనలను 2022లోపు పాటించాల్సి ఉందని వివరించింది. కాగా, అదానీ పవర్ రాజస్థాన్ లిమిటెడ్‌కు చెందిన రెండు యూనిట్లు.. 2019 ఆగస్టులో గరిష్టంగా 685.45 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్, 616.73 ఎంజీ/నార్మల్ క్యూబిక్ మీటర్‌ల నైట్రోజన్ ఆక్సైడ్ విడుదల చేస్తున్నాయి. 2015 డిసెంబర్‌లో కాలుష్య ప్రమాణాలను నిర్దేశించినాక రెండేండ్లలో అంటే 2017 డిసెంబర్‌లోపు కొత్త నిబంధనలను దేశంలోని అన్ని థర్మల్ విద్యుత్ ప్లాంట్లు అనుసరించాల్సి ఉంటుందని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అనంతరం 2017 సెప్టెంబర్‌లో జరిగిన ఓ సమావేశంలో 2018 నుంచి అమలు చేయాలని నిర్దేశించింది. చివరికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, సీఈఏ ఒత్తిళ్లతో వీటి అమలును 2017 నుంచి 2022 వరకు పొడిగించడం గమనార్హం. ఇదంతా అదానీ థర్మల్ పవర్ ప్లాంట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర సర్కారు వైఖరిని నిరూపిస్తున్నాయని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఐఆర్‌సీటీసీ ఐపీవోకు అద్భుత స్పందన

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్‌సీటీసీ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఇష్యూ గడువు ముగిసే సమయానికి ఈ ఐపీవోకు మొత్తంగా 111.92 రెట్ల స్పందన లభించింది. రూ.645 కోట్ల మేర నిధుల సమీకరణ కోసం ఐపీవోకు వచ్చిన ఐఆర్‌సీటీసీ సంస్థ 2,01,60,000 షేర్లను పబ్లిక్ ఇష్యూకు అందుబాటులో ఉంచగా.. మార్కెట్ వర్గాల నుంచి 2,25,63,63,400 మేర బిడ్లు లభించాయి. రూ.315-210 ధరల శ్రేణితో ఐఆర్‌సీటీసీ సంస్థ పబ్లిక్ ఇష్యూకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఇష్యూలో అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులు (క్విబ్) కోటాకు 108.8 రెట్ల స్పందన లభించింది. మరోవైపు సంస్థాగతేతర పెట్టుబడిదారుల (ఎన్ఐఐ) కోటాకు అత్యధికంగా 354 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటాకు 14 రెట్ల స్పందన లభించింది. గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలను పోల్చి చూస్తే అత్యంత మార్కెట్ ఆదరణ లభించిన ప్రభుత్వ రంగ పబ్లిక్ ఇష్యూగా ఐఆర్‌సీటీసీ ఐపీవో నిలిచినట్టుగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మంచి ఆర్థిక పటిష్టత ఉన్న సంస్థ కావడం.. అందుబాటు ధరల్లో ఐపీవోతో మార్కెట్లోకి రావడంతోనే ఐఆర్‌సీటీసీ సంస్థ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్లో మంచి స్పందన లభించిందని ట్రేడింగ్ వర్గాలు చెబుతున్నాయి.

## ప్రజల వద్దకే బ్యాంక్ ఆఫ్ ఇండియా

**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** పండుగల సీజన్ నేపథ్యంలో సమాజంలోని వివిధ రకాల వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసేందుకుగాను ఇండియన్ బ్యాంక్ గురువారం నుంచి 'కస్టమర్ అవుట్‌రీచ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో బ్యాంక్ వర్గాలు సామాన్య ప్రజలకు, ఇప్పటికే బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్న వారికి ఇండియన్ బ్యాంక్ అందిస్తోన్న వివిధ రకాల సేవలను గురించి వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన వినియోగదారులకు వ్యవసాయ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు, పెన్షన్ రుణాలు, విద్యారుణాలు, వ్యాపార రుణాలను అందజేయనున్నారు.

## సాహితీ పురస్కారాలకు సూచనలివ్వండి

- 30వ తేదీలోపు పంపాలి :తెలుగు విశ్వవిద్యాలయం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సాహితీ పురస్కారాల ఎంపికకు వివిధ వర్గాల నుంచి సూచనలు కోరుతూ తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనల్ని ప్రోత్సహించడానికి తెలుగు విశ్వవిద్యాలయం ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్నదని తెలిపారు. వివిధ ప్రక్రియల్లో 2015, జనవరి నుంచి 2017, డిసెంబర్ మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన గ్రంథాలను అవార్డులకు సూచించవచ్చని పేర్కొన్నారు. వచన, కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే పది ప్రక్రియల్లో గానీ, కొన్నింటికి గానీ, తమకు నచ్చిన గ్రంథాలను గానీ పురస్కారాలకు సూచించవచ్చని తెలిపారు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు పేర్కొనాలని సూచించారు. రచయితలూ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చని తెలిపారు. వచన రచన అనే ప్రక్రియలో సామాజిక, ఆర్థిక, తాత్విక, వైజ్ఞానిక, స్వీయ చరిత్ర, దేశ చరిత్ర, సంస్కృతి, కళలకు సంబంధించిన గ్రంథాలు సూచించవచ్చని పేర్కొన్నారు. అన్ని ప్రక్రియల్లోనూ ప్రామాణిక, మౌలిక గ్రంథాలనే సూచించాలని తెలిపారు. కవితా సంపుటిలయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో గ్రంథాలు 96 పేజీలకు తగ్గరాదని పేర్కొన్నారు. బాల సాహిత్యం, నాటకం ప్రక్రియల్లో పుటల పరిమితి లేదని తెలిపారు. రచయిత మరణించినప్పటికీ 2015, జనవరి నుంచి 2017 డిసెంబర్ మధ్య కాలంలో వారి రచన ప్రచురణ పొంది ఉంటే అవార్డుకు సూచించవచ్చని పేర్కొన్నారు. తెల్లకాగితంపై పాఠకులు తమ సూచనలను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-4 చిరునామాకు పంపాలని కోరారు.

# పౌష్టికాహారంలో మధ్యస్థమే..

## మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్ లో సమస్య తీవ్రం

- అవగాహన పెంచాలంటున్న న్యూట్రిషనిలిస్టులు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పౌష్టికాహార లోపం వల్ల తలెత్తుతున్న సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారుల విషయంలో తెలంగాణ మధ్యస్థ రాష్ట్రంగా నిలిచింది. సమస్య తీవ్రత ప్రాతిపదికన చేసిన ఈ వర్గీకరణలో సమస్య మధ్యస్థ రాష్ట్రంగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వే రాష్ట్రానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఒక వైపు రాష్ట్ర సర్కార్ పిల్లల ఆరోగ్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని చెబుతున్నప్పటికీ రాష్ట్రం ఇంకా మధ్యస్థం దాటి ముందుకెళ్లలేదు.ముఖ్యంగా మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్ లతోపాటు ఖమ్మం, నిజామాబాద్, జహీరాబాద్ ఎంపీ స్థానాల పరిధిలో పౌష్టికాహార లోపం సమస్య తీవ్రంగా ఉన్నట్టు తేలింది. ప్రజారోగ్యరంగం, ఆహార నిపుణులతో సంయుక్తంగా చేసిన ఈ అధ్యయనం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. ఐదేండ్లలోపు ఎదుగుదల లోపంతో పాటు బరువు తక్కువగా ఉండడం, కండరాలు బలంగా లేకపోవడం, పుట్టుకతో సరైన బరువు లేకపోవడం, రక్తహీనత అంశాలను విశ్లేషించింది. ఇందుకోసం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2016కు అనుసరించిన విధానంతో పాటు ఇతర పద్ధతుల్లో అధ్యయనం చేసి ఫలితాలను వెల్లడించారు.



తక్కువ బరువుతో జన్మిస్తున్న పిల్లల పరంగా చూస్తే 21 శాతం మందితో మెదక్‌లో ఎక్కువగా ఉన్నారు. అదే విధంగా తక్కువ బరువు ఉన్న పిల్లలపరంగా కూడా మెదక్, ఆదిలాబాద్ లలో 35 శాతంతో సమస్య తీవ్రంగా ఉంది. ఆదిలాబాద్, నలగొండ జిల్లాల్లో 34 శాతం మంది పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. నల్గొండ, జహీరాబాద్, నిజామాబాద్‌లలో కండరాల లోపం మిగిలిన ప్రాంతాల్లో కన్నా ఎక్కువగా 21 శాతంగా ఉంది. ఖమ్మం, నలగొండలలో రక్తహీనత సమస్య అధికంగా 70 శాతం వరకు ఉన్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా వచ్చిన ఫలితాలను బట్టి మన రాష్ట్రం మధ్యస్థ రాష్ట్రంగా గుర్తింపబడింది. సమస్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు, మధ్యస్థంగా ఉన్న రాష్ట్రాలు, ఎక్కువగా ఉన్న రాష్ట్రాలుగా వర్గీకరించి సూచనలు చేశారు. ఆయా పార్లమెంటు నియోజకవర్గాలకు ఒకటి నుంచి 543 వరకు ర్యాంకులను నిర్ణయించారు. సమస్య ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలకు ఒకటిగా అతి తక్కువగా ఉన్న నియోజకవర్గానికి 543గా స్థానాలు కేటాయించారు. ఈ లెక్కన మన రాష్ట్రంలోని నియోజకవర్గాలు దాదాపు అన్ని వంద నుంచి 300 లోపు పరిమితమయ్యాయి.

ఖమ్మంలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉన్నట్టు బయటపడింది. 70.7 శాతం మంది రక్తహీనతతో 83వ స్థానంలో 69.2 శాతంతో నల్గొండ 101, 69.1 శాతంతో జహీరాబాద్ 102లో ఉన్నాయి. పుట్టుకతో బరువు తక్కువగా ఉన్న శిశువుల విషయంలో మెదక్ లో ఎక్కువగా 20.9 శాతం (86వ స్థానం), ఆదిలాబాద్ 18.8 శాతం (147వ స్థానం), పెద్దపల్లి 18.2 శాతం (165వ స్థానం)లో నిలిచాయి. నిజామాబాద్, జహీరాబాద్, నలగొండలలో కండరాల బలహీనత కలిగిన చిన్నారులు దాదాపు 21 శాతం మంది ఉన్నారు.

### ఆహారంపై అవగాహన అవసరం



గర్భిణిలు, తల్లులకు ఆహారంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముందని ప్రముఖ న్యూట్రిషనిస్టు సుజాత స్టీఫెన్ ఈ సందర్భంగా అన్నారు. జిల్లాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడితే సమస్యను అధిగమించ వచ్చని తెలిపారు. ప్రసవం తర్వాత తొలి 1000 రోజులు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో తల్లి, శిశువులు ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. గర్భస్థ సమయంలో కూడా తప్పనిసరిగా ఐరన్ కలిగిన ఆహారం ఇవ్వాలని సూచించారు.

**- సుజాత స్టీఫెన్**

# ఎందుకీ జాప్యం?


## తహసీల్దార్లను పాత స్థానాలకు పంపడంపై సర్కారు మీనమేషాలు

- ఎన్నికల కోడ్‌తో స్థానభ్రంశమై దాదాపు ఏడాది
- కుటుంబం, పనిఒత్తిళ్ల మధ్య నలిగిపోతున్న తహసీల్దార్లు
- ఓవైపు అనారోగ్యాల పాలు... మరోవైపు కొందరు ప్రాణాలు తీసుకుంటున్న వైనం
- తిరిగి పాత స్థానాలకు పంపాలని తహసీల్దార్ల డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఎన్నికల కోడ్ పేరుతో ఏడాది కింద తహసీల్దార్లను పాత స్థానాల నుంచి ఆయా జిల్లాలకు బదిలీలు చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ, సర్పంచ్, ప్రాదేశిక, ఎన్నికలు పూర్తయిపోయాయిగానీ వారిని తిరిగి పాత స్థానాలకు మాత్రం పంపలేదు. తమను బదిలీ చేసి తొమ్మిది నెలలు దాటిపోతుందని పలుమార్లు వారు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. కుటుంబం ఒక దగ్గర...పనిచేసేది మరో దగ్గర కావడంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు పనిఒత్తిళ్ల భారంతో తహసీల్దార్లు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అందులో భాగంగానే నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ జ్వాల గిరిధర్‌రావు ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్న తహసీల్దార్లను పాత స్థానాలకు పంపాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది.

రాష్ట్రంలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు జిల్లాల్లో పనిచేస్తున్న 366 మంది తహసీల్దార్లను వేరే జిల్లాలకు బదిలీ చేస్తూ సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మం జిల్లాకు మంచిర్యాల, కొమురం భీం, వరంగల్ రూరల్, మహబూబాబాద్, తదితర జిల్లాల నుంచి తహసీల్దార్లను పంపించారు. హైదరాబాద్ జిల్లాలో పనిచేసేవారిని ఆదిలాబాద్, నిజామాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. వాస్తవానికి ఎన్నికలు పూర్తికాగానే తిరిగి సొంత స్థానాలకు పంపించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ముగిసిన వెంటనే అక్కడ తహసీల్దార్లను తిరిగి పాత స్థానాలకు బదిలీలు చేశారు. కానీ, మన రాష్ట్రంలో మాత్రం ఆ పనిచేయలేదు. ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ చేసిన ప్రాంతాల్లో ఎంత కాలం పనిచేయాలనే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదు. అక్కడ ఎంత కాలం ఉండాలనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. పలు జిల్లాల్లో వెహికల్ అలవెన్స్‌లు కూడా ఇవ్వడం లేదు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నెపంతో సొంతప్రాంతాలకు పంపించడం ఆపేశారు. ఎన్నికల కోడ్ పేరుతో బదిలీలు చేసి తొమ్మిది నెలలు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది.




దీనికి తోడు భూ రికార్డుల ప్రక్షాళన, ఓటర్ల వెరిఫికేషన్, సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో 30 రోజుల ప్రణాళిక వంటి కీలక బాధ్యతల్లో తహసీల్దార్లు తలమునకలై పనిచేస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళన కోసం పండుగపబ్బం అనేవి పట్టించుకోకుండా కుటుంబాలకు దూరంగా ఉంటూ ఉన్నతాధికారుల ఒత్తిళ్ల మధ్య పనిచేస్తున్నారు. మరోవైపు సుదూర ప్రాంతాల నుంచి రావడం వారికి తలకుమించిన భారం అవుతున్నది. కొందరు తహసీల్దార్లు ప్రమాదాలకు గురైన ఉదాహరణలు కూడా ఉన్నాయి. మరికొందరు పనిచేసే ప్రాంతాల్లోనే అద్దెకు ఇండ్లను తీసుకుని కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీ చేసిన తహసీల్దార్లను పాత స్థానాలకు తిరిగి పంపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా 85 డిప్యూటీ కలెక్టర్ల క్యాడర్ పోస్టుల్లో తహసీల్దార్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని తహసీల్దార్ల సంఘాల నేతలు సీఎస్‌కు, రెవెన్యూ ఉన్నతాధికారులకు పదిసార్లకుపైగా వినతులు అందజేశారు. అయినా, సర్కారులో చలనం కరువైంది. నేటికీ తిరిగి వారిని పాత స్థానాలకు పంపించలేదు.

**మరో కుటుంబం రోడ్డున పడకముందే బదిలీలు చేపట్టాలి**
**:కే.గౌతంకుమార్, ట్రెసా ప్రధాన కార్యదర్శి**

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిధర్‌రావు కుటుంబంలా మరో కుటుంబం రోడ్డున పడకముందే ఎన్నికల కోడ్‌తో వేరే జిల్లాల్లోని మండలాలకు వెళ్లిన తహసీల్దార్లను తిరిగి పాత స్థానాలకు బదిలీ చేయాలి. 'ఆర్డర్ టూ సర్వ్'పై పనిచేస్తున్న ఉద్యోగులను వారి ఆప్షన్ ప్రకారం బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికే ఈ అంశాలపై స్పెషల్ సీఎస్ సోమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశాం. నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ జ్వాలా గిరిరావు ఆత్మహత్య రెవెన్యూ ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగులందరి తరఫున బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం.

## పాలిటెక్నిక్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించండి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి బి జనార్ధన్‌రెడ్డిని గురువారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, ఉపాధ్యక్షులు ఎండి జావేద్‌తోపాటు పాలిటెక్నిక్ విద్యార్థులు వెంకటేశ్, కె ప్రవీణ్‌కుమార్, గణేష్, మోసిన్, సాగర్, కార్తిక్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. సెమిస్టర్‌తోపాటు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకూడదని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌బీటీఈటీ) నిర్ణయించిందని తెలిపారు. దీని వల్ల 20 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. గత విద్యాసంవత్సరంలాగే ఈ విద్యాసంవత్సరంలోనూ సప్లిమెంటరీ పరీక్షలను సెమిస్టర్‌తోపాటే నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం చేయాలని సూచించారు. విద్యాశాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొంతమంది
చిన్నారులు శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతుంటారు.
ముఖకవళికల ద్వారానే వారిని గుర్తించవచ్చు. సాధారణ చిన్నారుల ఐక్యూ కన్నా
తక్కువ ఐక్యూ వీరిలో ఉంటుంది. పుట్టుకతోనే వచ్చే ఈ సమస్యను డౌన్ సిండ్రోమ్ అంటారు.
జన్యుసంబంధమైన ఈ వ్యాధితో ప్రతి ఏటా వేలాదిమంది పిల్లలు జన్మిస్తున్నారు. అవలక్షణాలతో, అనారోగ్య
సమస్యతో పుట్టే చిన్నారులపై జరిగిన పరిశోధనల్లో ఈ వ్యాధి బయటపడింది. 1959లో బ్రిటిష్ డాక్టర్ జాన్ లాంగ్డన్ డౌన్
ఈ వ్యాధికి క్రోమోజోమ్‌లోని అదనపు పాగులు కారణమని కనుగొనడంతో 'డౌన్ సిండ్రోమ్' అన్న పేరు వచ్చింది.

## అవలక్షణాలకు కారణం

# జన్యు పోగు ..!



డౌన్ సిండ్రోమ్ ఒక విధమైన జన్యు సంబంధమైన వ్యాధి. ఈ వ్యాధిగ్రస్తులలో క్రోమోజోము 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడు వుంటాయి. అందువలన దీనిని ట్రైసోమీ 21 అని కూడా పిలుస్తారు. శారీరక వైకల్యంతో పాటు మానసికవైకల్యంతో ఈ చిన్నారులు బాధపడుతుంటారు.

**కారణాలు..**

జన్యుసంబంధమైనలోపాల కారణంగా వచ్చే అసాధారణ సమస్యలు డౌన్ సిండ్రోమ్‌లో కనిపిస్తాయి. క్రోమోజోమ్ 21లో రెండు పోగులకు బదులుగా మూడుపోగులు ఉంటాయి. ఇందుకు స్పష్టమైన కారణాలు తెలియదు. జన్యు ఉత్తరివర్తనాల కారణంగా కలిగే అసాధారణ మార్పులతో ట్రైసోమీ21 వస్తుందని పరిశోధనల్లో స్పష్టమైంది. తల్లి కడుపులో పిండాభివృద్ధి సమయంలోనే ఈ వైఫల్యం జరుగుతుంది.

- పెద్దవయసులో గర్భం దాల్చిన వారికి పుట్టే పిల్లల్లో డౌన్ సిండ్రోమ్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**లక్షణాలు**

వయసుతో పాటు శరీరం, మనసు పెరగకపోవడం డౌన్ సిండ్రోమ్‌లో కనిపించే ముఖ్యమైన లక్షణం.
శరీరం తీరు, ముఖకవళికలను బట్టి డౌన్ సిండ్రోమ్‌ను గుర్తించవచ్చు.


- ఎత్తులో పెరుగుదల నెమ్మదిగా ఉంటుంది. వీరి కోసం ప్రత్యేకంగా గ్రోత్ ఛార్ట్స్ (Growth charts) తయారు చేశారు.
- అసాధారణ పళ్ళవరస
- బొడ్డు హెర్నియా
- చిన్ని చేతులు , తక్కువ కండరాల బలం
- చిన్న మెడ, మెడ వెనుక పెరిగిన చర్మం
- సమమైన తల
- కనుపాపలో బ్రష్ఫీల్ (Brushfield) మచ్చలు మొదలైన బాహ్య, శారీరక లక్షణాలు కనిపిస్తాయి.

**అనారోగ్య సమస్యలు..**

డౌన్‌సిండ్రోమ్ సమస్య ఉన్నవారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో త్వరగా అనారోగ్య సమస్యలు వస్తాయి.
కొందరిలో పుట్టుకతోనే గుండె సంబంధమైన వ్యాధులు, లోపాలు కనిపిస్తాయి. క్యాన్సర్ ఎక్కువగా సోకుతుంది. థైరాయిడ్ సమస్యలతో బాధపడతారు.

న్యూరో సంబంధమైన సమస్యలు ఫిట్స్, అల్జీమర్స్ వస్తాయి.

- ప్రవర్తనలోనూ అసాధారణం అంశాలను గుర్తించవచ్చు. మాటల్లో స్పష్టత ఉండదు. కొందరు క్రమంగా మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోతారు.
- వీరిలో వినికిడి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీర్ఘకాలిక చెవి ఇన్ఫెక్షన్ల కారణంగా సమస్యలు వస్తాయి.
- 10 నుంచి 15 రెట్లు ఎక్కువగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువగా బ్లడ్ రక్త క్యాన్సర్ , ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వస్తాయి.
- డౌన్ సిండ్రోమ్ ఉన్న దాదాపు సగం మందిలో మలబద్ధకం సమస్య ఉంటుంది.




### హెల్త్ స్క్రీనింగ్

| స్క్రీనింగ్ టెస్ట్ | ఏ వయసులో |
|---|---|
| హియరింగ్ | 6 నెలల నుంచి 5 ఏండ్లలో |
| కళ్ళు | 6 నెలల నుంచి 3 ఏండ్లలో |
| పళ్ళు | 2 ఏండ్ల వరకు ప్రతి ఆరు నెలలకు |
| కోఎలియాక్ వ్యాధి | 2 -3 సంవత్సరాల మధ్య, |
| స్లీప్ స్టడీ | 3 నుంచి 4 ఏండ్ల వయసులో |
| నెక్ ఎక్స్‌రే | 3 , 5 ఏండ్ల వయసులో |

- వీరు ఎక్కువగా ఆల్కలీన్ లాలాజలం కలిగి ఉంటారు, ఇది దంత క్షయానికి కారణం అవుతుంది. దాంతో పళ్ళవరుసలో అసమానతలు వస్తాయి.
- డౌన్ సిండ్రోమ్ ఉన్న వారిలో సంతానోత్పత్తి శక్తి తక్కువగా ఉంటుంది. మహిళల్లో 30–50శాతం మంది మాత్రమే బిడ్డకు జన్మనిచ్చే శక్తిని కలిగి ఉంటారు. మగవారిలో వీర్యకణాల అభివృద్ధి చాలా తక్కువగా ఉంటుంది.

**పరీక్షలు..**

మొదటి– రెండవ త్రైమాసిక స్క్రీనింగ్ , వీక్ అఫ్ ప్రెగ్నస్సీ వెన్ పెరఫార్మేడ్ , తల్లి సీరం ఆల్ఫా–ఫెరోప్రొటీన్, ఇంటిగ్రేటెడ్ టెస్ట్ , సెల్–ఫ్రీ ఫెటల్ డిఎన్ఏ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు.

**అల్ట్రాసౌండ్**

డౌన్ సిండ్రోమ్ కోసం అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉపయోగపడుతాయి. గర్భధారణ 14 నుంచి 24 వారాలలో కనిపించే పిండం పెరుగుదలను గమనిస్తే డౌన్ సిండ్రోమ్ వచ్చే ప్రమాదాన్ని ముందుగా తెలుసుకోవచ్చు.
పుట్టినప్పుడు పిల్లల గుండె ఎలెక్ట్రొకార్డియోగ్రామ్ , (electro-cardiogram), అల్ట్రాసౌండ్ చేయాలి. మూడునెలల వయసులోనే హృదయ సమస్యను గుర్తించే పరీక్షలు చేయించాలి.

**జాగ్రత్తలు..**

కాబోయే అమ్మలు ముందు జాగ్రత్తగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. ఈ స్క్రీనింగ్ పరీక్షల్లో డౌన్ సిండ్రోమ్ వచ్చే ప్రమాదం గుర్తించగలిగితే ముందు జాగ్రత్తలు తీసుకోనే వీలుంటుంది. ఇందుకోసం కోరియోనిక్ విలస్ మాప్టింగ్ (chorionic villus sampling Amniocetisis) అవసరమవుతుంది. ఐదువందల మందిలో ఒకరిలో డౌన్ సిండ్రోమ్ లక్షణాలు కనిపిస్తున్నాయి.
విదేశాల్లో డౌన్‌సిండ్రోమ్ ఉందని నిర్ధారణ జరిగితే గర్భస్రావం చేయించుకునే వీలు ఉంది.
బిడ్డ పుట్టిన తరువాత.. కొన్నిసార్లు స్క్రీనింగ్ పరీక్షల్లో ఎలాంటి లోపాలు కనిపించవు. కానీ, పాపాయి పుట్టిన తర్వాత లక్షణాలు బయటపడతాయి. అలాంటి పరిస్థితుల్లో పిల్లల శారీరపెరుగుదలను తప్పక గమనించాలి. పెరుగుదల చార్ట్ ప్రకారం బరువు, పొడవు పెరగకపోయినా డాక్టర్‌ను సంప్రదించాలి. ఏమైన లోపాలను గుర్తిస్తే సాధ్యమైనంత త్వరగా రోగ నిర్ధారణ చేసుకోవాలి.

- అమినోసెంటీసిస్ (Amniocentesis) అమ్నియాటిక్ ఫ్లూయిడ్ ద్వారా డౌన్ సిండ్రోమ్ పరీక్షలు చేయవచ్చు. దీని ద్వారా పిండం డిఎన్ఏ పరీక్ష చేసి ఏమైనా లోపాలు ఉంటే గుర్తిస్తారు.

**డాక్టర్ లక్ష్మణ్ రావు**
ఎం.బి.బిఎస్
మల్లునరసింహా రెడ్డి స్మారక ప్రజా వైద్యశాల
ఎం.హెచ్.భవన్, అజామాబాద్,
హైదరాబాద్





## ఇలా తప్పించుకోవచ్చు..!

బిజీబిజీ జీవితంలో ఎంత ఓర్పుగా ఉన్నా కొన్నిసార్లు ఒత్తిడి మనల్ని చిత్తు చేస్తుంది. చాలా ఆరోగ్యసమస్యలకు ఒత్తిడే కారణం అవుతుంది. ఇలాంటి సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు..

**శబ్దాలతో..**

మనసు బాగాలేదా? విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నారా? ఒత్తిడితో కూడిన మనసు మీద శబ్దం చూపే ప్రభావం అపారం. మీకు ఇష్టమైన పాటని హమ్ చేస్తే నిమిషాల్లో ఒత్తిడి మాయం అవుతుంది. ప్రక తిని తలపించే శబ్దాలను విన్నా ఒత్తిడి దూదిపింజలా తేలిపోతుంది. గాలికి ఊగుతూ మెల్లగా శబ్దం చేసే చైనీస్ గంటల శబ్దం కూడా ఒత్తిడిని దూరం చేస్తుంది.

**స్పర్శతో..**

శబ్దమే కాదు, స్పర్శ కూడా ఉద్వేగాన్ని దూరం చేస్తుంది. మనకి ఇష్టమైన వస్తువుని ఉదాహరణకు మొక్కలను ముట్టుకోవడం, రబ్బర్ బాల్‌ని చేత్తో నొక్కడమో, వేడినీటితో స్నానం చేయడమో, చల్లని గాలి తాకేలా ఆరుబయట తిరగడం ఒత్తిడిని దూరం చేస్తాయి.

**నడకతో..**

బాగా కోపంగా ఉన్నప్పుడు స్పీడ్‌గా పది అడుగులు వేస్తే చాలు కూల్ అవుతారు. కాసేపు నడక వల్ల కూడా మనసులోని ఒత్తిడి నిదానంగా కరిగిపోతుంది. ఒత్తిడిని కలిగించే ఆలోచనలను పక్కనపెట్టి, శ్వాస మీద దృష్టిపెడుతూ నడిస్తే ఒత్తిడి ఇట్టే మాయమవుతుంది.

**నవ్వుతూ..**

ఒత్తిడిని ఎదుర్కొనేందుకు నవ్వుని మించిన ఆయుధం లేదు. నవ్వడం వల్ల మన శరీరంలో ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ అనే రసాయనాల ఉత్పత్తి తగ్గి, వాటి బదులుగా ఆనందాన్ని రేకెత్తించే ఎండోమార్ఫిన్స్ అనే రసాయనాలు వెలువడతాయి. కాబట్టి మనస్ఫూర్తిగా నవ్వడమో, నవ్వేందుకు ఇష్టమైన కామెడీ సన్నివేశాన్ని చూడటమో చేయవచ్చు.



**శ్వాస మీద ధ్యాస..**

ఒత్తిడిగా అనిపించినప్పుడు లేచి నిల్చవాలి. తల, వెన్ను, భుజాలని నిటారుగా ఉంచుకుని నిదానంగా, దీర్ఘంగా ఊపిరి పీల్చుకోవాలి. బయటకి వదిలే ప్రతి ఊపిరితోనూ మీలోని ఉద్వేగం తగ్గిపోతున్నట్లుగానూ, లోపలికి తీసుకునే ప్రతి శ్వాసతోనూ మనసు తేలిక పడుతున్న భావనతో శ్వాస మీద ధ్యాస పెట్టాలి.
ఒత్తిడిలో, కోపంలో ఉన్నప్పుడు శరీర కండరాలన్నీ బిగుసుకుంటాయి. బిగుసుకుపోయిన కండరాలు మరింత ఉద్వేగానికి దారితీస్తాయి. ఉద్వేగంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం మన మొహంలో కనిపించకుండా జాగ్రత్తపడాలి. శరీరం మీద ధ్యాస ఉంచాలి.

**పరిశోధన**

## ఒకే పరీక్షతో..



శరీరంలో అనారోగ్య లక్షణాలు కొన్నిసార్లు బయటకు స్పష్టంగా కనిపించవు. అలాంటి సమయంలో రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని గుర్తించే వీలు కలుగుతుంది. ఇటీవల వ్యాధి నిర్ధారణ కోసం జరుగుతున్న పరిశోధనలు అనేక కొత్త అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ కోసం అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. స్పెయిన్‌లో జరిగిన యూరోపియన్ సొసైటీ ఫర్ మెడికల్ అంకాలజీ సదస్సులో కొన్న సంస్థలు, పరిశోధన ప్రయోగ ఫలితాలను వెల్లడించాయి. ఒకే రక్తపరీక్షతో 20రకాల క్యాన్సర్లను గుర్తించగల విధానాన్ని అభివ ద్ధిపరిచామని అమెరికా శాస్త్రవేత్తలు అంటున్నారు. శరీరంలో ఏ భాగంలోని ఏ కణజాలానికి క్యాన్సర్ వచ్చిందో కచ్చితంగా గుర్తించగలగడం దీని ప్రత్యేకత అని క్యాన్సర్ పరిశోధనా శాస్త్రవేత్తలు ప్రకటించారు.

## కప్పు అన్నం రెండు కప్పుల కూరలు




శరీరానికి కావల్సిన పోషణ అనగానే చాలామంది చెప్పే విషయం అన్నం తక్కువ, కూరలు ఎక్కువ తినాలి అని. డైట్ అనగానే అన్నం తక్కువ తిని కూరలు ఎక్కువ తినాలనేది కేవలం ఒక అపోహ మాత్రమే అని పోషకాహారనిపుణులు సూచిస్తున్నారు. కూరలు ఎంత తినాలనేది మనం తీసుకునే ఆహారం మీద ఆధారపడి ఉంటుంది.

మన దేశంలో చాలా రకాల ఆకుకూరలు, కూరగాయలు ఉన్నాయి. ఎన్నో రకాల మసాలా దినుసులు వెల్లుల్లి, అల్లం, జీలకర్ర, ఆవాలు, మెంతులు, ఇంగువ, లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, ధనియాలు... ఇలా పలురకాల మసాలాలు ఉన్నాయి. కరివేపాకు, పుదీనా, కొత్తిమీర, మెంతి వంటివి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయి. కడుపులో మంట తగ్గిస్తాయి. పొట్ట ఉబ్బరం రాకుండా చేస్తాయి. యాంటీ ఫంగల్, యాంటీ బయాటిక్‌లాగా ఉపయోగపడతాయి. అంతేకాదు మనం ఆహారంలో ఉపయోగించే మసాలాదినుసుల వల్ల జీర్ణవ్యవస్థలో అరుగుదలకు కావాల్సిన ఎంజైములు తయారవుతాయి. జీర్ణకోశాన్ని శుభ్రపరుస్తాయి. మెదడు చురుకుగా పనిచేయడానికి ఉపయోగపడతాయి. డిప్రెషన్ పోగొడుతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అయితే మనం తీసుకునే కూరగాయాల్లో ఎక్కువ మసాలదినుసులు లేకుండా చూసుకోవాలి. మసాల దినుసుల ఘాటు పెరిగితే అసిడిటీ పెరుగుతుంది.

కూరగాయలు, ఆకుకూరల వల్ల శరీరానికి ఎన్నో లాభాలు చేకూరుతాయి. అయితే వీటిలో మసాలాలను అతిగా వాడకూడదు. కావాల్సినంత మాత్రమే వాడితే ఎలాంటి సమస్య ఉండదు. అన్నంతో పాటు కూరగాయలను తీసుకునేవారు ఒకే రకం కూరగాయలను కాకుండా రెండుమూడు రకాల కూరగాయలను, ఆకుకూరలను తీసుకోవడం మంచిది. ఒక్కొక్క కూరగాయలో ఒక్కొక్క రకం పోషకాలు ఉంటాయి. కాబట్టి అందుబాటులో ఉన్న అనేక రకాల కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలి.

# స్క్రీనింగ్ ఒక్కటే మార్గం!

**రొమ్ము క్యాన్సరు స్త్రీలలో వచ్చే క్యాన్సరులలో అతి సాధారణమైనది. క్యాన్సరు వల్ల స్త్రీలలో కలిగే మరణాలలో రెండవ స్థానంలో వున్నది. స్త్రీ జీవిత కాలంలో ఈ జబ్బు వచ్చే అవకాశాలు ఎక్కువ. క్యాన్సర్ ఆనవాళ్లున్నాయని గుర్తిస్తే వెంటనే చికిత్స చెయ్యటం ద్వారా చక్కదిద్దుకోవచ్చు. క్యాన్సర్ బయటకు వ్యాపించకుండా ఇంకా రొమ్ములో ఉన్నప్పుడే గుర్తించి వెంటనే చికిత్స చేస్తే ఫలితాలు చాలా బాగుంటాయని ఎన్నో శాస్త్రీయ అధ్యయనాల్లో తేలింది. కాబట్టి క్యాన్సర్ ను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా గుర్తించేందుకు స్క్రీనింగ్ ఒక్కటే మార్గం!**

**లక్షణాలు**

కొన్ని లక్షణాలు కనిపించినప్పుడే డాక్టర్‌ను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకుంటే ముందుగానే ఈ క్యాన్సర్‌ను గుర్తించే అవకాశం ఉంది. మొదటి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

- రొమ్ములో గడ్డలు
- చనుమొనల నుంచి ద్రవాలు స్రవించడం
- వెనుదిరిగిన చనుమొనలు (సాధారణంగా బయటకు వచ్చినట్టు వుండాలి.)
- గట్టిగా, కందినట్టుగా వుండే చనుమొనలు
- రొమ్ములు పెద్దవి కావడం
- రొమ్ములు కుంచించుకు పోయినట్టు వుండడం.
- రొమ్ములు గట్టిపడడం
- ఎముకలలో నొప్పి
- నడుము నొప్పి మొదలైన లక్షణాలు హానికలిగించే విషయాలని గమనించాలి.


**కారణాలు:** కుటుంబ చరిత్ర ముఖ్యంగా గమనించాలి. మహిళల వయసు పెరిగే కొద్దీ ఈ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది. జన్యు పరమైన లోపాలు, పిల్లలు లేకపోవడం, ఆలస్యంగా 50ఏండ్ల దాటిన తరువాత బహిష్టులు ఆగిపోవడం, ధూమపానం, మధుపానం, ఆహారంలో ఎక్కువ కొవ్వు పదార్థాలు తీసుకోవడం, పీచు పదార్థాలు తక్కువగా వున్న ఆహారం తీసుకోవడం, అధిక బరువు తదితర కారణాల వల్ల రొమ్ము క్యాన్సర్ వస్తుంది.

**చికిత్స:** ఈ రొమ్ము క్యాన్సర్ వచ్చిన వారిలో సందేహాలు–చికిత్సా విధానాలపై అవగాహన అవసరం. రొమ్ము క్యాన్సరు చికిత్స ముఖ్యంగా మూడు అంశాలపై ఆధారపడి వుంటుంది.

- చికిత్స తీసుకునే మహిళ మెనోపాజ్ దశలో ఉన్నారా..
- రొమ్ము క్యాన్సరు ఎంత మేరకు వ్యాపించి ఉన్నది
- రొమ్ము క్యాన్సరు లోని కణాల నమూనా ఈ మూడు ముఖ్య అంశాల ఆధారంగా రొమ్ము క్యాన్సర్ చికిత్స చేస్తారు.

చికిత్సలో భాగంగా క్యాన్సర్ వచ్చిన భాగంతో పాటు.. బాహుమూలాల్లో ఉన్న లింఫ్ గ్రంథులకూ ఆ కణాలు వ్యాపిస్తే, వాటినీ తొలగిస్తారు. ఒకవేళ క్యాన్సర్ కణితి నాలుగు సెంటీమీటర్ల కన్నా తక్కువగా ఉంటే రొమ్మును పూర్తిగా తీసేయకుండా కోత పెట్టి కణితి ఏర్పడిన భాగంతోపాటు చుట్టూ ఉన్న కణజాలాన్ని కొంతవరకు తీసేస్తారు. అయితే ఆ తరవాత కొన్ని రోజులు రేడియోథెరపీ చేయించుకోవడం తప్పనిసరి అవుతుంది. దానివల్ల రొమ్ములో ఇంకెక్కడైనా చేరిన క్యాన్సర్ కణాలు పూర్తిగా నశిస్తాయి.

- రక్త ప్రసరణ ద్వారా క్యాన్సర్ కణాలు ఇతర శరీర భాగాలకు చేరితే వాటిని నశింపచేయడానికి కీమో, రేడియో, హార్మోన్ లాంటి థెరపీలు అందుబాటులో ఉన్నాయి. అయితే అందరికీ కీమో, రేడియో, హార్మోన్ థెరపీలు చేయాల్సిన అవసరం రాకపోవచ్చు.



**మాస్టెక్టమీ:** క్యాన్సర్ కణితి నాలుగు సెంటీమీటర్ల కన్నా ఎక్కువగా, చనుమొన దగ్గర ఉన్నప్పుడు, రొమ్మును ఉంచలేని పరిస్థితి ఎదురైనప్పుడు దాన్ని పూర్తిగా తొలగిస్తారు.

**గ్రంథులకు చికిత్స:** రొమ్ము క్యాన్సర్ కణాలు మొట్టమొదటగా వ్యాపించేది బాహుమూలల్లోని లింఫ్ గ్రంథులకే. అందుకే క్యాన్సర్ కు చికిత్స చేసే క్రమంలో వాటి పైనా దృష్టి సారిస్తారు వైద్యులు. అది ఎప్పుడంటే రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ చేసే క్రమంలో ట్రిపుల్ ఎసెస్ మెంట్ పరీక్ష నిర్వహిస్తారు. అందులో భాగంగా మామోగ్రామ్‌తో పాటు బాహుమూలల్లోనూ అల్ట్రా సౌండ్ స్కాన్ తప్పనిసరి. అప్పుడు ఆ భాగంలో లింఫ్ గ్రంథులు సహజంగా ఉన్నాయా లేదా అన్నది తెలుస్తుంది. ఎలాంటి సమస్యా లేనప్పుడు సెంటినల్ నోడ్ బయాప్సీ సిఫారసు చేస్తారు. ఒకవేళ క్యాన్సర్ సూచన కనిపిస్తే ఆక్సిలరీ నోడ్ క్లియరెన్స్ ద్వారా లింఫ్ గ్రంథుల్ని పూర్తిగా తొలగిస్తారు.

**సెంటినల్ నోడ్ బయాప్సీ:** ఇది అత్యాధునికమైన పద్ధతి. క్యాన్సర్ కణాలు వ్యాపించిన మొదటి లింఫ్ గ్రంథుల్ని సెంటినల్ నోడ్స్ అంటారు. శస్త్రచికిత్స కన్నా ముందు వైద్యులు నిర్వహించే ట్రిపుల్ అసెస్ మెంట్ పరీక్షలో భాగంగా అల్ట్రాసౌండ్ చేసినప్పుడు కొన్ని సార్లు క్యాన్సర్ లక్షణాలు ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఈ పద్ధతిని ఎంచుకుంటారు. రొమ్ముకు శస్త్రచికిత్స చేసే ముందు బ్లూ డై, రేడియో యాక్టివ్ ఫ్లూయిడ్ ను క్యాన్సర్ వచ్చిన రొమ్ములో ప్రవేశపెడతారు. అవి అసహజంగా ఉన్న లింఫ్ గ్రంథుల దగ్గరకు చేరతాయి. మత్తు ఇచ్చాక రొమ్ముకు శస్త్రచికిత్స చేస్తున్నప్పుడే బాహుమూలల్లో చిన్న రంధ్రం చేసి పరీక్షలు చేస్తారు. దీన్ని ప్రోజెన్ సెక్షన్ అంటారు. ఇరవై నిమిషాల్లో క్యాన్సర్ కణాలు ఆ భాగానికి సోకాయా లేదా అన్నది తెలుస్తుంది. క్యాన్సర్ లేదనప్పుడు ఇక మిగతా గ్రంథుల్ని తీయాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ ఒకటి లేదా రెండు గ్రంథుల్లో ఉందని తేలితే.. ఆ కోతను పెద్దగా చేసి ఆక్సిలరీ విధానాన్ని నిర్వహించాల్సి ఉంటుంది.

**ముందు జాగ్రత్తలు**

రొమ్ము క్యాన్సరు త్వరగా కనుక్కొని చికిత్స తీసుకుంటే నయం చేసుకోవచ్చు, ఆలస్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చును.

- ప్రతినెలా రొమ్ములను స్వయంగా పరీక్షించుకోవాలి. దీనివల్ల రొమ్ముల్లో గడ్డలు (చిన్న వికానీ, పెద్దవికానీ) వున్నట్టు ఎంత మాత్రం అనుమానం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. వీటి వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి.
- 40–74 మధ్య వయసున్న మహిళలు స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. 40 – 54 ఏండ్ల వారు ప్రతి రెండేండ్లకు ఒకసారి, 55 ఏండ్లు పైబడిన వారు ఏడాదికి ఒకసారి పరీక్ష చేయించుకోవాలి.
- స్క్రీనింగ్‌లో తేడాలు ఉంటే 'మామోగ్రామ్' పరీక్ష, మరీ అవసరమైతే అల్ట్రాసౌండ్ స్కానింగ్ కూడా చేస్తారు. క్యాన్సర్ ఆనవాళ్లు చాలావరకూ ఈ పరీక్షల్లోనే బయటపడతాయి.

ఇంకో ముఖ్యమైన విషయమేమంటే రొమ్ము క్యాన్సర్ వస్తే చికిత్స చేయడం తప్పించి.. అసలు అది రాకుండా నివారించే విధానం లేదు. కాబట్టి ప్రతి మహిళా రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి.

40 ఏండ్లు దాటిన ప్రతి మహిళా మామోగ్రామ్ చేయించుకోవాలి. ఈ రెండింటితో రొమ్ముక్యాన్సర్ ను చాలా త్వరగా గుర్తించే వీలుంటుంది.

**- డాక్టర్ శ్రీనివాస్ జూలూరి**
సర్జికల్ అంకాలజిస్టు,
కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్



## భార్యలను అలా చూడొద్దు

- క్రికెట్ బోర్డులకు సానియా చురక

న్యూఢిల్లీ : స్వదేశీ, విదేశీ పర్యటనల్లో ఆటగాళ్ల సతీమణులను తోడుగా తీసుకెళ్లేందుకు క్రికెట్ బోర్డులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా విమర్శలు గుప్పించారు. ఐక్య రాజ్య సమితి మహిళా సహృద్భావ రాయబారిగా ఉన్న సానియా మీర్జా ఈ విషయంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'చాలా సందర్భాల్లో, భారత క్రికెట్ జట్టుతో సహా చాలా జట్లు తోడుగా భార్యలను, ప్రియురాళ్లను అనుమతించటం లేదు. ఆటగాళ్లు పరధ్యానంలో పడతారనే కారణం చెబుతున్నారు. ఇలా చెబితే, దాని అర్థం ఏమిటీ? పని నుంచి మగాళ్ల దృష్టిని మహిళలు మరల్చుతున్నారా?. ఈ ధోరణి మహిళలు పరధ్యాయానికి ఆకర్షణగా పని చేస్తారు, ఎప్పటికి బలం కాలేరనే అర్థాని ఇస్తుంది. ఇది మరింత పెద్ద సమస్య' అని సానియా మీర్జా తెలిపింది. 2019 ప్రపంచకప్ సమయంలో భారత్‌తో మ్యాచ్‌కు ముందు భర్త షోయబ్ మాలిక్‌తో కలిసి డిన్నర్‌కు రెస్టారెంట్‌కు వెళ్లిన ఫోటోలు అప్పట్లో సోషల్ మీడియాలో దుమారం రేపిన సంగతి తెలిసిందే.





**డిఫెన్స్ చెదిరింది :** ఎడెన్ మార్క్‌రం (5) డిఫెన్స్ ఛేదించి వికెట్‌ను గిరాటేసిన అశ్విన్ బంతి.

# మాయ మొదలైంది!

పిచ్ ఫ్లాట్‌గా ఉంది. బ్యాట్స్‌మెన్ సులువుగా పరుగులు సాధిస్తున్నారు. దక్షిణాఫ్రికా సైతం గట్టిగా ప్రతిఘటించే అవకాశం ఉందనే అంచనా. నాణ్యమైన స్పిన్నర్లు రంగంలోకి దిగితే కథ వేగంగా మారుతుంది. భారత స్పిన్నర్లు అశ్విన్, జడేజా మరోసారి ఇది నిరూపించారు. భారత బ్యాట్స్‌మన్ పరుగుల వరద పారించిన పిచ్‌పై సఫారీ టాప్ ఆర్డర్‌ను శాసించారు. అశ్విన్, జడేజా చేతిలో బంతితో సఫారీ బ్యాట్స్‌మన్ వికెట్ భయంతో వణికిపోయారు. అశ్విన్ (2/9), జడేజా (1/21) మాయాజాలంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 39/3తో ఎదురీదుతోంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌కు 463 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. మయాంక్ అగర్వాల్ (215) డబుల్ సెంచరీతో చెలరేగాడు. తొలి సెషన్‌లో కెరీర్ తొలి శతకం సాధించిన మయాంక్.. లంచ్ తర్వాత ద్వి శతకానందాన్ని ఆస్వాదించాడు. రోహిత్ (176), మయాంక్ 317 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంతో భారత్ భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను 502/7 వద్ద డిక్లరేషన్ ఇచ్చింది. విశాఖ టెస్టుపై తిరుగులేని పట్టు సాధించింది.

- 39/3తో దక్షిణాఫ్రికా ఎదురీత
- మాయాంక్ అగర్వాల్ డబుల్ సెంచరీ
- భారత్ తొలి ఇన్నింగ్స్ 502/7 డిక్లేర్డ్
- విశాఖ టెస్టుపై కోహ్లిసేన గట్టి పట్టు
- ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు రెండో రోజు

విశాఖపట్నం నుంచి
శ్రీనివాస్ దాస్ మంతటి

విశాఖ తీరంలో భారత స్పిన్నర్ల మాయ మొదలైంది. రవిచంద్రన్ అశ్విన్ (2/9), రవీంద్ర జడేజా (1/21) మాయాజాలానికి దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ విలవిల్లాడింది. ఎడెన్ మార్క్‌రం (5), డీ బ్రూయిన్ (4)లను అశ్విన్ వెనక్కి పంపగా.. డేన్ పీట్ (0)సంగతి జడ్డూ చూసుకున్నాడు. అశ్విన్, జడేజా మాయతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలోనే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 463 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్న దక్షిణాఫ్రికా, పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. డీన్ ఎల్గార్ (27 బ్యాటింగ్, 63 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), తెంబ బవుమా (2 బ్యాటింగ్) రెండో రోజు ఆట ముగిసే సమయానికి అజేయంగా ఆడుతున్నారు. నేడు ఎల్గార్, బవుమా సహా నాయకుడు డుప్లెసిస్, క్వింటన్ డికాక్ రాణిస్తేనే దక్షిణాఫ్రికా కష్టాల నుంచి బయటపడగలదు. స్పిన్‌తో ఇప్పటికే ప్రమాదకరంగా కనిపిస్తున్న అశ్విన్, జడేజాలను మూడో రోజు ఎదుర్కోవటం అంత సులువు కాదు. అంతకముందు మయాంక్ అగర్వాల్ (215, 371 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్స్‌లు) డబుల్ సెంచరీ సాధించాడు. కెరీర్ తొలి సెంచరీనే మయాంక్ డబుల్ ధమాకాగా మార్చి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ (176, 244 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ కోహ్లి (20), పుజార (6), అజింక్య రహానె (15), హనుమ విహారి (10) వేగంగా వికెట్లు కోల్పోయినా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 502/7 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. నేడు భారత స్పిన్నర్ల మాయాజాలం విశాఖ టెస్టు ఫలితాన్ని నిర్దేశించనుంది!.

### తొలి సెషన్ : భారత్ 324/1 : జోరుగా పరుగుల వేట

తొలి రోజు ఉత్సాహాన్ని ఓపెనర్లు రెండో రోజూ కొనసాగించారు. శతక హీరో రోహిత్ శర్మ (176) డబుల్ సెంచరీపై ఆశలు రేకెత్తించాడు. 23 ఫోర్లు, ఆరు సిక్సర్లతో మెరిసిన రోహిత్.. తొలి సెషన్‌లో ముందుండి పరుగుల వేట సాగించాడు. సఫారీ కెప్టెన్ డుప్లెసిస్ రెండో రోజు సైతం స్పిన్నర్లపైనే ఎక్కువగా ఆధారపడ్డాడు. నిర్దాక్షిణ్య ఎదురుదాడికి సిద్ధమైన రోహిత్, ఈ సమయంలో క్రీజు వదిలి ఆడేందుకు మొగ్గు చూపాడు. కేశవ్ మహరాజ్‌ను ముందుకెళ్లే ఆడబోయిన రోహిత్ వికెట్ కీపర్ డికాక్ మెరుపు స్టంపౌట్‌తో పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఓపెనర్‌గా తొలి శతకాన్ని సెంచరీగానే ముగించాడు. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ వడివడిగా పరుగులు చేశాడు. 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 204 బంతుల్లో కెరీర్ తొలి సెంచరీ సాధించాడు. మయాంక్ 99 పరుగుల వద్ద ఉండగా కవర్స్‌లో మిస్ ఫీల్డ్‌కు రోహిత్ శర్మ పరుగు నిరాకరించాడు. కెరీర్ తొలి శతకం కోసం మయాంక్ ఆసక్తిగా కనిపించాడు. తర్వాత లాంగ్ ఆన్‌లో పరుగుతో మయాంక్ అగర్వాల్ తొలి శతక ఆనందాన్ని సొంతం చేసుకున్నాడు. చతేశ్వర్ పుజార (6), మయాంక్ అగర్వాల్ (138) క్రీజులో ఉండగా తొలి సెషన్‌ను భారత్ 324/1తో ముగించింది. తొలి సెషన్‌లో 29 ఓవర్లలోనే రోహిత్, మయాంక్ 122 పరుగులు పిండుకున్నారు. తొలి రోజు సైతం రెండో సెషన్‌లో ఈ జోడీ ఇదే వేగంతో పరుగులు సాధించిన సంగతి తెలిసిందే.

### రెండో సెషన్ : భారత్ 450/5, మయాంక్ అగర్వాల్ డబుల్

ఫ్లాట్ పిచ్. ఓపెనర్లు ఇప్పటికే పరుగుల వరద పారించారు. దీంతో ఇక్కడ పుజార, కోహ్లిలను ఆపటం సఫారీకి అసాధ్యమనే భావన కలిగింది. ఫిలాండర్ కండ్లుచెదిరే సీమ్‌తో పుజార (6, 17 బంతుల్లో 1 ఫోర్) వికెట్‌ను పడగొట్టాడు. నం.4 కెప్టెన్ కోహ్లి (20, 40 బంతుల్లో 4 ఫోర్లు) తనదైన శైలిలో నాలుగు బౌండరీలు సాధించి అలరించాడు. సఫారీ బౌలర్ ఎవరూ కోహ్లిని ఇబ్బంది పెట్టలేకపోయారు. అలవోకగా ఆడుతున్న కోహ్లి ఉన్నట్టుండి నిర్లక్ష్యపు షాట్‌తో ఆశ్చర్యపరిచాడు. భారత సంతతి స్పిన్నర్ సెనురన్ ముతుస్వామి వేసిన బంతికి కోహ్లి బ్యాట్‌పుట్‌తో సిద్ధంగా ఉన్నాడు. కానీ ఆఖర్లో ఎడ్జ్‌తో క్యాచ్ నేరుగా బౌలర్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ముతుసామి కెరీర్ తొలి వికెట్‌గా వరల్డ్ నం.1 బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లిని అవుట్ చేసి.. మైదానంలో సంబురాలు చేసుకున్నాడు. విశాఖ వేదికగా విరాట్ కోహ్లి (అన్ని ఫార్మాట్లలో)కి ఇదే అత్యల్ప స్కోరు. శతకం తర్వాత వేగంతో పాటు శైలిలో దూకుడు సాధించిన మయాంక్ కెరీర్ తొలి సెంచరీని ద్వి శతకంగా మలిచాడు. 294 బంతుల్లో 150 పరుగులు చేసిన మయాంక్, 358 బంతుల్లోనే డబుల్ ధమాకా సాధించాడు. 22 ఫోర్లు, ఐదు సిక్సర్లతో అగర్వాల్ డబుల్ సెంచరీ అందుకున్నాడు. ఈ సెషన్‌లోనే మయాంక్ అగర్వాల్ (215), అజింక్య రహానె (15)లను సైతం అవుట్ చేసి దక్షిణాఫ్రికా ఊరట చెందింది. లంచ్ తర్వాత భారత్ 126 పరుగులు చేయగా.. సఫారీ నాలుగు వికెట్లు కూల్చింది. విశాఖ టెస్టులో దక్షిణాఫ్రికా మెరుగైన ప్రదర్శన కనబర్చిన సెషన్ ఇదే.

### మూడో సెషన్ : భారత్ 502/7, తొలి ఇన్నింగ్స్ డిక్లరేషన్

స్కోరు బోర్డుపై కావాల్సినన్ని పరుగులతో ఉన్న భారత్.. మూడో సెషన్‌లో ధనాధన్ లక్ష్యంతోనే బరిలోకి దిగింది. లోకల్ హీరో, తెలుగు కుర్రాడు హనుమ విహారి (10, 24 బంతుల్లో 1 ఫోర్) నిరాశపరిచాడు. 24 బంతులాడిన విహారి పది పరుగులకే వికెట్ కోల్పోయాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా (21, 16 బంతుల్లో 4 ఫోర్లు) దూకుడుగా ఆడాడు. జడేజా తోడుగా నాలుగు ఫోర్లతో మెరిశాడు. అదే జోరులో పీట్ బంతికి మిడ్ వికెట్‌లో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. జడేజా (30 నాటౌట్, 46 బంతుల్లో 1 సిక్స్), అశ్విన్ (1 నాటౌట్) భారత స్కోరును 500 మార్క్ దాటించారు. స్కోరు 500 చేరగానే కెప్టెన్ విరాట్ తొలి ఇన్నింగ్స్ డిక్లరేషన్ ప్రకటించాడు. తొల ఇన్నింగ్స్‌లో భారత్ 502/7 పరుగుల భారీ స్కోరు చేసింది.

### దక్షిణాఫ్రికా 39/3 : అశ్విన్, జడేజా మాయాజాలం

మూడో సెషన్‌లో దక్షిణాఫ్రికాకు బ్యాటింగ్‌కు ఆహ్వానించిన కోహ్లిసేన.. స్పిన్‌తో మాయ చేసింది. పేసర్లు ఇషాంత్ శర్మ, మహ్మద్ షమిలు ఆకట్టుకునే బంతులే సంధించినా.. వికెట్ల వేటలో స్పిన్నర్లే సక్సెస్ అయ్యారు. సఫారీని తొలి దెబ్బ రీ ఎంట్రీ హీరో అశ్విన్ కొట్టాడు. ఓపెనర్ ఎడెన్ మార్క్‌రం (5)ను మాయ చేసిన అశ్విన్ డిఫెన్స్‌ను ఛేదించి వికెట్ గిరాటేశాడు. నం.3 బ్యాట్స్‌మన్ డి బ్రూయిన్ (4) సైతం అశ్విన్ స్పిన్‌కు ఎంతో సేపు వికెట్ కాపాడుకోలేదు. వికెట్ కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. నైట్ వాచ్‌మన్ డేన్ పీట్ (0)ను క్లీన్‌బౌల్డ్ చేసి జడేజా వికెట్ల వేటను కొనసాగించాడు. అదే ఓవర్లో షార్ట్ లెగ్‌లో తెంబ బవుమా (2) ఇచ్చిన క్యాచ్‌ను హనుమ విహారి కంగారూలో వదిలేశాడు. లేదంటే జడ్డూ ఖాతాలో వికెట్ పడిపోయేది. 20 ఓవర్లలో 39 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయింది.

**స్కోరు వివరాలు :**

**భారత్ తొలి ఇన్నింగ్స్ :** మయాంక్ అగర్వాల్ (సి) డేన్ పీట్ (బి) డీన్ ఎల్గార్ 215, రోహిత్ శర్మ (స్టంప్డ్) డికాక్ (బి) కేశవ్ మహరాజ్ 176, చతేశ్వర్ పుజార (బి) ఫిలాండర్ 6, విరాట్ కోహ్లి (సి,బి) సెనురన్ ముతుసామి 20, అజింక్య రహానె (సి) బవుమా (బి) కేశవ్ మహరాజ్ 15, రవీంద్ర జడేజా నాటౌట్ 30, హనుమ విహారి (సి) ఎల్గార్ (బి) కేశవ్ మహరాజ్ 10, వృద్ధిమాన్ సాహా (సి) సెనురన్ ముతుసామి (బి) డేన్ పీట్ 21, రవిచంద్రన్ అశ్విన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 08, **మొత్తం : (136 ఓవర్లలో 7 వికెట్లకు) 502.**

**వికెట్ల పతనం :** 1-317, 2-324, 3-377, 4-431, 5-436, 6-457, 7-494.

**బౌలింగ్ :** వెర్నన్ ఫిలాండర్ 22-4-68-1, కగిసో రబాడ 24-7-66-0, కేశవ్ మహరాజ్ 55-6-189-3, డేన్ పీట్ 19-1-107-1, సెనురన్ ముతుసామి 15-1-63-1, డీన్ ఎల్గార్ 1-0-4-1.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ :** డీన్ ఎల్గార్ బ్యాటింగ్ 27, ఎడెన్ మార్క్‌రం (బి) అశ్విన్ 5, డి బ్రూయిన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) రవీంద్ర జడేజా 0, తెంబ బవుమా బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు : 01, **మొత్తం : (20 ఓవర్లలో 3 వికెట్లకు).**

**వికెట్ల పతనం :** 1-14, 2-31, 3-34,

బౌలింగ్ : ఇషాంత్ శర్మ 2-0-8-0, మహ్మద్ షమి 2-2-0-0, రవిచంద్రన్ అశ్విన్ 8-4-9-2, రవీంద్ర జడేజా 8-1-21-1.



**ఆనందం డబుల్ :** మయాంక్ అగర్వాల్ 215 (371 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్సులు)

## అనుకోకుండా వచ్చాడు...
# అదరగొడుతున్నాడు


2014-15 రంజీ సీజన్. కర్నాటక తరఫున మయాంక్ అగర్వాల్ ఓపెనర్‌గా ఆడాల్సి ఉంది. రంజీ సీజన్ సగం ముగిసింది. అయినా, మయాంక్ అగర్వాల్ ఓపెనింగ్ చేసే అవకాశం రాలేదు. అండర్-19 నుంచీ పరుగుల వరద పారించిన మయాంక్ అగర్వాల్ వన్డే, టీ20 స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. భారత్-ఏ తరఫున నిలకడగా అవకాశాలు లభించినా, ప్రదర్శనలో నిలకడ చూపించలేదు. భారత్-ఏ జట్టు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్.. ఈ సమయంలో మయాంక్‌తో ఓ మాట అన్నాడు. ' ఇది నీకు మేలుకోవాల్సిన సమయం'. రంజీ సీజన్ సాగుతుండగానే మయాంక్ అగర్వాల్ రూపాంతర ప్రక్రియ మొదలైంది. ఫిట్‌నెస్ కోసం మయాంక్ అగర్వాల్ బరువు తగ్గాడు. ఫిట్‌నెస్‌లో ఉన్నత ప్రమాణాలు అందుకుని, ఆ సీజన్‌లోనే కర్నాటకకు రంజీ ఓపెనర్‌గా సూపర్ ఇన్నింగ్స్‌లు నమోదు చేశాడు. 2013లోనే తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అగర్వాల్.. మధ్యలో లయ కోల్పోయాడు. ఫామ్ కోసం ఇబ్బంది పడ్డాడు. కానీ 2014-15 సీజన్ తర్వాత మయాంక్ ఆటలో విప్లవాత్మక మార్పు కనిపించింది. ఇప్పటివరకూ మయాంక్ 54 ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో 47.89 సగటుతో 4167 పరుగులు సాధించాడు. ఇందులో ఎనిమిది సెంచరీలు, 25 అర్ధ శతకాలు ఉన్నాయి. దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ (2018)కు మయాంక్ అగర్వాల్ భారత టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. పృథ్వీ షా శతక అరంగేట్రం చేసిన ఈ సిరీస్‌లో అగర్వాల్‌కు ఆడే అవకాశం దక్కలేదు.

2018 ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత జట్టులో మయాంక్ అగర్వాల్ చోటు గల్లంతైంది. అరంగేట్ర అవకాశం దక్కకపోయినా, సెలక్టర్లు మొండిచేయి చూపించారు. కానీ అనుకోకుండా వచ్చిన అవకాశం మయాంక్ అగర్వాల్ టెస్టు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆస్ట్రేలియా పర్యటనలో వార్మప్ మ్యాచ్‌లో యువ ఓపెనర్ పృథ్వీ షా గాయపడ్డాడు. పృథ్వీ షా కోలుకునేందుకు మరింత సమయం అవసరం కావటంతో, మయాంక్ అగర్వాల్‌ను ఆస్ట్రేలియాకు పిలిపించారు. అద్భుతంగా ఆడినా అవకాశం దక్కలేదనే బాధలో ఉన్న మయాంక్ అగర్వాల్.. ఊహించని పిలుపుతో ఆస్ట్రేలియా వెళ్లాడు. అరంగేట్ర ఇన్నింగ్స్‌లోనే మయాంక్ అదరగొట్టాడు. కంగారూ సీమర్లను ఎదుర్కొని 161 బంతుల్లో 76 పరుగుల విలువైన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులతో ఆకట్టుకున్నాడు. సిడ్నీ టెస్టులో 112 బంతుల్లో 77 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. 2018లో భారత్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని తొలిసారి కంగారూ గడ్డపై సాధించింది. ఈ చారిత్రక విజయంలో మయాంక్ అగర్వాల్ భాగమయ్యాడు. ఇటీవల ముగిసిన కరీబియన్ పర్యటనలో మయాంక్ అగర్వాల్ ఇబ్బంది పడ్డాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 5, 16, 55, 4 పరుగులే చేశాడు. అయినా, మయాంక్‌కు మరిన్ని అవకాశాలు ఇచ్చేందుకు సెలక్టర్లు దక్షిణాఫ్రికా సిరీస్‌కు కొనసాగించారు. పేలవ ప్రదర్శనతో భారత టెస్టు ఓపెనర్లు అందరిపైనా సెలక్టర్లు వేటు వేశారు. నాలుగు టెస్టుల ఓపెనర్ మయాంక్ మాత్రమే సఫారీ సిరీస్‌కు రెగ్యులర్ ఓపెనర్.

తొలి ఏడు టెస్టు ఇన్నింగ్స్‌ల్లో మయాంక్ అగర్వాల్ 573 బంతులెదుర్కొని 275 పరుగులు చేశాడు. ఒక్క విశాఖ టెస్టు తొలి ఇన్నింగ్స్‌నే మయాంక్ గత ఏడు ఇన్నింగ్స్‌లతో సమానమైన ప్రదర్శన చేశాడు. 371 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్సర్లతో 215 పరుగులు చేశాడు. తొలి నాలుగు టెస్టుల్లో 39.28గా ఉన్న మయాంక్ బ్యాటింగ్ సగటు.. విశాఖ డబుల్ సెంచరీతో 61.25కు పెరిగింది. ఫస్ట్ క్లాస్ ప్రదర్శనతో మయాంక్ అగర్వాల్ సంప్రదాయ టెస్టు బ్యాట్స్‌మన్‌గా రూపొందినా.. దూకుడులో వన్డే, టీ20 శైలి వదులుకోలేదు. అరంగేట్ర ఆసీస్ సిరీస్ నుంచీ మయాంక్ అదే కొనసాగిస్తున్నాడు. మంచి బంతుల్ని గౌరవించటం టెస్టుల్లో కనీస నియమం. వీరేందర్ సెహ్వాగ్ స్ఫూర్తితో బ్యాటింగ్ చేసే మయాంక్.. ఈ విషయంలో వీరూ శైలిని అనుసరిస్తాడు. మంచి బంతుల్ని గౌరవించినప్పుడు బౌలర్లు మరింత ఉత్సాహంగా బౌలింగ్ చేస్తారు. ఇది ప్రమాదకరం. అందుకే ముందుగానే మయాంక్ ఎదురుదాడి చేస్తాడు. బౌలర్‌పై ఆధిపత్యం చెలాయిస్తాడు. ఆసీస్ టూర్‌లో స్పిన్నర్ నాథన్ లైయాన్‌పై ఇది పాటించాడు. విశాఖ టెస్టులో సఫారీ స్పిన్ త్రయంపైనా మయాంక్ ఇదే సూత్రంతో చెలరేగాడు. టెస్టుల్లో మయాంక్ అగర్వాల్‌కు ఇది తొలి శతక, డబుల్ సెంచరీ. కానీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మయాంక్‌కు భారీ స్కోర్ల ఇన్నింగ్స్‌లు కొత్త కాదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మయాంక్ చివరి నాలుగు సెంచరీలు 201, 220, 176, 161 కావటం గమనార్హం. ఓ రంజీ మ్యాచ్‌లో మహారాష్ట్రపై 304 పరుగుల ట్రిపుల్ సెంచరీ సైతం బాదాడు. 57.95 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు చేసిన మయాంక్ అగర్వాల్.. విశాఖలో సంప్రదాయ టెస్టు శైలిని చూపించాడు. బ్యాట్ అడ్డంగా ఊపేందుకు ఎప్పుడూ ఉపయుక్తుడు కాలేదు. మంచి ఫుట్‌వర్క్, టెక్నిక్‌తో స్ట్రయిట్ షాట్లనే ఎక్కువగా ఆడాడు. రోహిత్ శర్మతో కలిసి 317 పరుగుల భారీ తొలి వికెట్ భాగస్వామ్యం నెలకొల్పాడు. తిరుగులేని టెక్నిక్‌తో విదేశీ పిచ్‌లపైనా రాణించగలనని నిరూపించిన మయాంక్, విశాఖ టెస్టుతో స్వదేశంలో సూపర్ డబుల్ నమోదు చేశాడు. భారత టెస్టు ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానానికి మయాంక్ అప్పుడే గట్టి పునాది వేసుకున్నాడు.

- నవతెలంగాణ క్రీడా విభాగం

**రోహిత్‌కు స్పెషల్ మర్యాద :** విశాఖ టెస్టులో ఓపెనర్‌గా 176 పరుగుల భారీ ఇన్నింగ్స్ బాదిన రోహిత్ శర్మకు డ్రెస్సింగ్‌రూమ్‌లో ప్రత్యేక మర్యాద లభించింది!. 244 బంతుల్లో 23 ఫోర్లు, 6 సిక్సర్లతో ఓపెనర్‌గా తొలి అవకాశంలో చెలరేగిన రోహిత్ తన విమర్శకులకు తిరుగులేని సమాధానం చెప్పాడు. 176 పరుగుల వద్ద రోహిత్ అవుట్ డ్రెస్సింగ్‌రూమ్‌కు వచ్చినప్పుడు కెప్టెన్ విరాట్ కోహ్లి స్వయంగా డోర్ వద్దకు వచ్చి రోహిత్‌కు అభినందనలు తెలిపాడు. ఆత్మీయంగా వెన్నుతట్టి భళా రోహిత్ అని చెప్పకనే చెప్పాడు. ఈ దృశ్యం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.



### ఆ ఫోర్ ఎందుకివ్వలేదంటే..

:విశాఖ టెస్టు రెండో రోజు తొలి సెషన్‌లో అభిమానులు ఓ విషయానికి గందరగోళ పడ్డారు!. లెగ్ బైస్ విషయంలో ఈ సందిగ్ధం వచ్చింది. కేశవ్ మహరాజ్ వేసిన ఇన్నింగ్స్ 74.4 ఓవర్లో ఆ బంతిని బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్ వదిలేశాడు. ఆ బంతి వికెట్ కీపర్ డికాక్‌నూ దాటేసి నేరుగా బౌండరీ లైన్‌కు ముద్దాడింది. దీంతో లెగ్ బైస్ రూపంలో నాలుగు పరుగులు వచ్చాయిలే అనుకున్నారు. కానీ అంపైర్ ఎటువంటి పరుగూ ఇవ్వలేదు. ఎందుకంటే ఐసీసీ క్రికెట్ రూల్ 23.1 ప్రకారం బంతి వైడ్ కాకపోతే.. బ్యాట్స్‌మన్‌ను లేదా ఏదైనా రక్షణ కవచాన్ని తగిలినప్పుడు (బ్యాట్స్‌మన్ బంతిని కొట్టేందుకు ప్రయత్నించిన సమయంలోనే) మాత్రమే లెగ్ బైస్ ఇస్తారు. ఈ నిర్ణయం అంపైర్‌కు ఉంటుంది. మయాంక్ అగర్వాల్ ఆ బంతిని పూర్తిగా వదలేశాడు. ఎటువంటి ప్రయత్నం చేయ లేదు, దీంతో లెగ్ బైస్ రూపంలో నాలుగు పరుగులు రాలేదు. వన్డే క్రికెట్‌లో వైడ్ విషయంలో కచ్చితమైన నిబంధనలు పాటిస్తారు. కానీ టెస్టుల్లో బ్యాట్స్‌మన్ బంతి కోసం ప్రయత్నించినప్పుడు, అందనంత దూ రంలో ఉందని అంపైర్ భావిస్తేనే వైడ్ ప్రకటిస్తారు. దీంతో ఆ బంతి లెగ్ సైడ్ వెళ్లిపోయినా.. అంపైర్ వైడ్ కూడా ఇవ్వలేదు.

'ఎంతో సంతోషంగా ఉంది. నా భావాలను మాటల్లో వర్ణించలేను. ఇది నా తొలి సెంచరీ. దీన్నే డబుల్ సెంచరీగా మలిచాను. రోహిత్, నేను ఇలాగే ఆడితే ప్రత్యర్థి జట్లకు కచ్చితంగా కష్టతరం అవుతుంది. మరో ఎండ్ నుంచి స్పిన్నర్లపై రోహిత్ శర్మ ఆధిపత్యం చూడటం మంచి ఫీలింగ్. ఆరంభంలో పిచ్ సీమర్లకు అనుకూలించింది. ఎండ రాగానే సీమర్ల అనుకూలత పోయింది. రెండో రోజు టీ తర్వాత టర్న్ రావటం మొదలైంది. ఇది మాకు మంచి పరిణామం. అశ్విన్, జడేజా బాగా బౌలింగ్ చేశారు'

- మయాంక్ అగర్వాల్

# ఎన్నికలు ఏకపక్షమే!

## బీసీసీఐ ఏజీఎంపై నోటీసు

**ముంబయి :** బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) నోటీసును పాలకుల కమిటీ జారీ చేసింది. నిబంధనల ప్రకారం ఏజీఎం నిర్వహణకు 21 రోజుల ముందుగా రాష్ట్ర సంఘాలకు నోటీసు ఇవ్వాలి. అక్టోబర్ 23న జరుగనున్న ఏజీఎం కోసం బీసీసీఐ గురువారం నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విధించిన కొన్ని షరతులు రాష్ట్ర సంఘాలల్లో వేడి పుట్టిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు 2018, ఆగస్టు 9 ప్రకారం జస్టిస్ లోధా కమిటీ నిబంధనలు, నూతన రాజ్యాంగం అమలు చేసిన రాష్ట్ర సంఘాలు మాత్రమే అక్టోబర్ 23 ఏజీఎం, ఓటింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నది. సెప్టెంబర్ 20, 2019న సుప్రీంకోర్టు తీర్పును వినోద్ రాయ్ ఇక్కడ పట్టించుకోలేదు. దీంతో ఎన్. శ్రీనివాసన్ బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశం నోటీసుపై మండిపడ్డారు. ఆఫీస్ బేరర్ల నియామకం విషయంలో టీఎన్‌సీఏ కొన్ని మినహాయింపుల కోసం కోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 23 నాటి ఏజీఎంకు హాజరు అయ్యే, హాజరు కాలేని రాష్ట్ర సంఘాలు ఒక్కటిగా ఉండాలనే సూత్రప్రాయ అంగీకారం ప్రస్తుతం కనిపిస్తోంది. అందుకే, ఏజీఎంలో ఓటింగ్ ప్రసక్తి ఉండే అవకాశం లేదని, ఐదుగురు ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం ఎక్కువని బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

# ఎటువంటి ఫిక్సింగ్ జరగలేదు

## టీఎన్‌పీఎల్‌పై కమిటీ నివేదిక

**చెన్నై :** తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్) 2019 సీజన్‌లో ఎటువంటి ఫిక్సింగ్ సంఘటనలు చోటు చేసుకోలేదని విచారణ కమిటీ నివేదికలో పేర్కొన్నది. ' టీఎన్‌పీఎల్‌పై కమిటీ నివేదికను అధ్యయనం చేశాం. టీఎన్‌సీఏ నివేదికను ఆమోదించాలని నిర్ణయించింది. చర్యలు తీసుకోవాల్సిన సంఘటనలు ఏమీ చోటు చేసుకోలేదని నివేదిక తెలిపింది. భవిష్యత్‌లో ఫిక్సింగ్, అవినీతి అరికట్టేందుకు అంతర్గతంగా తీసుకోవాల్సిన చర్యలను రహస్య నివేదికలో అందజేసింది' అని టీఎన్‌సీఏ ఆర్‌ఎస్ రామస్వామి తెలిపారు. ఎనిమిది జట్లతో తమిళనాడు క్రికెట్ సంఘం టీఎన్‌పీఎల్ టీ20 లీగ్‌ను నిర్వహిస్తోంది. ఈ మ్యాచులను స్టార్‌స్పోర్ట్స్ ప్రసారం చేస్తున్న సంగతి తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.